

నన్నెవరు అడుగుతారులే... అన్న ధైర్యమో... లేక నన్ను అడిగే దమ్ము ఎవరికుందిలే.. అన్న ధీమానో... తెలియదు కానీ... ఓ కాంట్రాక్టరు పంచాయతీరాజ్‌శాఖ అధికారులకే పంగనామం పెట్టాడు. టెండరు వేసేందుకు అర్హత లేకపోయినా, దర్జాగా టెండరు వేసి రూ.కోట్ల పనులను దక్కించుకున్నాడు. ఈ టెండర్ల సమయంలో కూడా అన్నీ వివాదాలే. కర్నూలుకు చెందిన ఓ వ్యక్తి ఆ కాంట్రాక్టరు మాయాజాలంపై ముఖ్యమంత్రి కార్యాలయాని (సీఎంవో)కి ఫిర్యాదు చేశారు.

- బిడ్ కెపాసిటీ లేకపోయినా టెండర్ల దాఖలు
- ఆన్ హ్యాండ్ వర్కులు చూపడంలో మతలబు
- ఇప్పటికే జిల్లాలో రూ.కోట్ల పనుల అప్పగింత
- సీఎంవోకు ఫిర్యాదు.. విచారణకు ఆదేశం

అధికారులకే పంగనామం..!

నెల్లూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అనంతసాగరం మండలానికి చెందిన ఓ కాంట్రాక్టరు చాలాకాలంగా కాంట్రాక్టు పనులు చేస్తున్నారు. జిల్లాతోపాటు కర్నూలు, అదిలాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, హైదరాబాద్ తదితర తెలంగాణ జిల్లాలోనూ పనులు చేస్తున్నారు. సాధారణంగా ప్రతీ కాంట్రాక్టరుకు వారి ఎక్స్‌పీరియన్స్‌ను బట్టి బిడ్ కెపాసిటీని నిర్ణయిస్తారు. ఆ కెపాసిటీకి లోబడే ఎక్కడైనా టెండర్లు వేయాలి. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ కాంట్రాక్టరు బిడ్ కెపాసిటీ రూ.52.60 కోట్లు మాత్రమే. ఇప్పటికే తెలంగాణలో ఒక్క ఆర్ అండ్‌బీ శాఖలోనే రూ.60 కోట్లకుపైగా ఆన్ హ్యాండ్ వర్కులున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇక కర్నూలులోని పంచాయతీరాజ్ శాఖ పరిధిలో మరో రూ.80 కోట్లు వర్కులు ఉండగా, జిల్లాలో కూడా మరో రూ.20 కోట్ల వరకూ వర్కులున్నట్లు తెలుస్తోంది. అంటే ఇప్పటికే తన బిడ్ కెపాసిటీకు మించి టెండర్లు వేసి వర్కులు తీసుకున్నారు.



● ఆన్‌హ్యాండ్ వర్కులు దాచి..

అదే సమయంలో ఇటీవల ఆత్మకూరులో ఓ రోడ్డు వర్కుకు టెండర్లు పిలవగా, అది కూడా ఆ కాంట్రాక్టరే దక్కించుకున్నారు. ఈ టెండరు సమయంలో కూడా ఇతర ప్రాంతాల్లోని ఆన్‌హ్యాండ్ వర్కులను చూపించలేదని అభియోగాలున్నాయి. ఈ టెండరు సమయంలో ఇతర కాంట్రాక్టర్లు పోటీకు రాకుండా రాజకీయ ఒత్తిళ్లు తేవడం అప్పట్లో వివాదాస్పదంగా మారింది.

ఇలా తన బిడ్ కెపాసిటీ రూ.52 కోట్లు అయితే, అందుకు రెండింతలు అధికంగా వర్కులు దక్కించుకున్నారని సీఎంవోకు చేసిన ఫిర్యాదులో ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆన్‌హ్యాండ్ వర్కులను దాచిపెట్టి అధికారులకే మస్కా కొడుతూ టెండర్లు వేస్తున్నారని, తద్వారా ఇతర కాంట్రాక్టర్లు తీవ్రంగా నష్టపోతున్నారంటూ సీఎంవోకి ఫిర్యాదు అందడంతో అక్కడి అధికారులు స్పందించారు.

పంచాయతీరాజ్‌లో ఓ కాంట్రాక్టరు మాయాజాలం

● విచారణకు ఆదేశాలు

ముఖ్యమంత్రి కార్యాలయాని (సీఎంవో)కి చేసిన ఫిర్యాదుకు సదరు కాంట్రాక్టరు ఇటు ఏపీలోనూ, అటు తెలంగాణలోనూ చేస్తున్న పనుల జాబితాను జతచేశారు. ఆ ఫిర్యాదు ప్రకారం చూస్తే ఈ కాంట్రాక్టరు పంచాయతీరాజ్ అధికారులను బురిడీ కొట్టించినట్లు స్పష్టమవుతోంది. ఈ కాంట్రాక్టరు టెండర్లపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సీఎంవో నుంచి పంచాయతీరాజ్ అధికారులకు ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. అయితే సదరు కాంట్రాక్టర్ తనకున్న రాజకీయ పలుకుబడితో సీఎంవోకు నివేదిక పంపకుండా పంచాయతీరాజ్ అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పంచాయతీరాజ్ ఇంజనీర్లలో కూడా ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఫిర్యాదు వాస్తవమే...

ఈ విషయమై పంచాయతీరాజ్ ఎస్ఈ కోటేశ్వరరావును వివరణ కోరగా ఓ కాంట్రాక్టర్‌కు సంబంధించి ఫిర్యాదు వచ్చిన మాట వాస్తవమేనని చెప్పారు. అయితే ఫిర్యాదు దారుడు తన ఫిర్యాదును వెనక్కు తీసుకున్నాడని ఆయన చెప్పడం గమనార్హం. ఓ కాంట్రాక్టరు తప్పు చేశాడని ఆధారాలతో అధికారుల దృష్టికి వచ్చాక, ఫిర్యాదుదారుడు వెనక్కు వెళ్లాడని విచారణ చేయకుండా ఉండడం ఏంటని.. పంచాయతీరాజ్ వర్గాలు గుసగుసలాడుతున్నాయి.

అయ్యోర్లకు ఆహ్వానం

- విధుల్లో చేరిన కొత్త టీచర్లు
- అభినందనలు తెలిపిన ఎంఈవోలు
- విద్యార్థులకు మిఠాయిల పంపిణీ
- స్వాగతం పలికిన ఉపాధ్యాయ సంఘాలు

ఉదయగిరి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల డీఎస్సీలో ఎంపికైన కొత్త టీచర్లు సోమవారం మండలంలోని పలు పాఠశాలల్లో విధుల్లో చేరారు. మండలానికి 34 మంది ఉపాధ్యాయులు రాగా, వారిలో ఇద్దరు ఎస్జీటీ, 32 మంది స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. ఒక్క ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోనే 15 మంది కొత్త ఉపాధ్యాయులు చేరారు. టీచర్ల నియామకంతో మండలంలో ఉపాధ్యాయుల కొరత తీరినట్లయింది. విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు ఎంఈవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అభినందనలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.

కలువాయి : డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన 20 మంది ఉపాధ్యాయులు సోమవారం మండలంలోని పలు పాఠశాలలో విధుల్లో చేరారు. ముగ్గురు ఎస్జీటీలు, 17 మంది స్కూల్ అసిస్టెంట్‌లు వారికి కేటాయించిన పాఠశాలల్లో విధులకు హాజరయ్యారు.

సీతారామపురం : మండలంలో 18 మంది కొత్త ఉపాధ్యాయులను నియమించారని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి అన్నారు. మండల పరిధిలో స్కూల్ అసిస్టెంట్లు 10 మంది , ఎస్జీటీలు ఇద్దరు, పీజీటీలు ఐదుగురు, టీజీటీ ఒకరు చొప్పున నియమితులయ్యారు. సోమవారం 17 మంది నూతన ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరారు. వీరందరిని మండల విద్యాశాఖ తరఫున అభినందిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి కోరారు.

కొండాపురం : మండలానికి 21 మంది నూతన ఉపాధ్యాయులు సోమవారం వచ్చారని ఎంఈవోలు 1, 2 కే.రవికుమార్, ఆనందరావు తెలిపారు. 21 మందిలో ఎస్జీటీలు- 6. స్కూల్ అసిస్టెంట్లు-8, ఫిజికల్ డైరెక్టర్లు ఏడుగురు ఉన్నారని వారు తెలిపారు. ఎంఈవో కార్యాలయంలో ఇద్దరికి జాయినింగ్ ఆర్డర్స్ అందచేసి, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషిచేయాలని ఎంఈవోలు కోరారు. మండలంలో కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు ఏపీటీఎఫ్-1938 ఉపాధ్యాయ సంఘం నేతలు సర్వీస్ రిజిష్టర్లను అందచేసి స్వాగతం పలికారు. మండలానికి 21 మంది కొత్తగా వచ్చినా,ఇంకా 27 మంది ఎస్జీటీలు, 4 స్కూల్ అసిస్టెంట్లు కొరత ఉందని వారు తెలిపారు.



ఉదయగిరి ఉన్నత పాఠశాలలో విధుల్లో చేరిన కొత్త టీచర్లతో ఎంఈవో వెంకటేశ్వర్లు



షేక్ నాయబ్ రసూల్‌కు జాయినింగ్ ఆర్డర్ అందజేస్తున్న సీతారామపురం ఎంఈవో మస్తాన్‌వలి

17న విద్యుత్ ప్రత్యేక అదాలత్



నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల సమస్యల పరిష్కరం కోసం ఈనెల 17న నెల్లూరులో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు నెల్లూరు టౌన్ విద్యుత్ ఈఈ ఎం శ్రీధర్ తెలిపారు. నగరంలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నెల్లూరు టౌన్, డివిజన్ పరిధి రామ్మూర్తినగర్, ఏకే నగర్, రాజేంద్రనగర్ సబ్‌డివిజన్ల పరిధిలోని వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 వరకు ఈ అదాలత్ నిర్వహిస్తామని తెలిపారు. మినీబైపాస్ రోడ్డులోని మిలీనియం సబ్‌స్టేషన్‌లో సీజీఆర్ఎఫ్ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

డీటీడబ్ల్యూవోగా సుజాత



నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా గిరిజన సంక్షేమాధికారిగా(డీటీడబ్ల్యూవో)గా కే. సుజాత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అల్లూరు సీతారామరాజు జిల్లా కందవరం అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఆమె జిల్లా గిరిజన సంక్షేమాధికారిగా పదోన్నతిపై నియమితులయ్యారు. నెల్లూరులో డీటీడబ్ల్యూవోగా పనిచేస్తున్న పరిమళ అల్లూరు సీతారామరాజు జిల్లా పాడేరుకు పదోన్నతిపై బదిలీ అయ్యారు.

గూడూరులో రియల్టర్ల దందా

- విద్యుత్ సబ్‌స్టేషన్ స్థలం కబ్జా
- అధికారులు అడ్డగించినా లెక్కచేయక రోడ్డు నిర్మాణం

గుడ్లూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడ్లూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారులు రెచ్చిపోతున్నారు. కందుకూరు - గుడ్లూరు రహదారిలోని గుడ్లూరు శివార్లలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఇటీవల ఏడు ఎకరాల్లో అనధికారికంగా వెంచర్ వేశారు. ఆ వెంచర్‌కు అనువైన రహదారి కోసం ఏకంగా విద్యుత్ సబ్‌స్టేషన్ స్థలాన్నే ఆక్రమించారు. అంతేకాక ఆ స్థలంలో రోడ్డు కూడా వేసేశారు. గుడ్లూరులో రెండు దశాబ్దాలక్రితం విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు కాగా, అప్పట్లో దాని భవిష్యత్తు అవసరాలకు సరిపడా స్థలాన్ని కేటాయించారు. తమస్థలం చుట్టూ విద్యుత్‌శాఖ కంచె ఏర్పాటుచేసుకుంది. అయితే ప్రస్తుతం ఆ సబ్‌స్టేషన్ వెనుకవైపు సరైన దారి సౌకర్యంలేని భూమిని పేదల వద్ద కారుచౌకగా కొనుగోలు చేసి రియల్టర్లు వెంచర్ వేశారు. అనంతరం సబ్‌స్టేషన్ కంచెను తీసివేసి ఆస్థలంలో విశాలమైన రహదారిని ఏర్పాటు చేశారు. సరైన ధ్రువీకరణపత్రాలు చూపించాలని పంచాయతీ అధికారులు కోరినా, వీఆర్వో వెళ్లి ఇక్కడ దారిలేదని హెచ్చరించినా వారు లెక్కచేయలేదు. ఆదివారం సాయంత్రం ఎక్స్‌కవేటర్‌తో కంచెను తొలగించి చదును చేశారు. సోమవారం ట్రాక్టర్లతో మట్టితోలి రోడ్డు నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వరంగ సంస్థలకు కేటాయించిన స్థలాలకే రక్షణ లేకపోతే, సామాన్యుల మాటేమిటని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా, ఆ స్థలం విద్యుత్‌శాఖకు కేటాయించిన స్థలమని నిర్ధారణ అయిందని, అందువల్ల దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆ శాఖ అధికారులదేనని పేర్కొన్నారు.



వెంచర్ కోసం విద్యుత్ సబ్‌స్టేషన్ స్థలాన్ని ఆక్రమించి, నిర్మిస్తున్న రోడ్డు

పోలీసులకు ఫిర్యాదు చేస్తాం...

గుడ్లూరులో విద్యుత్ సబ్‌స్టేషన్ స్థలాన్ని ఆక్రమించి, రియల్టర్లు రోడ్డు నిర్మాణం చేస్తుండటాన్ని ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణించారు. ఈ విషయమై తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. సబ్‌స్టేషన్ స్థలాన్ని కాపాడుకునేందుకు చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

- విద్యుత్‌శాఖ ఇన్‌చార్జి ఏఈ టీ. మధుబాబు

వరద పెరిగితే గేట్ల ఎత్తివేత!

- నిండుకుండలా జలాశయాలు
- వచ్చే రెండు నెలలు జాగ్రత్త
- ఆ దిశగా అధికారుల చర్యలు

సోమశిలలో దెబ్బతిన్న 11,12 గేట్ల రోప్‌లు



దాదాపు పూర్తి సామర్థ్యం మేరకు నీటితో నిండిన సోమశిల జలాశం

అనంతసాగరం అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రధాన జలాశయాలు నిండుకుండను తలపిస్తున్నాయి. జిల్లాకు ఇప్పటివరకు సరైన వర్షపాతం నమోదు కాకపోయినా, ఇతర ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. ముఖ్యంగా సోమశిల ఎగువన తెలుగుగంగతో జిల్లాకు నీటిల భ్రత పుష్కలంగా చేకూరింది. శ్రీశైలంకు జూరాల, సుంకేసుల నుంచి గత నెలలో భారీగా వరద రావడంతో అక్కడ నుంచి పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ ద్వారా రాయలసీమ ప్రాజెక్టుల నీటి అవసరాలు తీరాయి. అంతేకాక కృష్ణాజలాలతో సోమశిల, కండలేరు జలాశయాలు పూర్తిసామర్థ్యానికి చేరుకున్నాయి. ఇక రానున్న రోజుల్లో సరిపడా సాగు, తాగు నీటి అవసరాలు తీరాయి. కాగా ఈనెల చివరివారంతోపాటు, నవంబరులో కోస్తాంధ్రలో భారీవర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆ దిశగా జాగ్రత్తలు తీసుకొంటున్నారు. సోమశిల పూర్తిసామర్థ్యం 78 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 74, కండలేరు పూర్తిసామర్థ్యం 65 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 60 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. ఒక్కసారిగా భారీవరద వస్తే దిగువ ప్రాంతాల్లో ముప్పు వాటిల్లకుండా నీటిమట్టం తగ్గించుకొని, జలాశయాలకు వచ్చే వరదను అంచనా వేస్తూ అధికారులు కిందకు నీటిని విడుదల చేస్తున్నారు. అంతేకాక ప్రాజెక్టుల పటిష్ఠతపై కూడా దృష్టి సారిస్తున్నారు. సోమశిల పరిధిలో 11,12 గేట్ల రోప్‌లు తీవ్రంగా దెబ్బతినగా, వాటిని ఎత్తే పరిస్థితి లేదు. ఇక మిగిలిన వాటిని వినియోగించుకుంటూ వరదలు తగ్గేవరకు జాగ్రత్తలు పాటిస్తున్నారు.

అప్రమత్తంగా ఉన్నాం...

ఎగువ నుంచి వచ్చే వరదను అంచనా వేస్తూ నీటిని దిగువకు వదులుతున్నాం. ఈ సీజన్ వెళ్లే వరకు ప్రజలు పెన్నానదిలోకి వెళ్లవద్దని, అలాగే పశువులను తోలవద్దని ఆదేశాలు ఇచ్చాం. ఆదిశగా ప్రజలను అప్రమత్తం చేశాం. వరద తీవ్రత చెప్పలేం. అయినా జాగ్రత్తగా ఉండాలి.

- శ్రీనివాసకుమార్, ఈఈ సోమశిల

సోమశిలకు 14,273 క్యూసెక్కుల ప్రవాహం

సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం 14,273 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో డ్యాంలో 74.066 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పవర్ టెన్నల్ ద్వారా దిగువకు 2,600, గేట్ల ద్వారా 7,500, ఉత్తర కాలువకు 50, కండలేరుకు వరద కాలువ ద్వారా 3,800 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామన్నారు.

కండలేరులో 59.780 టీఎంసీలు

రాపూరు, (ఆంధ్రజ్యోతి) : కండలేరు జలాశయం పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 59.780 టీఎంసీల నీరు ఉందని డ్యామ్ ఏఈ అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 3400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, అవుట్‌ఫ్లో 2200 క్యూసెక్కులని తెలిపారు.

ఇంటర్ కళాశాలల్లో ప్రాక్టికిల్స్

- ప్రైవేటు కాలేజీల్లో అటకెక్కిన పరికరాలు
- రికార్డుల్లోనే ప్రయోగశాలలు
- ల్యాబ్‌లు ఉన్నా మొక్కుబడిగానే నిర్వహణ

నెల్లూరు(విద్య), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్‌లో సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలే కీలకం. ఇందులో మార్కులు తగ్గితే ఎంసెట్, నీట్, ఐఐటీ-జేఈఈలో వెయిటేజీ తగ్గుతుంది. ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ప్రయోగశాలలు రికార్డులకే పరిమితమయ్యాయి. పరీక్షల గడువు ముంచుకొస్తుండగా అభ్యాసంపై అలక్ష్యం నెలకొంటోంది. జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో వసతులు లేక కొన్ని చోట్ల, వసతులు ఉన్నా కూడా అవసరమైన పరికరాలు, రసాయనాలు లేక మరి కొన్ని చోట్ల.. పేరుకే ప్రాక్టికల్స్‌గా మారాయి.

● నామమాత్రంగా ప్రయోగాలు

ఇంటర్ విద్యలో ప్రయోగాలు నామమాత్రంగా మారా యి. ప్రభుత్వం పాఠశాల స్థాయి నుంచే ప్రయోగాలు చేయిస్తుండగా ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు మాత్రం అటకెక్కించేశాయి. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు మొత్తం 187 ఉన్నాయి. వీటిలో 116 ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలుండగా, ప్రభుత్వ కళాశాలలు 24, ఎయిడెడ్ 2, మోడల్ 11, సోషల్ వెల్ఫేర్ 6, కేజీబీవీలు 12, హైస్కూల్ ప్లస్ 16 కళాశాలలు కలిపి మొత్తం 71 కళాశాలలు ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్నాయి. వీటిల్లో 53 వేల మంది విద్యార్థులు ఇంటర్ చదువుతున్నారు. అధికశాతం కళాశాలల్లో ప్రయోగశాలలు కరువయ్యాయి. కొన్ని పాడుబడిన భవనాల్లో దర్శనమిస్తుండగా, మరికొన్ని కళాశాలల్లో అసలు గదులు కేటాయింపే జరగలేదు. దీంతో బల్లలపైనే విద్యార్థులు మొక్కుబడిగా ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. భవనాలు ఉంటే అవసరమైన బల్లలు, ర్యాకులు, బీరువాలు లేవు.కొన్ని కళాశాలల్లో గదులు కేటాయించినా పరికరాలు, రసాయనాలకు కొరత తీవ్రంగా ఉంది.



నగరంలోని ఓ కళాశాలలో ప్రాక్టికల్స్‌ను పరిశీలిస్తున్న ఆర్ఐవో (ఫైల్)

● మొక్కుబడిగా నిర్వహణ

అసలు ఇప్పటి వరకు ఏ కళాశాలలో కూడా ప్రాక్టికల్స్ తరగతులు నిర్వహించిన దాఖలాలే లేవు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు తప్పనిసరిగా మొదటి సంవత్సరం నుంచే ప్రాక్టికల్స్ పరీక్షలు ఉంటాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు విడివిడిగా ఒక్కో సబ్జెక్టుకు వారానికి రెండు పీరియడ్లు నిర్వహించాలి. అంటే నాలుగు సబ్జెక్టులకు కలిపి ఎనిమిది పీరియడ్లు నిర్వహించాలి. బైపీసీ విద్యార్థులకు నెలకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టులకు కలిపి మొత్తం 32 పీరియడ్లు, ఎంపీసీ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులకు 15 పీరియడ్లు నిర్వహించాలి. అయితే ఇవి ఎక్కడా కూడా అమలు కావడం లేదు.

● ఈపడాది ఎలానో..

ప్రాక్టికల్స్‌లో మార్పులు తీసుకువచ్చేందుకు ఇంటర్‌బోర్డు జంబ్లింగ్ విధానం అమల్లోకి తీసుకు వస్తుందా లేదా అన్న దానిపై ఇంకా ఆదేశాలు రాలేదు. అయితే ప్రభుత్వం జంబ్లింగ్ విధానంలో నిర్వహించినా, నాన్ జంబ్లింగ్‌లో నిర్వహించినా కూడా తమకేమీ పట్టదన్నట్లు ప్రైవేట్ కళాశాలలు వ్యవహరిస్తున్నాయి. ప్రాక్టికల్స్ సమయంలో అధికారులతో కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు ఆర్థిక ఒప్పందాలు చేసుకుంటూ ఇప్పటి వరకు గట్టెక్కామని, ఇకపై కూడా అదే తంతు తిరిగి కొనసాగిస్తామంటూ బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. అరకొర జ్ఞానంతో విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు వెళ్లినా, కళాశాల యాజమాన్యం నిర్ణయించిన ధర చెల్లిస్తే ఆ విద్యార్థి ప్రాక్టికల్స్‌లో ఉత్తీర్ణత సాధిస్తారు.సంబంధిత ఇంటర్‌బోర్డు అధికారులు వీరికి పూర్తి సాయం అందించి, వారి ఒప్పందాల ప్రకారం నడుచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి..

పక్కాగా నిర్వహించాలి..

జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు జూనియర్ కళాశాల్లో ప్రయోగ తరగతులు పక్కాగా నిర్వహించాలి. ఇప్పటికే క్షేత్రస్థాయిలో ఆదేశాలిచ్చాం.నేనే జిల్లా అంతా పర్యటిస్తూ ల్యాబ్‌లు, వసతులు ఎలా ఉన్నాయన్న అంశాలను పరిశీలిస్తున్నా. ఇంటర్‌బోర్డు నిబంధనల ప్రకారం ప్రతి కళాశాల నడుచుకోవాల్సిందే. ఎక్కడైనా ఇబ్బందులుంటే మా దృష్టికి తీసుకురావాలి.

- వరప్రసాదరావు, ఆర్ఐవో

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,బౌరం క్యూ పార్క్, జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710.

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీ పై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలం పాటను మేము దిగువ తెలిపిన తేదిన వేలం చేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యలు ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదిని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

వేలం వేయు తేది: 25.10.2025 వేలం వేయు చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఇం.నం.27-2-7, జి.ఎన్.టి రోడ్, పద్మావతి ప్లాజా, 3వ అంతస్తు, ఎ కె నగర్ నెల్లూరు-524004

లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు	లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు
KVAL1PJ2504120001	KODURU RAGHURAM	KVAL1PJ2504230001	BUCCHIMAGARI BABU

పైన ఉదహరించిన చిరునామాల వద్ద వేలం వేయడం జరుగుతుంది. వేలం సమయం:11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవడటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ P BABU ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కానీ యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిసాయి.

తేది: 13.10.2025
స్థలం : నెల్లూరు

సం/- అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

టపాసుల విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

రాపూరు, అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా దీపావళి టపాసులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని రాపూరు ఎస్ఐ వెంకట్ రాజేష్ సోమవారం తెలిపారు. దీపావళిని పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ టపాసులు కాల్చుకోవటం ఆనవాయితీ అని, అయితే టపాసుల దుకాణాల వ్యాపారులు తప్పకుండా అనుమతులు తీసుకోవాలన్నారు. నిర్వాహకులకు కేటాయించిన ప్రదేశాలలోనే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. షాపుల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా సదుపాయాలను సమకూర్చుకోవాలన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11907
వెండి కిలో ధర	రూ. 176700
వెండి ఒక గ్రాము	రూ. 185.00

నేడు వేగూరులో గ్రామసభ

కోవూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వేగూరు గ్రామంలో ముసాయిదా భూమి రిజిస్టర్ ఆమోదం కోసం మంగళవారం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు సీ హెచ్ సుబ్బయ్య తెలిపారు. మూడో ఫేజ్ కింద గ్రామంలో భూసర్వే చేసి, గ్రామ సచివాలయంలో ఎంపిక చేసిన ముసాయిదా భూమి రిజిస్టర్‌ను ప్రకటించామ న్నారు. రీసర్వేలో ఏమైనా అభ్యంతరాలుంటే తెలిపి, ముసాయిదా భూమి రిజిస్టర్‌కు ఆమోదం తెలియజేయాలని కోరారు.

కౌలు రైతులకు ఆర్థిక సాయం అందించాలి

కోవూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కౌలురైతులు ఒక్కొక్కరికి రూ. 20 వేల చొప్పున ఆర్థికసాయం అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం నాయకులు సోమవారం రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దారు సీహెచ్ సుబ్బయ్యకు వినతి పత్రం అందజేశారు. కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి తుళ్ళూరు గోపాల్ మాట్లాడుతూ కౌలు రైతుల గుర్తింపునకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతుల కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో సంఘం నాయకులు గండవరపు శేషయ్య, బుజ్జయ్య, కుడుమల మోహనరావు, చిట్టిబాబు, రామచంద్ర య్య తదితరులు పాల్గొన్నారు.

యూరియా ఎకరాకు 3 బస్తాలే..



మాట్లాడుతున్న ఏడీఏ శివనాయక్

మనుబోలు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వచ్చే వ్యవసాయసీజన్‌లో రైతులకు ఎకరాకు కేవలం 3బస్తాలే యూరియా ఇవ్వాలని ఏడీఏ శివనాయక్ హెచ్చరించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఎరువుల దుకాణాల డీలర్లతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏడిఏ మాట్లాడుతూ రైతులకు యూరియా పంపిణీపై కార్డులు జారీ చేస్తామన్నారు. కార్డు కింద ఎకరాకు 3బస్తాలు యూరియా ఇవ్వాలన్నారు. అదనంగా కావాలంటే నానో యూరియా ఇవ్వాలే తప్ప మామూలు యూరియా ఇవ్వరాదన్నారు. ఈ నిబంధనను ప్రతి డీలర్ పాటించాలన్నారు. అనంతరం వీఏఏలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు.

రాపూరులో పశువైద్య శిబిరం



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న అధికారులు

రాపూరు, అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి): రాపూరు మండలంలోని ఏపూరు గ్రామంలో నెల్లూరు రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో సోమవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స, దూడలకు నత్తలు నివారణ మందులు, పాడి పశువులు కట్టుకు రావడానికి మినరల్ మిక్చర్ ప్యాకెట్, లివర్ టానిక్ అందచేశారు. గ్రామంలో రైతులు పెయ్య దూడ మాత్రమే పుట్టే సెక్స్ సార్టెడ్ సెమెన్ వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస రావు, రాపూరు అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎంవీ అనిల్ కుమార్ హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో రాపూరు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శివ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు. పాడి రైతులను ప్రోత్సహించేందుకు గో సంజీవని పుస్తకాలు అందజేశారు.

టీడీపీ నేత ఆర్థిక సాయం

మండలంలోని గోనుపల్లి గ్రామానికి చెందిన అరుంధతీ కాలనీ వాసి చేవూరు పెంచలమ్మ సోమవారం మరణించగా, అంత్యక్రియల కోసం తెలుగుదేశం పార్టీ నాయకులు ఈగ రాజారెడ్డి రూ. 5 వేలు ఆర్థిక సాయం అందించారు. అనంతరం కుమారుడు పెంచలయ్య, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జీఎస్టీపై అవగాహన ర్యాలీ

ఆత్మకూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జీఎస్టీ నిబంధనలు, తద్వారా తగ్గిన ధరలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆత్మకూరు పట్టణంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రమేష్ ఆధ్వర్యంలో స్కూటర్ ర్యాలీ నిర్వ హించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ పాల్గొన్నారు.

పన్ను విధానాలపై అవగాహన పెంచుకోవాలి

వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సునీత, వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త కమిషనర్ కిరణ్ తదితరులు

వెంకటాచలం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : పన్ను విధానాల పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో సోమవారం వీఎస్‌యూ, వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0 సంస్కరణాలు (సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్) అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా ఆయన విచ్చేసి మాట్లాడారు. జీఎస్టీ 2.0 నూతన సంస్కరణాలు దేశ ఆర్థిక వ్యవస్థను సమగ్రమైన పారదర్శకత వైపు నడిపించనున్నాయన్నారు. ఈ సంస్కరణల ద్వారా వ్యాపార వాతావరణం సులభతరం అవుతుందన్నారు. వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త కమిషనర్ కిరణ్ మాట్లాడుతూ జీఎస్టీ 2.0 సంస్కరణలు వాణిజ్య రంగంలో కొత్త అవకాశాలను నెలకొల్పుతాయన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



ఇసుకను ట్రాక్టర్లలో నింపుతున్న అక్రమార్కులు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నా పరీవాహక ప్రాంతమైన శ్రీరంగరాజపురం (బాపనపాడు) ఇసుక రీచ్‌లో సోమవారం అక్రమంగా ఇసు కను తరలిస్తున్న తొమ్మిది ట్రాక్టర్లను పోలీ సులు అదుపులోకి తీసుకున్నారు. జొన్నవాడ రీచ్‌నుంచి ఇసుక తరలిస్తున్న వాహనాలపై దాడులు నిర్వహించామని, ట్రాక్టర్లను స్వా. దీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

మినీ స్టేడియంతో క్రీడాకారుల కలల సాకారం!



సర్వే పనులను పరిశీలిస్తున్న టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునయాదవ్

ముత్తుకూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఏళ్లతరబడి క్రీడాకారుల కలగా మారిన మినీ స్టేడియం నిర్మాణం సాకారం కానున్నదని మండల టీడీపీ అధ్యక్షులు నీలం మల్లికార్జునయాదవ్ తెలిపారు. సోమవారం మండల కార్యాలయాల వెనుక ఉన్న స్థలాన్ని మినీ స్టేడియం నిర్మాణం కోసం సర్వే చేశారు. సర్వే పనులను మల్లికార్జునయాదవ్, అదాని ఫౌండేషన్ హెడ్ రంజన్‌రాజేష్‌తో కలిసి పరిశీలించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కృషితో క్రీడాకారుల కల నెరవేరుతోందన్నారు. అదాని కృష్ణపట్నం పోర్టు ఫౌండేషన్‌ల సహకారంతో సీఎస్ఆర్ నిధులతో మండల కార్యాలయాల వెనుక మినీ స్టేడియం నిర్మాణం చేపట్టనున్నామన్నారు. ఎందుకు సంబంధించి సోమవారం సర్వే పనులు ప్రారంభమయ్యాయన్నారు. త్వరలో స్టేడియం నిర్మాణం పనులను ప్రారంభిస్తారని తెలిపారు. క్రీడాభివృద్ధికి తమ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతని ఇస్తుందన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి అదాని పోర్టు ప్రతినిధులతో మాట్లాడి స్టేడియం నిర్మాణానికి కృషి చేయడం పట్ల క్రీడాకారులలో హర్షం వ్యక్తం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదాని ఫౌండేషన్ ప్రతినిధులు టీడీపీ నాయకులు బొలిగర్ల శ్రీనివాసులు, అక్కయ్యగారి ఏడుకొండలు, పట్టపు శోభన్, కావలి విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ఎమ్మెల్యే ప్రశాంతి ధ్యేయం

వాలీబాల్, క్రికెట్ కిట్లు అందించిన లక్ష్మీనరసారెడ్డి



యువకులకు క్రికెట్ కిట్లు అందిస్తున్న టీడీపీ నాయకుడు లక్ష్మీనరసారెడ్డి

కోవూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) నియోజకవర్గ ప్రజాసంక్షేమానికి శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కృషిచేస్తున్నారని పాటూరు నీటిసంఘాల ఉపాధ్యక్షుడు శింగారెడ్డి లక్ష్మీనరసారెడ్డి పేర్కొన్నారు. గంగవరం నూతన గ్రామ టీడీపీ అధ్యక్షులు తలారి ఏడుకొండలు, కార్యవర్గం సోమవారం కలిసి లక్ష్మీనరసారెడ్డికి సన్మానం చేశారు. గ్రామాభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యకర్తలకు అండగా నిలవాలన్నారు. అనంతరం యువకులకు వాలీబాల్, క్రికెట్ కిట్లను అందించారు. ఈకార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు తలారి ఏడుకొండలు, ఉపాధ్యక్షులు దామెర్ల సుధాకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వినోద్, అనిల్, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

వెంకటాచలంలో నకిలీ మద్యంపై వైసీపీ నిరసన



ర్యాలీ నిర్వహిస్తున్న వైసీపీ నేతలు, కార్యకర్తలు

వెంకటాచలం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలంలో సోమవారం కల్తీ మద్యాన్ని అరికట్టాలంటూ వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ నేతలు ర్యాలీ చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామాల్లో ఎక్కడ చూసిన విచ్చలవిడిగా బెల్టు దుకాణాలను నడుస్తున్నాయని, వాటిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. బెల్టు దుకాణాలు బహిరంగంగా నడుస్తున్న అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నకిలీ మద్యం కారణంగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందన్నారు. వెంటనే బెల్టు దుకాణాల్లో నకిలీ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని, వాటిపై ప్రభుత్వం వెంటనే స్పందించి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు సుధీర్‌రెడ్డి, మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, మండల వెంకటశేషయ్య, సురేష్‌కుమార్‌రెడ్డి, కనుపూరు కోదండరామిరెడ్డి, భాస్కర్ గౌడ్, వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, శంకరయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి రిజర్వాయర్‌ను కాపాడండి

జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు



డిప్యూటీ తహసీల్దారుకు వినతి పత్రాన్ని అందజేస్తున్న జనసేన నేతలు

వెంకటాచలం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆక్రమణలకు గురవుతున్న సర్వేపల్లి రిజర్వాయర్‌ను కాపాడాలని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు డిమాండ్ చేశారు. వెంకటాచలంలోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కు ఆయన జనసేన నేతలతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి రిజర్వాయర్ జిల్లాలోనే రెండవ అతిపెద్ద రిజర్వాయర్ అని అన్నారు. వైసీపీ హయంలో రిజర్వాయర్‌ను గొలగమూడి, కంటేపల్లి, తిక్కవరప్పాడు పరిసర ప్రాంతాల వారు ఆక్రమించుకున్నారు. అలాగే రిజర్వాయర్‌లో వైసీపీ నేతలు వారి పాలనలో గ్రావెల్‌ను విచ్చలవిడిగా కొల్లగొట్టి ప్రజా సంపదను దోచుకున్నారన్నారు. వెంటనే సర్వేపల్లి రిజర్వాయర్‌తోపాటు చెరువులన్నింటికి సర్వే చేయించి వాటికి హద్దులు ఏర్పాటు చేసి కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ శాఖపైనే ఉందన్నారు. కార్యక్రమంలో జనసేన నేతలు పినిశెట్టి మల్లికార్జున్, చల్లా చెంచయ్య, విష్ణు, వెంకటేశ్వర్లు, వినోద్, వెంకటేష్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాల నిల్వల తనిఖీ



తనిఖీలు నిర్వహిస్తున్న సహాయ సంచాలకులు శ్రీదేవి

ముత్తుకూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ముత్తుకూరు మండలంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తన దుకాణాలు, సహకార సొసైటీలను సోమవారం నెల్లూరు సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాల కులు శ్రీదేవి, మండల వ్యవసా యాధికారిణి జ్యోత్స్న రాణితో కలిసి తనిఖీ చేశారు. నిల్వలు, అమ్మకాలకు సంబంధించి రిజిస్టర్‌లో నమోదైన వివరాలను పరిశీలించారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసి ధరల పట్టికను దుకా ణంలో ప్రదర్శించాలని డీలర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవ సాయ విస్తరణాధికారి దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్సు లేకుండా ఎరువులు విక్రయిస్తే చర్యలు

ఆత్మకూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): లైసెన్సు లేకుండా ఎవరైనా విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని నెల్లూరు ఏడీఏ వి దేవసేనమ్మ హెచ్చ రించారు. పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకా ణాలను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాకు రిజిష్టరు, బిల్లు పుస్తకాలు, పురుగు మందులు, విత్తనాల నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లా డుతూ ఈ తనిఖీలలో సరైన పత్రాలు లేని రూ. 34400 విలువచేసే పురుగు మందుల స్టాకు విక్రయాలను నిలుపు దల చేశామన్నారు. రైతులు విత్తనాలను అధీకృత డీలరు వద్దనే కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా బిల్లులు తీసు కోవాలన్నారు. విత్తనాల మొలక శాతం సరిగా లేకపోతే స్థానిక వ్యవశాయశాఖ అధికారులకు తెలియచేయాల న్నారు. కార్యక్రమంలో ఎంఏవో కె కిశోర్‌బాబు పాల్గొన్నారు.

● **మర్రిపాడు:** మండలంలో ఎరువులు, పురుగు మం దుల దుకాణాలను కావలి ఏడీఏ నాగరాజు సోమవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టరు పరిశీలించారు. అనుమతి లేని విత్తనాలు కొన్నింటిని పరిశీలించి వాటి అమ్మకాలను నిలుపుదల చేశారు. ఆయన వెంట ఉద యగిరి ఏడీఏ చె న్నారెడ్డి, ఏఓ విజ య్ భాస్కర్, మర్రి పాడు ఏఓ కవిత తదితరులున్నారు.

● **ఉదయగిరి :** పట్టణంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణా లను సోమవారం కావలి వ్యవసాయ సహాయ సంచా లకులు నాగరాజు వ్యవసాయ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా దుకా ణాల్లో ఎరువులు, పురుగుమందుల క్రయ, విక్రయాల రికార్డులు, ఇన్‌వాయిస్ బిల్లులు, గోదాముల్లో నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం శ్రీబాలాజీ ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణ గోదాము జీఎస్టీ లైసెన్సు లేనందున రూ.1,59,500 విలువ కలిగిన విత్తనాల అమ్మ కాలను నిలుపుదల చేశారు. అన్ని దుకాణాల యజ మానులు బిల్లు పుస్తక నిర్వహణ సక్రమంగా నిర్వహిం చేలా చర్యలు అధికారులు తీసుకోవాలన్నారు. నకిలీ ఎరువులు, పురుగు మందులు, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ పీ చెన్నారెడ్డి, వ్యవసాయాధికారి విజయభాస్కర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల బీమా చెల్లింపులకు నిధుల విడుదల

అమరావతి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీం కింద రూ.5.30 కోట్ల విలువైన క్లైములను ఉపయోగించుకోవటానికి ప్రభుత్వం మత్స్యశాఖకు అనుమతి ఇచ్చింది. 19 జిల్లాల్లోని 106 మంది మత్స్యకారుల డెత్ క్లైములను పరిష్కరించడానికి ఈ నిధులు విడుదల చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఐటీఐకి రహదారి పనుల ప్రారంభం

సంగం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటేశ్వరపురంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ భవనాల అభివృద్ధికి లగడపాటి రామలక్ష్మమ్మ చేతుల మీదుగా సోమవారం భూమిపూజ చేశారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ గ్రామంలో అర్థాంతరంగా ఆగిన భవనాలను ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు దాతృత్వంగా ప్రకటించిన విషయం విదితమే. ఆగిన భవనాల నిర్మాణంతోపాటు రహదారి నిర్మాణానికి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇటీవల రూ. 40 లక్షల సీఎస్ఆర్ నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో సిమెంట్ రహదారి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి, షేక్ బాబు, కంచర్ల నారాయణ నాయుడు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

- మరో ఇద్దరికి గాయాలు
- వాహనాల మధ్య ఇరుక్కున్న ట్రక్కు




మన్సూర్,సురేష్‌రెడ్డి మృతదేహాలు

నెల్లూరు (క్రైం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కోల్‌కత్తా - చెన్నై జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో జీవనోపాధి నిమిత్తం వెళుతున్న ఇద్దరు దుర్మరణం చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... కోవూరు పట్టణంలోని ఇంద్రలోక్ అవెన్యూలో ఎస్‌కే మన్సూర్ కుటుంబం నివాసం ఉంటుంది. ఆయన హోటళ్లు, ఆసుపత్రుల నుంచి మాసిన బట్టలు తీసుకొని వచ్చి వాటిని ఉతికి తిరిగి ఇచ్చే వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అతని వద్ద బీహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తులు పని చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం కోవూరు నుంచి టాటా ట్రక్కు వాహనంలో విడవలూరు మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన డ్రైవర్ పుచ్చపల్లి సురేష్‌రెడ్డి(49)తో కలసి నెల్లూరు నగరంలోని జీజీహెచ్‌కు బయలుదేరారు. మన్సూర్(28) డ్రైవర్‌తో పాటు ముందు క్యాబిన్‌లో కూర్చోగా, బీహార్ రాష్ట్రానికి చెందిన అక్రమ్, అనిల్, షమీమ్‌లు వెనుక ట్రక్కులో బట్టలు వేసుకొని అక్కడే కూర్చున్నారు. ఉదయం 8 గంటల సమయంలో ఈ వాహనం జాతీయ రహదారిపై నగరంలోని ప్రశాంతినగర్ జంక్షన్ వద్దకు రాగా వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రక్కు ముందు వెళుతున్న లారీను ఢీకొనడంతోపాటు రెండు వాహనాల మధ్య ఇరుక్కుపోయింది. ఈ ప్రమాదంలో ముందు కూర్చుని ఉన్న డ్రైవర్ సురేష్‌రెడ్డి, ఎస్‌కే మన్సూర్‌లు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. వెనుక ట్రక్కులో ఉన్న అక్రమ్‌కు రెండు కాళ్లకు తీవ్రగాయాలు కాగా అనిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. షమీమ్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న నార్త్‌ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. సమాచారం అందుకున్న మృతుల కుటుంబ సభ్యులు జీజీహెచ్ మార్చురీకి చేరుకొని కన్నీరుమున్నీరయ్యారు. మృతుడు మన్సూర్ తండ్రి ఎస్‌కే మస్తాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన కొండలరావు

వెంకటాచలం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకు టూరు వద్ద జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాకుటూరు గ్రామానికి చెందిన కొండల రావు (47) విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో సెక్యూరిటీ గార్డు గా పని చేస్తున్నాడు. రోడ్డు దాటుతుండగా గూడూరు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో కొండలరావు అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నెల్లూరు ప్రభుత్వా సుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ నాయకుడిపై.. మరో వైసీపీ నేత దాడి

నెల్లూరు(క్రైం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఓ వైసీపీ నాయకుడిపై మరో వైసీపీ నాయకుడు తన అనుచరులతో కలసి దాడి చేసిన [illegible]రికి గాయాలవడంతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. రియల్ ఎస్టేట్ లావాదేవీలే ఇందుకు కారణం. పోలీసుల కథనం మేరకు... నగరంలోని కోటమిట్ట నెక్లెస్ రోడ్డు ప్రాంతానికి చెందిన సయ్యద్ మున్వర్ నగరంలోని ట్రంకురోడ్డులో గాంధీబొమ్మకు సమీపంలో కలర్స్ ప్లాజా వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నారు. ఈయన వైసీపీలో నాయకుడుగా ఉంటూ వస్త్ర దుకాణంతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. కాగా సయ్యద్ మున్వర్ ఆరేళ్ల క్రితం కోటమిట్ట ప్రాంతానికి చెందిన వైసీపీ నాయకుడు, వక్ఫ్‌బోర్డు మాజీ జిల్లా అధ్యక్షుడు మీరామొహిద్దీన్ ఉరఫ్ మీరా, మరి కొంతమంది భాగస్వాములతో కలసి నగరంలోని రవీంద్రనగర్‌లో కొంత స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆ స్థలం కొంత మేరకు ఆక్రమణకు గురి కావడంతో ఆ స్థలాన్ని విక్రయించేందుకు చట్టరీత్యా ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ క్రమలో మీరామొహిద్దీన్ ఆ స్థలంకు చెందిన డబ్బులు ఇవ్వాలని మున్వర్‌పై కొద్ది రోజులుగా ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో మున్వర్ వైసీపీ నాయకులు అబ్దుల్‌మస్తాన్‌కు విషయం తెలిపి మీరామొహిద్దీన్‌తో మాట్లాడి సయోధ్య ఏర్పాటు చేయాలని కోరారు. ఈ క్రమంలో ఈనెల 12వ తేదీ రాత్రి అఫ్సర్, మసూద్‌లు మద్యం సేవించి కలర్స్ దుకాణం వద్దకు వచ్చారు. మున్వర్‌ను దుకాణం బయటకు రావాలని కోరారు. అతను రానని చెప్పడంతోఆటు ఈ విషయాన్ని ఫోన్ ద్వారా అబ్దుల్‌మస్తాన్‌కు తెలియజేశారు. కొద్ది సేపటికి అన్వర్ అనే వ్యక్తి దుకాణం వద్దకు చేరుకొని బయటకు రాకుంటే చంపుతానని మున్వర్‌ను బెదిరించాడు. అయినా అతను రాకపోవడంతో అక్కడ నుంచి వెళ్లిపోయాడు. కొద్ది సేపటి తర్వాత మీరామొహిద్దీన్, తని అనుచరులు ఎస్ అల్తాఫ్, అఫ్సర్, ఆరీఫ్, నాజర్, రబ్బాని మరి కొంతమంది దుకాణం లోపలికి రూరి ఈరోజు డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తామని బెదిరించారు. వారి వెంట తెచ్చుకున్న కర్రలు, రాడ్లతో మూకుమ్మడి దాడి చేశారు. ఈ దాడిలో మున్వర్ తలకు, కంటికి, అతని అల్లుడుకు గాయాలయ్యాయి. అక్కడే ఉన్న కొందరు వారిని వెంటనే చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. చిన్న బజారు పోలీసులు వైద్యశాలకు చేరుకొని మున్వర్ ఫిర్యాదు మేరకు పలువురిపై కేసు నమోదు చేశారు. అనంతరం సోమవారం రాత్రి దాడికి పాల్పడిన వారిలో ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు.

రైలు నుండి పడి యువకుడి మృతి

కావలి రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ముసునూరు సమీపంలోని ఎగువమార్గం లో సోమవారం ఉదయం ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ రైలు నుండి ప్రమాద వశాత్తు జారిపడి ఓ గుర్తు తెలియని యువకుడు (23) మృతి చెందాడు. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రైలు పట్టాలపై తీవ్రగాయాలతో పడి ఉన్న ఓ యువకుడిని కీమెన్ మరియాదాసు గుర్తించి 108 వాహనంలో ఏరియా వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్రావ్ తెలిపాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి...

బిట్రగుంట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ముంగమూరు జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి కావలి వైపు నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో జనతాపేటకు చెందిన పాలవెల్లి పద్మనాభరెడ్డి (59) మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డిని కలవడానికి ఆదివారం మోటరు సైకిల్‌పై ముంగమూరు జాతీయ రహదారి కూడలి నుంచి కావలి వైపు వస్తుండగా, నెల్లూరు వైపు వెళుతున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన పద్మనాభరెడ్డిని నెల్లూరుకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.

చిల్లర దొంగ అరెస్ట్

మనుబోలు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): చోరీలకు పాల్పడుతున్న ఓ చిల్లర దొంగను పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తర లించారు. కేరళలోని త్రిశూర్‌కు చెందిన విన్సెంట్ సిమెథీ చిల్లర దొంగ తనాలు చేస్తుంటాడు. ఒంగోలు జిల్లాలో ఇతనిపై రెండు కేసులు నమోదయ్యాయి. మనుబోలు సూపర్ మార్కె ట్లలో చోరీలకు పాల్పడ్డాడు. జట్లకొండూరులో పోలీసులు అదుపులోకి తీసు కుని గూడూరు కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ శివరాకేష్ తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	218
స్కిన్‌లెస్	240
కోడిగుడ్ల ధర (100): 525	

నేటి నుంచి వెంకయ్యస్వామి 22వ ఆరాధనోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని 30వ డివిజన్‌లో ఉన్న వెంకయ్యస్వామి ఆలయంలో మంగళవారం నుంచి 22న ఆరాధన మహోత్సవాలు వైభవంగా జరుగుతాయని ఆలయ ధర్మకర్త మొలతాటి నీరదమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం విశేష అభిషేకాలు, మహాన్యాస రుద్రాభిషేకం, అశ్వర్థ నారాయణ కల్యాణ మహోత్సవం, అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. 15వ తేదీ ఉదయం నిత్యపూజలు, సుదర్శనహోమం, భజనలు, అన్నదాన కార్యక్రమం, సాంస్కృతిక ప్రదర్శనలుజరుగుతాయని తెలిపారు. 16న ఉదయం నిత్యపూజలు, రాత్రి స్వామి వారికి నగరోత్సవం జరుగుతుందని తెలిపారు. భక్తులు అందరూ అధికసంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకోవాలని, కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. .

చెత్త కుండీ కాదండోయ్...


కాలువలో పేరుకుపోయిన చెత్తా చెదారాలు, వ్యర్థాలు

ఈ చిత్రంలో కనిపిస్తున్నది చెత్తతో నిండుకున్న కుండీ అనుకుంటే పొరపాటు పడినట్లే..! ఇదీ మురుగు నీరు పారే డ్రైనేజీ కాలువ. వ్యర్థాలతో నిండిపోయి ఇలా మారింది. ఇదెక్కడో నగరానికి మారుమూల ప్రాంతం అనుకోవద్దు.. నగరం నడిబొడ్డున ఫత్తేఖాన్‌పేట రైతు బజారు సమీపంలో ఉంది. చుట్టుపక్కల వారు వ్యర్థాలు ఇందులో వేయడం, కార్పొరేషన్ సిబ్బంది వాటిని తియ్యకపోవడంతో ఇదిగో... ఇలా తయారైంది. చూసేవారంతా దీనిని చెత్త కుండీ అనుకుంటున్నారని, కాలువ అన్న సంగతి ఎవరికీ తెలియడం లేదని స్థానికులు చెప్పుకొచ్చారు.

- నెల్లూరు (సిటీ,ఆంధ్రజ్యోతి)

ఆక్రమణల చెరలో బస్‌షెల్టర్లు!


ఏసీ కూరగాయల మార్కెట్ వద్ద ఆక్రమణలకు గురైన బస్‌షెల్టర్లు

నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ వద్ద ప్రజలు కోసం నిర్మించిన బస్‌షెల్టర్‌ను కూరగాయల వ్యాపారులు ఆక్రమించారు. దీంతో బస్సులు, ఆటోలు కోసం ఎదురుచూసే జనం ఎండకు, వానకు తలదాచుకునే చోటు లేక అవస్థలుపడుతున్నారు. సినీ నటుడు చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ పెట్టిన సమయంలో దాదాపు 15 ఏళ్ల క్రితం చిరంజీవి సేవా సమితి ఆ బస్‌షెల్టర్‌లు ప్రజల కోసం నిర్మించింది. ఆ బస్ షెల్టర్లను కూరగాయల వ్యాపారులు దర్జాగా ఆక్రమించేశారు. నగర పాలక సంస్థ ఆక్రమణలను తొలగించి ప్రజలకు ఒప్పగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి)

నగర సుందరీకరణ 'పశువుల పాలు'



డివైడర్ మధ్యలో నాటిన మొక్కలను తినేస్తున్న పశువులు

నెల్లూరు నగరాన్ని అందంగా తీర్చిదిద్దాలన్న మంత్రి నారాయణ కల పశువుల పాలవుతోంది. రూ.కోట్లు ఖర్చుపెట్టి నగరంలోని రోడ్లకు మధ్యన డివైడర్లు ఏర్పాటు చేసి అందులో అందమైన మొక్కలు నాటారు. అంతటితో చేతులు దులుపుకున్న కాంట్రాక్టర్లు ఖర్చు చేసినదానికి సొమ్ములు తీసేసుకున్నారు. ఆపై పర్యవేక్షించాల్సిన అధికారులు మాయమైపోయారు. ఇంకేముంది. నగరంలో రోడ్లపై సంచరించే పశువులు డివైడర్లపై నాటిన మొక్కలను ఇదిగో ఇలా.. తినేస్తున్నాయి. మొక్కలు నాటిన కొద్ది రోజులకే వాటిని పశువులు మేసేయడంతో మళ్లీ డబ్బులు ఖర్చుపెట్టి మొక్కలు నాటుతున్నారు. ఇలా కార్పొరేషన్ ఖజానాలోని పైసలన్నీ వీటికే ఖర్చు చేసేస్తున్నారంటూ అధికారులపై విమర్శలున్నాయి. రైల్వే ఫీడర్స్ రోడ్డులో సోమవారం సుందరీకరణ మొక్కలన్నింటిని పశువులు ఇలా తినేస్తు కనపడ్డాయి.

- నెల్లూరు(సిటీ,ఆంధ్రజ్యోతి)

రూ.9,139 కోట్లతో త్రీఫేస్ విద్యుత్ పనులు

● నెలాఖరులోపు నెల్లూరు రూరల్‌లో పూర్తి ● ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి


బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని కోట్లాది మంది ప్రజలకు విద్యుత్ కష్టాలు తీర్చి నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రభుత్వం రూ.9139 కోట్లతో త్రీఫేస్ విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులను వేగంగా చేస్తోందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఒక్క నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోనే రూ.50 కోట్లతో ఈ పనులు జరుగుతున్నట్లు వివరించారు. ఇప్పటికే 97 శాతం పనులు పూర్తయ్యాయని, నెలాఖరుకు మిగిలిన పనులు పూర్తవుతాయని చెప్పారు. ఈ బృహత్తర ప్రాజెక్టుకు 'చంద్రన్న విద్యుత్ వెలుగులు'గా నామకరణం చేశామని, త్వరలోనే ప్రజలకు అంకితం చేస్తామని శ్రీధర్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం నెల్లూరులోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రన్న విద్యుత్ వెలుగులు పేరుతో ప్రత్యేకంగా రూపొందించిన బుక్‌లెట్‌ను ఆయన విడుదల చేశారు. అనంతరం శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్రంలో రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. చంద్రన్న విద్యుత్ వెలుగులు ప్రాజెక్టు ద్వారా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 18 గ్రామాలు, మూడు అర్బన్ డివిజన్లలో సుమారు 80 వేల మందికి మేలు చేకూరుతుందని వివరించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆశీస్సులతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు రాష్ట్రంలో కరెంటు కష్టాలు లేకుండా చేసేందుకు విశేషం గా కృషి చేస్తున్నారని చెప్పారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యవేక్షణలో ప్రతీ నియోజక వర్గంలో ఆయా ఎమ్మెల్యేలు పనులు చురుగ్గా చేయిస్తున్నారన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు ఉండాలి


మాట్లాడుతున్న సంతపేట ఇన్‌స్పెక్టర్ సోమయ్య

నెల్లూరు(క్రైం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బాణాసంచా విక్రయాలు, నిల్వలు, తయారీకి సంబంధించి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని స్థానిక ఇన్‌స్పెక్టర్ సోమయ్య తెలిపారు. సోమవారం సంతపేట పోలీసు స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడారు. జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలోని వ్యాపారస్థులు పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖల అనుమతులు పొందిన తర్వాతే బాణాసంచా విక్రయాలు సాగించా లన్నారు. అగ్నిమాపక ప్రమాదాలు నివారించేందుకు ప్రతీ దుకాణం వద్ద నీటి డ్రమ్ములు, పొడి ఇసుక, అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. అనుమతులు లేకుండా బాణాసంచా విక్రయించిన, నిల్వచేసినా, తయారు చేసినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుం టామన్నారు. సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఎక్కడైనా బాణాసంచా విక్రయాలు అక్రమంగా చేసినా, తయారు చేసినా, నిల్వలు చేసినా స్థానిక పోలీసులకు, డయల్ 112కు సమాచారం అందించాలని కోరారు.

విపత్తుల సమయాల్లో యువత చేయూతనందించాలి

అల్లూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : వి పత్తుల సమయాల్లో యువత సామాజిక స్ఫృ హతో సహాయ సహకారాలు అందించాలని ప్రజాసత్తా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వులగర శోభన్ బాబు అన్నారు. సోమవారం అల్లూరులోని రామకృష్ణ జూనియర్, డిగ్రీ క ళాశాలలో అంతర్జాతీయ విపత్తు నివారణ ది నం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విపత్తుల నివారణ అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలలో ప్రిన్సిపాల్ వీ శ్రీనివాసులు, నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ ఆకుల మహేంద్రరెడ్డి, చింతల దయాకర్, లోకేష్, ఆవుల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న నిపుణులు

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఇడియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నెల్లూరు శాఖలోని ఎంఎస్ఆర్ స్పాస్టిక్స్ సెంటర్‌లో సోమవారం సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. అక్టోబరు 13 నుంచి 17వ తేదీ వరకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సెంటర్ కోఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా సెంటర్‌లోని ఉపాధ్యాయులకు, పిల్లలకు, వారి తల్లిదండ్రులకు, రెడ్‌క్రాస్ సిబ్బందికి రెడ్‌క్రాస్ నెల్లూరు జిల్లా శాఖ కోఆర్డినేటర్ సుందరరాజు సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ కోఆర్డినేటర్, మేనేజింగ్ కమిటీ సభ్యులు బయ్యా ప్రసాద్, కార్యదర్శి పీ..మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలను రక్షించుకుందాం..

కలిగిరి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఇంటికి మహాలక్ష్మిలాంటి ఆడబిడ్డను రక్షించుకోవడానికి కుటుంబంతోపాటు సమాజం అండగా నిలవాలని ఆరోగ్య విద్యాధికారి కలసపాటి వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. సేవ్ గర్ల్ చైల్డ్ కార్యక్రమంపై సోమవారం స్థానిక కేజీబీవీలో వి ద్యార్థినులకు అవగాహన నిర్వహించారు. భ్రూణ హ త్యలు, లింగ వివక్ష, పీసీపీఎన్‌డీటీ చట్టం, సుకన్య స మృద్ధి, బేటీ బచావో-బేటీ పడావో తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజన, పీహెచ్ఎన్ మేరీ, హెచ్ఎస్ నరసయ్య, నాగమణి పాల్గొన్నారు.

జగన్ హయాంలోనే కల్తీ మద్యం


మాట్లాడుతున్న రేవతి, తదితరులు

నెల్లూరు (వ్యవసాయం), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే వైసీపీ నేతలు, మాజీ మంత్రి రోజా కల్తీ మద్యం వ్యవహారం తెరపైకి తీసుకొచ్చి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని తెలుగు దేశంపార్టీ నెల్లూరు నగర మహిళాధ్య క్షురాలు కప్పిర రేవతి విమర్శించా రు. నెల్లూరు టీడీపీ కార్యాలయంలో సోమ వారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే కల్తీ మద్యం వ్యవహారం మొత్తం నడిచిందని ఆరో పించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువా త మొలకల చెరువు కల్తీసారా అంశాన్ని బయటకు తీసుకొచ్చిందన్నారు. గొడ్డలి పోటు నుంచి గులకరాయి వరకు వైసీపీ డ్రామాలు అందరూ చూశారని, తప్పులు మీరు చేసి ఆ నెపాన్ని ప్రభుత్వంపై మోపడం మీకు అలవా టేనని అన్నారు. మాటమీద నిలబడకపోవడం వల్లే ఆమెను తైతక్కల రోజా అని పిలవాల్సి వస్తోందని హేళన చేశారు. వైసీపీ హయాంలో నాసిరకం మద్యంతో ప్రజల రక్తాన్ని స్ట్రా వేసి మరీ పీల్చేశారన్న విషయం గుర్తించుకోవాల న్నారు. ఇటీవల వెలుగు చూసిన కల్తీ మద్యం వ్యవహారం మొత్తం వైసీపీ పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. టీడీపీని, ముఖ్యమంత్రి చంద్రబాబును ఒక్క మాట అన్నా ఊరుకునేది లేదని, నాలుకపై వాతపెడతామని రోజాను హెచ్చరించారు. ఈ సమావేశంలో టీడీపీ మహిళా నాయకులు శ్రీలక్ష్మి, మంజుల, తులసి, అనూష, లత, సునీత, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో అత్యవసర వైద్యం

● బాలుడి ప్రాణాలు కాపాడిన కిమ్స్ వైద్యులు



బాలుడి కుటుంబ సభ్యులతో కలసి మాట్లాడుతున్న వైద్యులు

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తేలు కుట్టిన బాలుడికి సకాలంలో అత్యవసర వైద్యసేవలు అందించి ప్రాణాలు కాపాడినట్లు కిమ్స్ ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన ఆసుపత్రిలో బాలుడి కుటుంబ సభ్యులతో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తిరుపతి జిల్లా తడ మండలం పాములమిట్టకు చెందిన 13 ఏళ్ల అభిలాష్‌ను ఈనెల 8వ తేదీన తేలు కుట్టిందన్నారు. సూళ్లూరుపేటలోని ఓ ఆసుపత్రిలో చికిత్స చేయించగా పరిస్థితి విషమించడంతో కిమ్స్‌కు తీసుకొచ్చారన్నారు. వెంటనే ఎమర్జెన్సీలో కార్డియాలజిస్ట్ పరీక్ష చేసి గుండె పనితీరు పూర్తిగా మందగించిందని గుర్తించి వెంటనే వైద్య బృందం పర్యవేక్షణలో వెంటిలేటర్ మీద విరుగుడు మందు ఇవ్వడంతో పాటు ఇతర చికిత్సలు అందించామన్నారు. తేలు విషం శరీరమంతా పాకడంతో పరిస్థితి చాలా క్లిష్టతరంగా మారిందన్నారు. ఒకసారి బాలుడి గుండె కార్డియాక్ అరెస్టు అవ్వడంతో సీపీఆర్ చేసి రీస్టార్ట్ చేసినట్లు చెప్పారు. 48 గంటల పాటు వైద్యుల పర్యవేక్షణలో అత్యవసర వైద్య సేవలు అందించి బాలుడి ప్రాణాలు కాపాడినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వైద్యులు నాగరాజరావు, మురార్జీ, జగదీష్, పల్లవి, భార్గవ్ బృందానికి బాలుడి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టీ.గిరినాయుడు, మెడికల్ కోఆర్డినేటర్ శ్రీధర్‌రెడ్డిలు అభినందనలు తెలిపారు.

15 మంది రౌడీషీటర్ల బైండోవర్


తహసీల్దార్ శ్రీనివాసులు ముందు రౌడీషీటర్లను హాజరు పరిచిన ఎస్సై అంకమ్మ

ఉలవపాడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా చట్టపరంగా వ్యవహరించే విధంగా మండలంలోని 15 మంది రౌడీ షీటర్లను సోమవారం మండల ఎగ్జిక్యూటీవ్ మేజిస్ట్రేట్, తహసీల్దార్ టీ శ్రీనివాసులు ముందు బైండోవర్ చేసినట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. 6 నెలలపాటు సత్ప్రవర్తనతో నడుచుకునేందుకు ఒక్కో రౌడీషీటర్ నుంచి రూ.లక్ష బాండ్‌తో బైండోవర్ చేయించినట్లు పేర్కొన్నారు. విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడితే చట్టపరమైన కేసులు పెట్టి చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. తమ పరిధిలోని రౌడీషీటర్లు అక్రమాలకు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై మండల ప్రజలకు సూచించారు.

న్యూస్ బాక్స్

శోభనాద్రీశ్వరరావును అడ్డుకోవడం దారుణం

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా అడ్డతీగలలో 114 రోజులుగా జిందాల్ బాధిత రైతులు చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా వెళ్లిన మాజీ మంత్రి, ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావును పోలీసులు అడ్డుకోవడం దారుణమని ఏపీ రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి ఒక ప్రకటనలో ఖండించారు. రైతాంగానికి తనవంతు సహాయం అందించాలనే లక్ష్యంతో 81 ఏళ్ల వయసులో అనారోగ్యాన్ని కూడా పరిగణలోకి తీసుకోకుండా వచ్చిన ఆయన్ను నడిరోడ్డుపై రెండు గంటల పాటు అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులు తిరిగి జరగకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

నెల్లూరు(విద్య), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని గోమతినగర్‌లో ఉన్న గోమతి నారాయణ సీబీఎస్‌ఈ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు, సిబ్బందికి విద్యాసంస్థల హెచ్‌ఆర్ విభాగం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఆర్ మస్తానయ్య మాట్లాడుతూ విద్యాసంస్థల్లో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలు కూడా అందచేస్తున్నామన్నారు. అనంతరం మెడికల్ కళాశాల వైద్యులు డాక్టర్ ఏ.నిరంజన్‌రెడ్డి, డాక్టర్ వంశీభరత్, డాక్టర్ అనీస్‌హజీరా, డాక్టర్ శివప్రియ, డాక్టర్ ఏవీ.కార్తీక్‌లు వైద్య పరీక్షలు చేసి సూచనలు, సలహాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం రవివర్మ, ప్రిన్సిపాల్ సుధీర్, ఆర్ఐ ఆదిశేషయ్య, హెచ్‌ఆర్ సుభాష్, పీఆర్‌వో నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక దోపిడీని అరికట్టండి

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : అక్రమ ఇసుక దోపిడీ చేస్తూ మా పొలాల్లో సాగు చేసుకోనివ్వకుండా మాపై దాడులు చేస్తున్నారని విడవలూరు మండలం ముదివర్తి గాంధీనగర్‌వాసులు ఆరోపించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆ గ్రామ రైతులు జే.సుజన, బోడిగల జాలయ్య, సుమలత, తదితరులు విలేకరులతో మాట్లాడారు. పెన్నానది ఒడ్డున మా పొలాలను వైసీపీ నాయకులు కొండూరు వెంకటసుబ్బారెడ్డి తన అక్రమ ఇసుక వ్యాపారం కోసం గుంటలు పెట్టి ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక ట్రాక్టర్లు అడ్డుకోబోయిన తమపై దాడి చేస్తూ బెదిరిస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు కొండూరు వెంకటసుబ్బారెడ్డి, చక్కెర రెడ్డిలపై చట్టపరంగా చర్యలు తీసుకుని తమకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తమ్మిరెడ్డి సుధాకర్, హరికృష్ణ, వేగూరు సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

అప్పు తీర్చమని అడిగితే ఇల్లు ధ్వంసం చేశారు

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : పడారుపల్లికి చెందిన సుదీప్‌రెడ్డి ఆయన భార్య వాణిలకు 4 ఏళ్ల క్రితం చెక్కు, ప్రామిసరీ నోటు తీసుకుని రూ.50వేలు అప్పు ఇచ్చానని వేదాయపాలెంకు చెందిన వరకాటి సుజాతమ్మ సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో తెలిపారు. అప్పుగా తీసుకున్న డబ్బులు ఇవ్వడంలేదని సుదీప్‌రెడ్డి, వాణిలను గురించి చుట్టుపక్కలవారికి చెప్పినందుకు ఈనెల 11న మా ఇంట్లో జొరబడి దాదాపు రూ.50వేలు విలువైన వస్తువులు ధ్వంసం చేశారని తెలిపారు. నా దగ్గర ఉన్న ప్రామిసరీ నోటు, చెక్కులు ఇవ్వాలని బెదిరించారని తెలిపారు. సుదీప్‌రెడ్డి, వాణి, స్వప్నలపై వేదాయపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు.

టిడ్కో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోండి

● కమిషనర్ నందన్


అర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ టిడ్కో ఇళ్లు అందచేస్తామని, ఆ మేరకు దరఖాస్తు చేసుకోవాలని ఎన్ఎంసీ కమిషనర్ నందన్ కోరారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన మాట్లాడారు. నగర పరిధిలోని వివిధ ప్రాంతాలలో నిర్మించిన 17,520 టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అందచేయనున్నామన్నారు. అందులో 300 చ.అ విస్తీర్ణం కలిగినవి 16,144 ఉండగా, 365 చ.అ విస్తీర్ణం కలిగినవి 352, 430 చ.అ విస్తీర్ణం కలిగినవి 1,022 ఉన్నాయన్నారు. వీటిని తగిన లబ్ధిదారులకు అందచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఉచితంగా అందచేసే ఇళ్లలో 13 వేల వరకు రిజిస్ట్రేషన్లు పూర్తి చేయగా 11 వేల ఇళ్లలో లబ్ధిదారులు ఉంటున్నారని తెలిపారు. అర్హతలున్న వారెవరైన ఇల్లు కావాలంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ముందుగా పలు ప్రాంతాలలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. అనంతరం పలు విభాగాలతో సమీక్షలు నిర్వహించారు.

ప్రభుత్వాలకు ప్రజలే బుద్ధి చెపుతారు


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న ప్రభుత్వాలకు ప్రజలే బుద్ధి చెపుతారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోగుల శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఐటీయూ 12వ జిల్లా మహాసభలో అనేక అంశాలపై చర్చించామన్నారు. ప్రధానంగా జిల్లా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, మహిళల సమస్యలపై ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కరేడుకు సంబంధించి సోలార్ పరిశ్రమకు వ్యతిరేకంగా ఉద్యమించబోతున్నామన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టీవీ ప్రసాద్, నాయకులు అజయ్‌కుమార్, రెహనాబేగం, అన్నపూర్ణమ్మ, రాజాగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మొగళ్లపల్లి వెంకట సుబ్బయ్య సత్రాలను వినియోగంలోకి తేవాలి

● బీజేపీ నేత మిడతల రమేష్

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని మొగళ్లపల్లి వెంకట సుబ్బయ్య సత్రాలను ఆధునీకరించి వినియోగంలోకి తేవాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు సోమవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిపాలనాధికారి శ్రీలతకు వినతిపత్రం అందజేశారు. నెల్లూరు నడిబొడ్డులో రూ.100 కోట్ల విలువ చేసే సత్రం ఆస్తులు శిథిలావస్థకు చేరాయని, మొగళ్లపల్లి వెంకటసుబ్బయ్య శ్రేష్ఠి పేద ప్రజల సేవా కార్యక్రమాల కోసం ఇచ్చిన విలువైన ఆస్తులు నిరుపయోగంగా ఉండడం బాధ కలిగిస్తోందని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆస్తులు ప్రజలకు ఉపయోగపడాలని, కొత్త నిర్మాణాలతో దేవాదాయ ధర్మాదాయ శాఖకు ఆదాయం వచ్చేలా రూపకల్పన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరాల సుబ్బారెడ్డి, కంచర్ల నారాయణయాదవ్, బుధవరపు బాలాజీ, కళ్ల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటకపోతే ఆక్సిజన్ సిలిండర్లు కొనుక్కోవాలి


మల్హోత్రాని సత్కరిస్తున్న నవీన్‌రెడ్డి

నెల్లూరురూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే మొక్కలు నాటకపోతే రానున్న రోజుల్లో ఆక్సిజన్ సిలిండర్లు కొనుక్కోవాల్సి వస్తుందని నర్సరీ నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం నెల్లూరు రూరల్లోని పొట్టేపాళెం వద్ద గార్డెన్ వరల్డ్ నర్సరీలో నర్సరీ నిర్వాహకుల సమన్వయ సమావేశం నిర్వహించారు. గార్డెన్స్ నీడ్ అధినేత మల్హోత్రా, గార్డెన్ వరల్డ్ నిర్వాహకుడు జెట్టి నవీన్‌రెడ్డి మాట్లాడారు. పరుగులు తీ స్తున్న పారిశ్రామిక రంగం, పర్యావరణంపై అవగాహన లోపంతో వాయుకాలుష్యం పెనుసవాళ్లను విసురుతుందన్నారు. ఈ తరుణంలో వాతా వరణాన్ని కాపాడుకునేందుకు మొక్కలు పెంపకం ఒక్కటే మార్గమన్నా రు. ఇప్పటు నుంచే ప్రతీ ఒక్కరు విధిగా ఒక మొక్క నాటాల్సిన ఆవశ్య కత ఏర్పడిందని తెలిపారు. నర్సరీల యాజమాన్యాలు ముందుకు వచ్చి కొంత మేరకు ఉచితంగా మొక్కలు అందచేయాల్సిన బాధ్యత ఉందన్నా రు. సమాజ హితం అందరిదన్న వాస్తవాన్ని గుర్తెరగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గార్డెన్స్ నీడ్ జీఎం పవన్‌కుమార్, రవి గార్డెన్స్ నిర్వాహకులు జీ రవీంద్ర సంజీవరెడ్డి, నేవ బ్లడ్‌బ్యాంక్ ఏవో మోపూరు భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

ఇక్కడ.. దొంగతనాలూ ఫ్రీ!

ఆర్టీసీ బస్సుల్లో దొంగల చేతివాటం



పొదలకూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రవేశ పెట్టిన తర్వాత అధిక సంఖ్యలో మహిళలే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. బస్సు నిలిపితే చాలు తోసుకుంటూ ఎక్కుతున్నారు. సీట్ల కోసం కుస్తీ పడుతున్నారు. దీంతో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసి పోతున్నాయి. ఇదే అదనుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ముఠాలుగా ఏర్పడి ప్రయాణికులలో కలిసిపోయి చోరీలకు పాల్పడుతున్నారు. మరికొందరు ప్రయాణికులను మాటల్లో పెట్టి పర్సులు, బంగారు నగలు అపహరిస్తున్నారు. ఇటీవల కృష్ణాజిల్లాకు చెందిన ముగ్గురు మహిళలు మూడు దఫాలుగా పొదలకూరులోని బంగారు దుకాణాలలో వస్తువులను కొనుగోలు చేస్తున్నట్లు నటించి మూడుసార్లు బంగారు కమ్మలను అపహరించారు. నాలుగోసారి వారిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వారి నుంచి 9 జతల బంగారు ఆభరణాలు రికవరీ చేశారు. అలాగే పొదలకూరు పంచాయతీ బస్టాండ్‌లో సగం బస్సులు ఆగే ప్రదేశంలోనూ, నెల్లూరు, రాపూరు బస్సులు ఎక్కే ప్రాంతాల్లో పలు చోరీలు జరిగాయి. ఉచిత ప్రయాణం కావడంతో ఇతర జిల్లాల నుంచి కూడా దొంగలు ఆర్టీసీ బస్సుల్లో వచ్చి దొంగతనాలకు పాల్పడుతున్నారు.

● **ప్రయాణంలో జాగ్రత్తలు తప్పనిసరి...**

బంగారం, డబ్బు, విలువైన వస్తువులు వెంట తీసుకెళ్లేప్పుడు అప్రమత్తంగా ఉండాలి. వస్తువులు ఎవరూ గుర్తించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. బస్సులో గుర్తు తెలియని వ్యక్తులతో మాట్లాడేప్పుడు వారి కదలికలను గుర్తించాలి. మెల్లగా మాటల్లోకి దింపి విలువైన వస్తువులు కాజేసే ప్రమాదం ఉన్నందున బస్సు ఎక్కి, దిగేటప్పుడు వెంట తెచ్చుకున్న వస్తువులు ఉన్నదీ.. లేనిదీ గమనించుకోవాలి. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే కండక్టర్లు, డ్రైవర్లతోపాటు, పోలీసులకు సమాచారం ఇవ్వాలి. విలువైన వస్తువులు పోతే తొలు త డ్రైవరు, కండక్టర్‌కు సమాచారం ఇవ్వాలి. తద్వారా పరిస్థితిని బట్టి బస్సును సమీపంలోని పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి తనిఖీ చేయిస్తారు.

ఆయిల్ నిక్షేపాల కోసం అన్వేషణ



నెల్లూరురూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : భూగర్భంలో ఆయిల్ నిక్షేపాల కోసం కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక బృందాలు జల్లెడ పడుతున్నాయి. అందులో భాగంగా బోరు వేసే యంత్రాలు నెల్లూరురూరల్లోని పలు గ్రామాల్లో ఆయిల్ నిధి కోసం అన్వేషిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా నెల్లూరుకు పడమరపల్లెలో ఈ తరహా అన్వేషణ జరుగుతోంది. అందులో భాగంగా ఆదివారం సౌత్‌మోపూరులో ట్రాక్టర్లు, బోర్‌వెల్ యంత్రాలు ప్రత్యక్షమయ్యాయి. మొగళ్లపాళెం, గొల్లకందుకూరు, పొదకూరు మండలంలోని మరిన్ని పల్లెల్లో ఈ తరహా అన్వేషణ నిర్వహిస్తున్నట్లు వాహనదారుల్లో ఓ వ్యక్తి వెల్లడించారు. జీపీఎస్ ద్వారా తమకు అందే సందేశాన్ని బట్టీ ఆయా ప్రాంతాలకు వాహనాలను తీసుకెళ్లి బోరు వేసి నిక్షేపాల కోసం అన్వేషిస్తున్నట్లు ఆ వ్యక్తి పేర్కొన్నారు.

తల్లి ప్రేమ ఎంత మధురమో.. !

తల్లిప్రేమకు జాతి బేధాలు, హద్దులు లేవంటారు. ఆకలితో ఉన్న ఓ గేదెకు ఆవు పాలిస్తున్న దృశ్యమిది. ఈ సన్నివేశం నెల్లూరు నగరంలోని పెన్నానది ఒడ్డున చోటుచేసుకోగా 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు



ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలపై దాడులు

విడవలూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ముదివర్తిలో కొద్దిరోజులుగా సాగుతున్న ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలపై సోమవారం 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో 'పెన్నమ్మను కొల్లగొడుతున్నారు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి కలెక్టర్ హిమాన్షు శుక్లా స్పందించారు. విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో



స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్‌తో వీఆర్‌వో వెంకటేశ్వర్లు

నాలుగు ట్రాక్టర్ల స్వాధీనం

తహసీల్దార్ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు వీఆర్‌వో వెంకటేశ్వర్లు తవ్వకాలు జరుగుతున్న ప్రదేశాన్ని పరిశీలించారు. ఉదయం మూడు ట్రాక్టర్లు, రాత్రి పార్లపల్లిలో ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. పెన్నా తీరంలో ఇసుక, మట్టి తవ్వకాలు జరిపి తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

మూలస్థానేశ్వరాలయంలో రేపటి నుంచి పవిత్రోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో ఈ నెల 15, 16, 17తేదీలలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం అంకురార్పణ, పవిత్ర సమర్పణం, 16వతేదీ ఉదయం విశేష హోమాలు, దీపారాధన, 17వతేదీ ఉదయం విశేష పూజలు, పూర్ణాహుతి, కలిశ ప్రాకారోత్సవం, స్నపన కలిశాభిషేకం, పవిత్ర అలంకార దర్శనలతో ఉత్సవాలు ముగుస్తాయని, భక్తులు అందరూ తరలిరావాలని కోరారు.

టీకాలు తప్పనిసరి !

అంతుచిక్కని వ్యాధులు, వైరస్‌లతో పాటు వివిధ రకాల బ్యాక్టీరియాతో కోళ్లు అకాల మృత్యువాత పడుతున్నాయి. కోవూరు మండలం గమళ్లదిబ్బ, పొదలకూరు మండలం చాటగొట్లలో ఇటీవల అధికసంఖ్యలో కోళ్లు మృతి చెందాయి. ఇందుకు ప్రధాన కారణం జీవసంరక్షణ పద్ధతులు పాటించకపోవడమే. అలాగే టీకాలు క్రమం తప్పకుండా వేయించకపోవడమే. కోళ్లు ఆరోగ్యంగా పెరగాలంటే కొన్ని జాగ్రత్తలు తప్పక తీసుకోవాలని సూచిస్తున్నారు పశుసంవర్ధకశాఖ పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల సహాయ సంచాలకుడు డాక్టర్ జానా చైతన్య కిషోర్. ఆయన ఆంధ్రజ్యోతి ద్వారా కోళ్ల పెంపకందారులకు పలు సూచనలు అందచేశారు.

- ముందు జాగ్రత్తలతోనే కోళ్ల మరణాలకు చెక్
- వివిధ జాతులను ఒకేచోట పెంచరాదు
- చనిపోయిన వాటిని గుంతల్లోనే పూడ్చాలి
- పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఏడీ చైతన్యకిషోర్

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సుమారుగా 19,31,113పైగా నాటు, బ్రాయిలర్, లేయర్ జాతుల కోళ్లు ఉన్నట్లు అంచనా. కొడవలూరు, మర్రిపాడు, గుడ్లూరు తదితర ప్రాంతాల్లో ఎక్కువగా కోళ్ల ఫారాలు నిర్వహిస్తున్నారు. అయితే వాటి నిర్వాహకులు జీవసంరక్షణ పద్ధతులను పాటించకపోవడం వల్ల కోళ్లు అంతుపట్టని వ్యాధులతో మరణిస్తున్నాయి. ఇటీవల కోవూరు, పొదలకూరులో ఈపరిస్థితి వచ్చినప్పుడు రెవెన్యూ, ఆరోగ్య, పోలీసు, పశుసంవర్ధకశాఖ సంయుక్తంగా పనిచేసి మరణాలను అరికట్టారు. మృతి చెందిన కోళ్ల నుంచి ఇతర కోళ్లకు, మానవాళికి వైరస్ సోకకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు.

● **జాగ్రత్తలు ఎంతో ముఖ్యం**

కోళ్లఫారాల నిర్వాహకులు కొన్ని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ఫారాల్లోకి తెలియని వ్యక్తులను రానివ్వకూడదు. ఫారంలోకి వెళ్లేందుకు ఒక ద్వారం, బయటకు వచ్చేందుకు మరో ద్వారం ఉండేలా చూసుకోవాలి. ముఖ్యంగా కోళ్లకు గాలి, వెలుతురు బాగా అందేలా చూడాలి. ముందస్తుగా టీకాలు తప్పనిసరిగా వేయించాలి. అలాగే ఫారాలు శుభ్రంగా ఉంచుకోవాలి. నిర్వాహకులు ఫారాల్లోకి వెళ్లేప్పుడు కాళ్లు కడుగుకుని వెళ్లడం మంచిది. ఇందుకుగానూ ఒక నీటితొట్టి ఏర్పాటు చేసుకోవాలి. నాటు కోళ్లు పెంచేవారు, వాటిని వేరే కోళ్లతో కలవకుండా చూసుకోవాలి. కోళ్లను పెంచేవారు వలస పక్షులను పట్టుకోవడం, వాటిని కోళ్ల దగ్గరకు తీసుకెళ్లడం ప్రమాదకరం. రకరకాల కోళ్ల జాతులను ఒకేచోట పెంచకుండా చూడాలి. ఖరీదైన కోళ్లను పెంచేవారు మాత్రం లోపెథోజెనిక్ ఏవియన్ ఇన్ఫ్యూయెన్జా(ఎల్‌పీఏఐ) టీకాను తప్పనిసరిగా వేయించాలి. అదికూడా డీవార్మింగ్ అనంతరం వేయించాలి. ప్రధానంగా అక్టోబరు నుంచి మార్చిలోగా ఈ టీకా వేయించాలి. ఏదిఏమైనా వ్యాధులు వచ్చిన తరువాత వాటికి చికిత్సలు చేయించడంకంటే, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల కోళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.



పౌల్ట్రీ ఫాంలోని కోళ్లు (ఇన్‌సర్ట్) డాక్టర్ చైతన్య కిషోర్

● **గుంతల్లోనే పూడ్చాలి**

కోళ్లకు అకాల మరణాలు సంభవించినప్పుడు వెంటనే పశువైద్యుడికి సమాచారం అందించాలి. మృతిచెందిన వాటిని లోతుగా గుంతలు తవ్వి పూడ్చిపెట్టాలి. అనంతరం ఆ గుంతపై సున్నం చల్లాలి. ఎట్టి పరిస్థితుల్లో వాటిని నీటి పారుదల కాలువలు, పేడదిబ్బల్లో పడేయకూడదు. దీనివల్ల వైరస్ ఇతర కోళ్లకు, మానవాళికి వ్యాపించే ప్రమాదం ఉంది.చనిపోయిన కోళ్లను తప్పనిసరిగా పూడ్చిపెట్టాలి. పశువైద్యుడి సూచనలు పాటించాలని చైతన్యకిషోర్ వివరించారు.

నేటి నుంచి అండర్-19 స్కూల్ గేమ్స్ ఎంపికలు

నెల్లూరు(విద్య), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): అండర్-19 జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం నుంచి బాలబాలికల క్రీడా జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాటూరు వేణుగోపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని చిల్డ్రన్స్‌పార్క్ సమీపంలో ఉన్న శ్రీఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీలో ఉదయం 10 గంటలకు చెస్ పోటీలు, దర్గామిట్టలోని నెల్లూరుక్లబ్‌లో ఉదయం 10 గంటలకు క్యారమ్స్ పోటీల ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. 15న సాయంత్రం 4 గంటలకు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో బాస్కెట్‌బాల్, 16న ఉదయం 10 గంటలకు కోడూరుపాడు జడ్పీ హైస్కూల్‌లో బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ ఎంపికలను డీవీఈవో కృష్ణారెడ్డి, ఆర్‌ఐవో వరప్రసాద్‌లు పర్యవేక్షిస్తారని తెలిపారు.

ఏపీ ఆర్చరీ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా వేణు

నెల్లూరు(విద్య), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఏపీ ఆర్చరీ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా జిల్లా ప్రధాన కార్యదర్శి పావురాల వేణు ఎంపికయ్యారు. విశాఖపట్నంలో జరిగిన ఏపీ ఆర్చరీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా చెరుకూరు సత్యనారాయణ, అధ్యక్షురాలుగా నందమూరి తేజస్విని, కార్యదర్శిగా వెంకట రమణ ఎంపికయ్యారు. వేణుకు స్థానం దక్కడంపై ఆర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పల్లంరెడ్డి శ్రీహర్ష హర్షం వ్యక్తం చేశారు. అలాగే జిల్లాకు చెందిన కోచ్ విజయభరద్వాజ్‌ను టెక్నికల్ కమిటీ ఛైర్మన్‌గా నియమించారన్నారు. నాలుగేళ్ల పాటు కొనసాగే ఈ కమిటీ ఆర్చరీ క్రీడాభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు.



వేణును అభినందిస్తున్న నందమూరి తేజస్విని

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

లింగసముద్రం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): లింగసముద్రం గ్రామ శివారులో పేకాడుతున్న నలుగురిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఎస్సై నారాయణ, సిబ్బంది పేకాడుతున్న నలుగురిని పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి రూ.20,200 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

నేడు బైక్ ర్యాలీ

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం 10గంటలకు నగరంలోని డీకే డబ్ల్యూ కళాశాల నుంచి జీజీహెచ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామని ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ ఒక ప్రకటనలో తెలిపారు. బైక్ ర్యాలీ అనంతరం ఉదయం 11 గంటలకు జీజీహెచ్‌లో అంతర్జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

చిరుధాన్యాలతో బేకరి ఉత్పత్తుల తయారీపై 17న శిక్షణ

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో మహిళలకు చిరుధాన్యాలతో బేకరి ఉత్పత్తుల తయారీపై ఈనెల 17వ తేదీన శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కేవీకే కమ్యూనిటీ సైన్స్ స్పెషలిస్ట్ డాక్టర్ ఆర్.సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. చిరుధాన్యాల ప్రాధాన్యం, వాటి పోషక విలువలు, వాటితో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ పద్ధతులపై అవగాహన, శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. వివరాలకు 9492378886ను సంప్రదించాలని పేర్కొన్నారు.

చట్టప్రకారం విచారణ జరిపి న్యాయం చేస్తాం : ఎస్పీ అజిత

నెల్లూరు(క్రైం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులపై చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల తెలిపారు. ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు జిల్లా వ్యాప్తంగా 125 మంది తరలివచ్చి ఫిర్యాదులు అందజేశారు. ఎస్పీ నేరుగా ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం ఉండకూడదని, ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించి వారి పిటీషన్లను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో రూరల్ డీఎస్పీ గట్టమనేని శ్రీనివాసరావు, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, సీఐలు భక్తవత్సలరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



వృద్ధుడి నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎస్పీ అజిత వేజెండ్ల

అట్టహాసంగా వాయుగుండ్ల ప్రమాణ స్వీకారం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం ఆలయ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడిగా వర్చ్యుసా లైఫ్ స్పేసెస్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్స్ సీఎండీ వాయుగుండ్ల వెంకటేష్ సోమవారం అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన చేత ఆలయ ఈవో శ్రీనివాసరావు ప్రమాణం చేయించారు. ఆయనతోపాటు ఆలయ కమిటీ ఛైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు, కమిటీ సభ్యులు కూడా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి తదితరులు పాల్గొన్నారు. తమ సంస్థ అధినేతకు శ్రీశైలంలో భక్తులకు సేవచేసే అవకాశం కల్పించడంపై వర్చ్యుసా లైఫ్ స్పేసెస్ కంపెనీ సీఎంజీలు అభినవరాజు, సుధాకర్, సత్తార్, విజయకుమార్, కాంచన ప్రసాద్ తదితరులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.



శ్రీశైలం ఆలయ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడిగా ప్రమాణ స్వీకారోత్సవం అనంతరం స్వామి, అమ్మవార్ల ఫొటోను వాయుగుండ్ల వెంకటేష్‌కు బహూకరిస్తున్న ఆలయ ఈవో శ్రీనివాసరావు

రాళ్లపాడులో బయటపడ్డ మృతదేహం గుర్తింపు

లింగసముద్రం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టులో ఈనెల 5వ తేదీన బయటపడ్డ మృతదేహాన్ని మండలంలోని ఆర్‌ఆర్ పాలెం గ్రామానికి చెందిన కేతినేని కొండలరావు(45)గా పోలీసులు గుర్తించారు. గ్రామానికి చెందిన కేతినేని మహేష్, హరిబాబు మరికొందరు సోమవారం ఉదయం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఎస్సై ఎం నారాయణను కలిసి ప్రాజెక్టులో లభ్యమైన మృతదేహం తమ బంధువుదిగా ఉందని వారు చెప్పారు. మృతదేహంపై సేకరించిన ఆనవాళ్లను చూపించాలని ఎస్సైను కోరారు. దీంతో మృతుడికి చెందిన ప్యాంటు, మొలతాడు, తాళాన్ని చూపించగా, వాటిలో మొలతాడు, తాళం తమ బాబాయి కుమారుడు కేతినేని కొండలరావుదని, సదరు మృతదేహం ఆయనదేనని చెప్పారు. దీంతో వెంటనే ఎస్సై నారాయణ ఆర్‌ఆర్ పాలెం గ్రామానికి వెళ్లి మృతుడి వద్ద లభించిన తాళంతో ఆయన ఇంటి తాళాన్ని తీశారు. దీంతో మృతుడు కొండలరావు అని, ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారని చెప్పారు. కొండలరావుకు చాలా కాలం నుండి మతిస్థిమితం లేదని, ఒంటరిగా ఉంటున్నాడని చెప్పారు. దీంతో ఎస్సై నారాయణ మహేష్, మిగిలిన బంధువుల నుండి స్టేట్‌మెంటు తీసుకున్నారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లా



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో పాల్గొన్న కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. వివిధ సమస్యలపై ప్రజలు అందించే అర్జీలను జాప్యం లేకుండా నిర్ధిష్ట గడువులోగా పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా భూ సమస్యలు, ఇతర రెవెన్యూ సమస్యలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పరిష్కారం చూపించలేకపోతే ఎందుకు పరిష్కరించలేకపోతున్నామో అర్జీదారులకు తెలియచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయకుమార్, డీపీవో శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ అధ్యక్షురాలు తుమ్మారెడ్డి రేవతి, కార్యదర్శి రెహానాబేగంలు కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతిపత్రం సమర్పించారు. బిల్లులు పెండింగ్‌లో ఉండటం వలన మధ్యాహ్న భోజనం పెట్టడం కష్టంగా ఉందని పేర్కొన్నారు

● సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడి చేసిన న్యాయవాదిపై చర్యలు తీసకోవాలని కోరుతూ ఇంటర్నేషనల్ హూమన్‌రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీ.చిన్నారావు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబేడ్కర్‌మాదిగ, ఉపాధ్యక్షుడు ఉదయకృష్ణ మాదిగలు వేర్వేరుగా కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఆ న్యాయవాది పట్టాను రద్దు చేయాలని, బార్ అసోసియేషన్ నుంచి తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు టీ.కిషోర్‌కుమార్, సీవీ రమణ, జీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

చేపల మాఫియాపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టరేట్ ఎదుట యానాదుల ధర్నా

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కండలేరులో చేపల మాఫియాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ యాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో యానాదులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య మాట్లాడుతూ కండలేరు జలాశయంలో మాఫియా ముఠా అక్రమంగా చేపల వేట సాగిస్తూ యానాదుల పొట్ట కొడుతున్నారని ఆరోపించారు. జలాశయానికి సంబంధించి 25 కాలనీల్లో 400 మంది సభ్యత్వం కలిగి ఉన్నారన్నారు. వారంతా జలాశయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే కొందరు ముఠాగా ఏర్పడి, ఇతర జిల్లాల నుంచి కొందరిని తీసుకుని వచ్చి అక్రంగా చేపల వేట సాగిస్తున్నారని ఆరోపించారు. అనంతరం కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతిపత్రం సమర్పించారు. స్పందించిన కలెక్టర్ చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ జేడీని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మానికల మురళి, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష, బిట్ల ప్రసాద్, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న యానాదులు

జిల్లాలో మోస్తరు వర్షం



నెల్లూరులోని కనకమహల్ వద్ద రోడ్డుపై నిలిచిన నీరు



నెల్లూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : ఉపరితల ఆవర్తన ప్రభావంతో సోమవారం జిల్లాలోని కొన్ని మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా సరాసరి 1.8 మి.మీ వర్షం కురవగా అత్యధికంగా కందుకూరులో 16.4 మి.మీ, ఇందుకూరుపేటలో 11.4 మి.మీ, బోగోలులో 7.2 మి.మీ చొప్పున వర్షం కురిసింది. కోవూరు, టీపీ గూడూరు, అల్లూరు, సైదాపురం, కావలి, విడవలూరు, ముత్తుకూరు, జలదంకి, నెల్లూరు అర్బన్, కొడవలూరు మండలాల్లో కూడా తేలికపాటి చినుకులు పడ్డాయి. అలానే జిల్లా వ్యాప్తంగా వాతావరణం చల్లబడింది. కాగా మంగళవారం కూడా కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది.

ప్రయోగాత్మకంగా ఛాంపియన్ ఫార్మర్

- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు
- గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- కలెక్టర్ హిమాన్షు శుక్లా



మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా పక్కన అధికారులు

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభసాటిగా తీసుకొచ్చేందుకు జిల్లాలో ప్రయోగాత్మకంగా ఛాంపియన్ ఫార్మర్(వ్యవసాయ విజేత) అనే నూతన విధానాన్ని అమలు చేయబోతున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ హాల్లో పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్, సీజనల్ వ్యాధులు, వ్యవసాయం, ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల బాధితులకు పరిహారం చెల్లింపు తదితర అంశాలపై సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని 722 గ్రామ పంచాయతీల నుంచి ఔత్సాహిక రైతులకు ఎంపిక చేసి వారిని ఛాంపియన్ ఫార్మర్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ సాగులో పురోగతిని చూపించడం, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఎరువులు, పురుగు మందుల నిర్వహణ, వ్యవసాయంలో యాంత్రీకరణ, మార్కెటింగ్, ప్రకృతి వ్యవసాయం తదితర నైపుణ్యాలను అందిపుచ్చుకుని ఇతర రైతులకు ఆదర్శంగా తీసుకునేలా తయారు చేస్తామన్నారు. ప్రతీ మండలంలోని ఒక గ్రామంలో నెలకు ఒకరోజు సివిల్ రైట్స్ డే నిర్వహించాలన్నారు. భూ సంబంధ విషయాలే కాకుండా ప్రతి సమస్యపై చర్చించాలని చెప్పారు. జిల్లాలో యానాదులు ఎక్కువగా ఉన్నారని, వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో జేసీ వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయకుమార్, జడ్పీ సీఈవో మోహన్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన ర్యాలీ

ఆత్మకూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జీఎస్టీ నిబంధనలు, తద్వారా తగ్గిన ధరలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆత్మకూరు పట్టణంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రమేష్ ఆధ్వర్యంలో స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ పాల్గొని ర్యాలీని ప్రారంభించారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11907
వెండి కిలో ధర	రూ. 176700
వెండి ఒక గ్రాము	రూ. 185.00

న్యూస్ బాక్స్

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం



కమిషనర్ గంగాప్రసాద్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్లు, నేతలు

ఆత్మకూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపాల్టీకి రాష్ట్ర స్థాయిలో అవార్డు దక్కడం పట్ల పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, కూటమి నేతలు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వారు కమిషనర్ జి గంగాప్రసాద్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు, మున్సిపల్ కౌన్సిలర్ కొప్పోలు రమాదేవి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ బిజెపి సీనియర్ నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు చంద్రా వెంకట సుబ్బానాయుడు, కొప్పోలు చిన్నపరెడ్డి, గార్లపాటి సురేష్ బాబు, మున్సిపల్ కౌనిల్సర్లు సూరా భాస్కర్ రెడ్డి, పొడమేకల పెంచలయ్య యాదవ్, షేక్ మహబూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి : సీపీఎం

ఆత్మకూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని సీపీఎం, అనుబంధ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం గ్రీవెన్స్ డేలో వారు ఆర్డీవో బి పావనికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీపీఎం నాయకులు కె డేవిడ్‌రాజు, ఆత్మకూరు నాగయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ సందాని తదితరులు మాటాడుతూ అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాలను సీజ్‌చేసి యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేపల చెరువులకు అనుమతి ఇవ్వొద్దని రైతుల ఆందోళన

సంగం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరుణవాయి, వంగల్లు గ్రామాల్లో వరిసాగు చేసే పొలాల్లో చేపల చెరువుల ఏర్పాటుకు అనుమతివ్వొందంటూ సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట తరుణవాయి, వంగల్లు రైతులు ఆందోళన చేశారు. ఈమేరకు తహసీల్దారు సోమ్లానాయక్‌కు వినతిపత్రం అందచేశారు.

రీసర్వే పరిశీలన

సీతారామపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేవమ్మ చెరువు గ్రామ పంచాయతీలో రీసర్వే పరిశీలన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆత్మకూరు డివిజన్ సర్వే అధికారులు పి శ్రీనివాస్, శ్రీనివాస్‌శర్మ రీసర్వేను పరిశీలించారు. తప్పులు లేకుండా రీసర్వే చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ ఎంఎస్ శ్రీకాంత్, సర్వేయర్లు నిఖీల్, రాజేంద్ర, వీఆర్వోలు వెంకట్, బాలు పాల్గొన్నారు.

చికెన్ షాపుల తొలగింపు

వింజమూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మంగల సెంటర్ కూడలిలో చికెన్ షాపులను షాపు యజమానులు సోమవారం స్వచ్ఛందంగా తొలగించారు. వీరికి ప్రత్యామ్నాయంగా స్థలాలు కేటాయిస్తున్నట్లు సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేష్‌యాదవ్ తెలిపారు.

ఈ మలుపులు.. మృత్యు మార్గాలు

- ప్రమాదాల బారిన వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



గానుగపెంటపల్లి వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు



విరువూరు వద్ద హెచ్చరిక బోర్డులు లేని మలుపు



కాంచెరువు వద్ద కంపచెట్లతో కనిపించని మలుపు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రహదారుల వెంట ప్రమాదకరంగా మారిన మలుపులు వాహనదారుల పాలిట మృత్యు మార్గాలుగా మారుతున్నాయి. పలు గ్రామాల సమీపంలోని రహదారుల మలుపుల మీదుగా ప్రయాణం సాగించాలంటే వాహన దారులు బెంబేలెత్తిపోతున్నారు. ప్రధానంగా ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. సింగిల్ రోడ్లకు తోడు రహదారులను ఆనుకొని నివాసాలు, దుకాణాలు, ఉండడంతో వేగంగా వచ్చే వాహనదారులు మలుపుల వద్ద ఒక్కసారిగా వాహనాలను అదుపు చేసుకోలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతేగాక కాలి నడకన రాకపోకలు సాగించే ప్రజలు సైతం ప్రమాదాలకు గురవుతున్నారు. ఉదయగిరి మండలం గండిపాళెంలోని ప్రభుత్వ వైద్యశాల, జలాశయానికి వెళ్లే మార్గంతో పాటు ఇస్కపల్లికి వెళ్లే మార్గంలోని మలుపులు ప్రమాదకరంగా మారాయి. అలాగే సన్నంవారిచింతల, గానుగపెంటపల్లి, గంగిరెడ్డిపల్లి, మాసాయిపేట గ్రామాలతో సహా వరికుంటపాడు మండలం ఇస్కపల్లి, కాంచెరువు, గువ్వాడి, జడదేవి, తూర్పు బోయమడగల, విరువూరు, దక్కనూరు, వరికుంటపాడు తదితర గ్రామాల్లోని ప్రధాన రహదారుల వెంట ఉన్న మలుపుల్లో నిత్యం వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. అలాగే పల్లె ప్రాంతాల్లోని రహదారులకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా వేసిన స్పీడ్‌బ్రేకర్లు సైతం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కనీసం ఏపుగా పెరిగిన కంపచెట్లను తొలగించడంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంలోను అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ప్రమాదాలకు గురి కావాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మృత్యు మార్గాలుగా మారిన మలుపుల వద్ద ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

లైసెన్సు లేకుండా విత్తనాలు విక్రయిస్తే చర్యలు : ఏడీఏ

- ఎరువులు, పురుగు మందుల దుకాణాల తనిఖీ



ఆత్మకూరులో పురుగుల మందుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ దేవసేనమ్మ

ఆత్మకూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): లైసెన్సు లేకుండా ఎవరైనా విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని నెల్లూరు ఏడీఏ వి దేవసేనమ్మ హెచ్చరించారు. పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాకు రిజిష్టరు, బిల్లు పుస్తకాలు, పురుగు మందులు, విత్తనాల నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ తనిఖీలలో సరైన పత్రాలు లేని రూ. 34400 విలువచేసే పురుగు మందుల స్టాకు విక్రయాలను నిలుపుదల చేశామన్నారు. రైతులు విత్తనాలను అధీకృత డీలరు వద్దనే కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు. విత్తనాల మొలక శాతం సరిగా లేకపోతే స్థానిక వ్యవశాయశాఖ అధికారులకు తెలియచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఏవో కె కిశోర్‌బాబు పాల్గొన్నారు.

●**మర్రిపాడు:** మండలంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను కావలి ఏడీఏ నాగరాజు సోమవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టరు పరిశీలించారు. అనుమతి లేని విత్తనాలు కొన్నింటిని పరిశీలించి వాటి అమ్మకాలను నిలుపుదల చేశారు. ఆయన వెంట ఉదయగిరి ఏడీఏ చెన్నారెడ్డి, ఏఓ విజయ్ భాస్కర్, మర్రిపాడు ఏఓ కవిత తదితరులున్నారు.

●**ఉదయగిరి :** పట్టణంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను సోమవారం కావలి వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజు వ్యవసాయ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా దుకాణాల్లో ఎరువులు, పురుగుమందుల క్రయ, విక్రయాల రికార్డులు, ఇన్‌వాయిస్ బిల్లులు, గోదాముల్లో నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం శ్రీబాలాజీ ఫెర్టిలైజర్స్ అండ్ ఫెస్టిసైడ్స్ దుకాణ గోదాము జీఎస్టీ లైసెన్సు లేనందున రూ.1,59,500 విలువ కలిగిన విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేశారు. అన్ని దుకాణాల యజమానులు బిల్లు పుస్తక నిర్వహణ సక్రమంగా నిర్వహించేలా చర్యలు అధికారులు తీసుకోవాలన్నారు. నకిలీ ఎరువులు, పురుగు మందులు, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ పీ చెన్నారెడ్డి, వ్యవసాయాధికారి విజయభాస్కర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లైసెన్సు లేని బాణసంచా దుకాణదారులపై కఠిన చర్యలు : సీఐ



సంగంలో టపాసుల దుకాణాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ రాజేష్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వేమారెడ్డి

సంగం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక సర్కిల్ పరిధిలోని సంగం, చేజర్ల, ఏయస్‌పేట మండలాలల్లో లైసెన్సు లేకుండా బాణాసంచా దుకాణాలను ఏర్పాటుచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వేమారెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన స్థానిక సర్కిల్ కార్యాయలంలో విలేకర్లతో మాట్లాడుతూ బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేయాలంటే లైసెన్సు తప్పనిసరి అన్నారు. అంతేకాకుండా జనసంచారం మధ్య దుకాణాలు ఏర్పాటుచేయరాదని, ఇళ్లల్లో నిల్వ చేయకూడదన్నారు. నిబంధనలు అతిక్రమించి దుకాణాలను ఏర్పాటుచేస్తే చర్యలు తప్పవన్నారు. నిబంధనల మేరకు పోలీసులు కేటాయించిన ప్రాంతంలోనే దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

టపాసుల దుకాణాల తనిఖీ

స్థానికంగా ఏర్పాటుచేసిన లైసెన్సు కలిగిన టపాసుల దుకాణాలను ఎస్ఐ రాజేష్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనం మధ్య ప్రమాదకర టపాసులను నిల్వ చేయరాదని హెచ్చరించారు. దుకాణదారులు తప్పనిసరిగా లైసెన్సు పొందాలని, నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

చేజర్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బాణసంచా విక్రయదారులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని స్థానిక ఎస్ఐ తిరుమలరావు తెలిపారు. చేజర్ల మండలంలో బాణసంచా తయారీ, విక్రయాలు చేసేవారు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండడంతో పాటు ప్రభుత్వ నిమయ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మండలంలో ఎక్కడైనా బాణసంచా అక్రమంగా నిల్వ ఉంచిన, విక్రయించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా దుకాణదారులు అధికారులు కేటాయించిన ప్రదేశాలలో నిబంధనలకు లోబడి విక్రయాలు జరుపుకోవాలని సూచించారు.

●**ఉదయగిరి:** అనుమతులు లేకుండా బాణసంచా నిల్వచేసినా, తయారుచేసినా, విక్రయాలు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యాపారులు తప్పకుండా పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక శాఖల అనుమతులు పొందాలన్నారు. బాణసంచా హోల్‌సేల్ వ్యాపారులు నిల్వ గోదాముల్లో తగు భద్రతా ప్రమాణాలు పాటించాలని, రిటైల్ వ్యాపారులు బహిరంగ ప్రదేశంలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతోపాటు ప్రతి దుకాణం వద్ద ఓ నీళ్ల డ్రమ్ము, పొడి ఇసుక, అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడైనా బాణసంచా అక్రమ నిల్వలు, తయారీ కేంద్రాలు ఉంటే పోలీసులకు సమాచారం అందిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని ఆయన ప్రజలకు సూచించారు.





ఐటీఐకి రహదారి పనుల ప్రారంభం

సంగం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటేశ్వరపురంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ భవనాల అభివృద్ధికి లగడపాటి రామలక్ష్మమ్మ చేతుల మీదుగా సోమవారం భూమిపూజ చేశారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ గ్రామంలో అర్థాంతరంగా ఆగిన భవనాలను ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు దాతృత్వంగా ప్రకటించిన విషయం విదితమే. ఆగిన భవనాల నిర్మాణంతోపాటు రహదారి నిర్మాణానికి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇటీవల రూ. 40 లక్షల సీఎస్ఆర్ నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో సిమెంట్ రహదారి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి, షేక్ బాబు, కంచర్ల నారాయణ నాయుడు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం నిర్మూలించాలని నిరసన

ఉదయగిరి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని నిర్మూలించి ప్రజల ప్రాణాలను కాపాడాలని సోమవారం స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో ఎదుట వైసీపీ నాయకులు నిరసన చేపట్టారు. అనంతరం ఎస్ఐ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ అలీ అహ్మద్, మండల వైసీపీ కన్వీనర్లు కొండా రాజాగోపాల్‌రెడ్డి, దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, శ్రీనివాసులు, కాటం రవీంద్రరెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎఫ్ఏ-2 పరీక్షల తనిఖీ

ఉదయగిరి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత, గడ్డంవారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న ఎఫ్ఏ-2 పరీక్షలను ఎంఈవోలు వెంకటేశ్వర్లు, టీ శ్రీనివాసులు సోమవారం తనిఖీ చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు

చేతిపంపునకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతసాగరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సాగరం బస్టాండ్ పరిధిలోని బద్వేల్‌రోడ్డు వద్ద గత కొంతకాలంగా చేతిపంపు తుప్పు పట్టి ఉండడంతో ఇటీవల తుప్పు పట్టిన చేతిపంపుతో ఇబ్బందులు అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం అయింది. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులు కొత్తపైపులు, పరికరాలు బిగించి వినియోగంలోకి తెచ్చారు.



మరమ్మతులు చేసి వినియోగంలోకి తెచ్చిన పంపు

సామాజిక ఆరోగ్య కేంద్రంలో జగన్ ఫొటో తొలగింపు

●**ఉదయగిరి:** స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో వాల్‌పోస్టర్‌పై ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫోటోను అధికారులు తొలగించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో 'ప్రభుత్వం మారినా.. మారని అధికారుల తీరు' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు వాల్‌పోస్టర్‌లో ఉన్న జగన్ ఫోటోను తొలగించారు. అలాగే ఆదివారం ప్రచురితమైన 'ప్రమాదకరంగా విద్యుత్ తీగలు' కథనానికి స్పందించిన ట్రాన్స్‌కో ఏఈ ఖుద్దూస్‌బాషా తన సిబ్బందిచే చేతికందే దశలో ఉన్న విద్యుత్ లైన్‌లను సరిచేసి అల్లుకున్న తీగలను తొలగింప చేశారు.

డీసీపల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు 1290 బేళ్లను తీసుకొని రాగా 20 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 817 బేళ్లను కొనుగోలుచేశారు. వివిధ కారణాలతో 473 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 315 కాగా, కనిష్ఠ ధర రూ.69 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

పొగాకు సాగుపై రైతులకు అవగాహన

2025-26 పంటకాలానికి సంబంధించి పొగాకు సాగుపై సోమవారం డీసీపల్లి బోర్డులో వేలం నిర్వహణాధికారి జి.రాజశేఖర్ రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి ధరలు ఆశాజనకంగా ఉండటంతో అధికంగా సాగు చేస్తున్నారని, అదే విధంగా ఖర్చుల భారాన్ని రైతులు పెంచుకున్నారన్నారు. ఎక్కువ పండిస్తే ధరలు రాకపోవచ్చన్నారు. ఎక్కువ పొలాలను కౌలుకు తీసుకోకుండా ఖర్చు భారాన్ని తగ్గించుకోవాలని ఆయన రైతులకు సూచించారు.

C.R.I.M.E N.E.W.S

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

- మరో ఇద్దరికి గాయాలు
- వాహనాల మధ్య ఇరుక్కున్న ట్రక్కు





మన్సూర్,సురేష్‌రెడ్డి మృతదేహాలు

నెల్లూరు (క్రైం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కోల్‌కత్తా - చెన్నై జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో జీవనోపాధి నిమిత్తం వెళుతున్న ఇద్దరు దుర్మరణం చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... కోవూరు పట్టణంలోని ఇంద్రలోక్ అవెన్యూలో ఎస్‌కే మన్సూర్ కుటుంబం నివాసం ఉంటుంది. ఆయన హోటళ్లు, ఆసుపత్రుల నుంచి మాసిన బట్టలు తీసుకొని వచ్చి వాటిని ఉతికి తిరిగి ఇచ్చే వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అతని వద్ద బీహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తులు పని చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం కోవూరు నుంచి టాటా ట్రక్కు వాహనంలో విడవలూరు మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన డ్రైవర్ పుచ్చపల్లి సురేష్‌రెడ్డి(49)తో కలసి నెల్లూరు నగరంలోని జీజీహెచ్‌కు బయలుదేరారు. మన్సూర్(28) డ్రైవర్‌తో పాటు ముందు క్యాబిన్‌లో కూర్చోగా, బీహార్ రాష్ట్రానికి చెందిన అక్రమ్, అనిల్, షమీమ్‌లు వెనుక ట్రక్కులో బట్టలు వేసుకొని అక్కడే కూర్చున్నారు. ఉదయం 8 గంటల సమయంలో ఈ వాహనం జాతీయ రహదారిపై నగరంలోని ప్రశాంతినగర్ జంక్షన్ వద్దకు రాగా వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రక్కు ముందు వెళుతున్న లారీను ఢీకొనడంతోపాటు రెండు వాహనాల మధ్య ఇరుక్కుపోయింది. ఈ ప్రమాదంలో ముందు కూర్చుని ఉన్న డ్రైవర్ సురేష్‌రెడ్డి, ఎస్‌కే మన్సూర్‌లు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. వెనుక ట్రక్కులో ఉన్న అక్రమ్‌కు రెండు కాళ్లకు తీవ్రగాయాలు కాగా అనిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. షమీమ్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న నార్త్‌ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. సమాచారం అందుకున్న మృతుల కుటుంబ సభ్యులు జీజీహెచ్ మార్చురీకి చేరుకొని కన్నీరుమున్నీరయ్యారు. మృతుడు మన్సూర్ తండ్రి ఎస్‌కే మస్తాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన కొండలరావు

వెంకటాచలం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకుటూరు వద్ద జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాకుటూరు గ్రామానికి చెందిన కొండల రావు (47) విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో సెక్యూరిటీ గార్డు గా పని చేస్తున్నాడు. రోడ్డు దాటుతుండగా గూడూరు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో కొండలరావు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నెల్లూరు ప్రభుత్వా సుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ నాయకుడిపై.. మరో వైసీపీ నేత దాడి

నెల్లూరు(క్రైం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఓ వైసీపీ నాయకుడిపై మరో వైసీపీ నాయకుడు తన అనుచరులతో కలసి దాడి చేసిన [illegible] ఇద్దరికీ గాయాలవడంతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. రియల్ ఎస్టేట్ లావాదేవీలే ఇందుకు కారణం. పోలీసుల కథనం మేరకు... నగరంలోని కోటమిట్ట నెక్లెస్ రోడ్డు ప్రాంతానికి చెందిన సయ్యద్ మున్వర్ నగరంలోని ట్రంకురోడ్డులో గాంధీబొమ్మకు సమీపంలో కలర్స్ ప్లాజా వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నారు. ఈయన వైసీపీలో నాయకుడుగా ఉంటూ వస్త్ర దుకాణంతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. కాగా సయ్యద్ మున్వర్ ఆరేళ్ల క్రితం కోటమిట్ట ప్రాంతానికి చెందిన వైసీపీ నాయకుడు, వక్ఫ్‌బోర్డు మాజీ జిల్లా అధ్యక్షుడు మీరామొహిద్దీన్ ఉరఫ్ మీరా, మరి కొంతమంది భాగస్వాములతో కలసి నగరంలోని రవీంద్రనగర్‌లో కొంత స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆ స్థలం కొంత మేరకు ఆక్రమణకు గురి కావడంతో ఆ స్థలాన్ని విక్రయించేందుకు చట్టరీత్యా ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో మీరామొహిద్దీన్ ఆ స్థలంకు చెందిన డబ్బులు ఇవ్వాలని మున్వర్‌పై కొద్ది రోజులుగా ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో మున్వర్ వైసీపీ నాయకులు అబ్దుల్‌మస్తాన్‌కు విషయం తెలిపి మీరామొహిద్దీన్‌తో మాట్లాడి సయోధ్య ఏర్పాటు చేయాలని కోరారు. ఈ క్రమంలో ఈనెల 12వ తేదీ రాత్రి అప్సర్, మసూద్‌లు మద్యం సేవించి కలర్స్ దుకాణం వద్దకు వచ్చారు. మున్వర్‌ను దుకాణం బయటకు రావాలని కోరారు. అతను రానని చెప్పడంతోఆటు ఈ విషయాన్ని ఫోన్ ద్వారా అబ్దుల్‌మస్తాన్‌కు తెలియజేశారు. కొద్ది సేపటికి అన్వర్ అనే వ్యక్తి దుకాణం వద్దకు చేరుకొని బయటకు రాకుంటే చంపుతానని మున్వర్‌ను బెదిరించాడు. అయినా అతను రాకపోవడంతో అక్కడ నుంచి వెళ్లిపోయాడు. కొద్ది సేపటి తర్వాత మీరామొహిద్దీన్, తని అనుచరులు ఎస్ అల్తాఫ్, అప్సర్, ఆరీఫ్, నాజర్, రబ్బాని మరి కొంతమంది దుకాణం లోపలికి దూరి ఈరోజు డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తామని బెదిరించారు. వారి వెంట తెచ్చుకున్న కర్రలు, రాడ్లతో మూకుమ్మడి దాడి చేశారు. ఈ దాడిలో మున్వర్ తలకు, కంటికి, అతని అల్లుడుకు గాయాలయ్యాయి. అక్కడే ఉన్న కొందరు వారిని వెంటనే చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. చిన్న బజారు పోలీసులు వైద్యశాలకు చేరుకొని మున్వర్ ఫిర్యాదు మేరకు పలువురిపై కేసు నమోదు చేశారు. అనంతరం సోమవారం రాత్రి దాడికి పాల్పడిన వారిలో ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు.

రైలు నుండి పడి యువకుడి మృతి

కావలి రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ముసునూరు సమీపంలోని ఎగువమార్గం లో సోమవారం ఉదయం ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ రైలు నుండి ప్రమాద వశాత్తు జారిపడి ఓ గుర్తు తెలియని యువకుడు (23) మృతి చెందాడు. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రైలు పట్టాలపై తీవ్రగాయాలతో పడి ఉన్న ఓ యువకుడిని కీమెన్ మరియాదాసు గుర్తించి 108 వాహనంలో ఏరియా వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్రావ్ తెలిపాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి...

బిట్రగుంట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ముంగమూరు జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి కావలి వైపు నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో జనతాపేటకు చెందిన పాలవెల్లి పద్మనాభరెడ్డి (59) మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డిని కలవడానికి ఆదివారం మోటరు సైకిల్‌పై ముంగమూరు జాతీయ రహదారి కూడలి నుంచి కావలి వైపు వస్తుండగా, నెల్లూరు వైపు వెళుతున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన పద్మనాభరెడ్డిని నెల్లూరుకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.

చిల్లర దొంగ అరెస్ట్

మనుబోలు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): చోరీలకు పాల్పడుతున్న ఓ చిల్లర దొంగను పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తర లించారు. కేరళలోని త్రిశూర్‌కు చెందిన విన్సెంట్ సిమెథీ చిల్లర దొంగ తనాలు చేస్తుంటాడు. ఒంగోలు జిల్లాలో ఇతనిపై రెండు కేసులు నమోదయ్యాయి. మనుబోలు సూపర్ మార్కె ట్లలో చోరీలకు పాల్పడ్డాడు. జట్లకొండూరులో పోలీసులు అదుపులోకి తీసు కుని గూడూరు కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ శివరాకేష్ తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	218
స్కిన్‌లెస్	240

కోడిగుడ్ల ధర (100): 525

చిన్నారులను ప్రీ స్కూల్స్‌కు పంపించాలి

కందుకూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల దాటిన చిన్నారులందరినీ అంగన్వాడీ కేంద్రాలలోని ప్రీస్కూల్స్‌కు పంపించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యు ప్రభావతి కోరారు. మండలంలోని ఓగూరు 4వ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం రాష్ట్రీయ పోషణ మహాకార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో ఆటపాటలతో విద్యాబోధనతో పాటు సమయానికి పోషకాహారం కూడా అందిస్తూ చిన్నారుల సంరక్షణ బాధ్యత చూస్తారన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కల్యాణి, రమణమ్మ, మాలతి, మాధవి పాల్గొన్నారు.



స్వదేశీ వస్తువుల వినియోగ సదస్సు



మాట్లాడుతున్న సీవీసీ సత్యం

బిట్రగుంట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం బీజేపీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు వీరాల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో స్వదేశీ వస్తువుల వినియోగం, పరిజ్ఞాన సదస్సు సోమవారం సాయంత్రం జరిగింది. జిల్లా నేతలు సీవీసీ సత్యం, బీ మాల్యాద్రి, ఎన్ఎస్ యాదవ్ హాజరై ప్రసంగించారు. స్వదేశీ వస్తువుల వినియోగం వల్ల లాభాలు, విదేశీ వస్తువుల వాడకంతో వచ్చే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జీ కృష్ణయాదవ్, గోవిందరాజులు, పీ సూర్యం, ఏకే మైఖేల్ రాజ్, ఆర్ కిషోర్, సుధాకర్, కే పోలయ్య, శీను, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ ప్లాస్టిక్ మట్టి మాకొద్దు



ఆర్డీవోకు అర్జీ ఇస్తున్న టిడ్కో గృహ నివాసితులు

కావలి (టౌన్) అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బయోమెట్రిక్ ప్లాస్టిక్ పేరుతో టిడ్కో గృహ సముదాయంలో తోలుతున్న మట్టి అవసరం లేదని సోమవారం టిడ్కో నివాసితులు ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. మట్టినుంచి దుర్వాసన వెదజల్లుతోందని, గాజు ముక్కలు ఉన్నాయన్నారు. ప్లాస్టిక్ మట్టి తోలకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామన్నారు. స్థానికులతో పాటు సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచలయ్య, మధుసూదన్‌రావు, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత సొంత నిధులతో రోడ్డు రిపేరు



సొంత నిధులతో గ్రావెల్ వేయిస్తున్న మునగాల వెంకటేశ్వరరెడ్డి

జలదంకి, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): జలదంకి మండలం చామదల టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు మునగాల వెంకటేశ్వరరెడ్డి సొంత నిధులతో గ్రామంలోని ప్రధాన రహదారికి మరమ్మతులు చేయించాడు. కోనేరు మీదుగా వేళ్ళే ఈ రోడ్డు గత కొన్నేళ్ళుగా అధ్వానంగా ఉంది. దీంతో వెంకటేశ్వరరెడ్డి రూ.50 వేల సొంత నిధులతో గ్రావెల్ వేయించి మరమ్మతులు చేయించడంతో ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

విపత్తుల సమయాల్లో యువత చేయూతనందించాలి

అల్లూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : విపత్తుల సమయాల్లో యువత సామాజిక స్పృహతో సహాయ సహకారాలు అందించాలని ప్రజాసత్తా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పులగర శోభన్ బాబు అన్నారు. సోమవారం అల్లూరులోని రామకృష్ణ జూనియర్, డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ విపత్తు నివారణ దినం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విపత్తుల నివారణ అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలలో ప్రిన్సిపాల్ వీ శ్రీనివాసులు, నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ ఆకుల మహేంద్రరెడ్డి, చింతల దయాకర్, లోకేష్, ఆవుల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

మొగళ్లపల్లి సత్రాలను వినియోగంలోకి తేవాలి

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని మొగళ్లపల్లి వెంకట సుబ్బయ్య సత్రాలను ఆధునీకరించి వినియోగంలోకి తేవాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు సోమవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిపాలనాధికారి శ్రీలతకు వినతిపత్రం అందజేశారు. నెల్లూరు నడిబొడ్డులో రూ.100 కోట్ల విలువ చేసే సత్రం ఆస్తులు శిథిలావస్థకు చేరాయని, మొగళ్లపల్లి వెంకటసుబ్బయ్య శ్రేష్ఠి పేద ప్రజల సేవా కార్యక్రమాల కోసం ఇచ్చిన విలువైన ఆస్తులు నిరుపయోగంగా ఉండడం బాధ కలిగిస్తోందని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆస్తులు ప్రజలకు ఉపయోగపడాలని, కొత్త నిర్మాణాలతో దేవాదాయ ధర్మాదాయ శాఖకు ఆదాయం వచ్చేలా రూపకల్పన చేయాలని కోరారు.

15 మంది రౌడీషీటర్ల బైండోవర్



తహసీల్దార్ శ్రీనివాసులు ముందు రౌడీషీటర్లను హాజరు పరిచిన ఎస్సై అంకమ్మ

ఉలవపాడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా చట్టపరంగా వ్యవహరించే విధంగా మండలంలోని 15 మంది రౌడీషీటర్లను సోమవారం మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్, తహసీల్దార్ టీ శ్రీనివాసులు ముందు బైండోవర్ చేసినట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. 6 నెలలపాటు సత్ప్రవర్తనతో నడుచుకునేందుకు ఒక్కో రౌడీషీటర్ నుంచి రూ.లక్ష బాండ్‌తో బైండోవర్ చేయించినట్లు పేర్కొన్నారు. విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడితే చట్టపరమైన కేసులు పెట్టి చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. తమ పరిధిలోని రౌడీషీటర్లు అక్రమాలకు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై మండల ప్రజలకు సూచించారు.

జీఎస్టీపై అవగాహన ర్యాలీ



శాఖవరంలో జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు

వలేటివారిపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాఖవరంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై సోమవారం అధికారులు, నాయకులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ శంకర్‌రావు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది గ్రామస్థులతో సమన్వయం చేసుకొని ఇంటింటికి వెళ్లి సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై అర్జీల స్వీకరణ



మున్సిపల్ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ అనూష

కందుకూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కె అనూష సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల కార్యక్రమంలో వివిధ సమస్యలపై 5 అర్జీలు వచ్చాయని తెలిపారు. అందరు సెక్షన్ హెడ్స్ ఈ కార్యక్రమంలో పాల్గొనగా సమస్యల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించామన్నారు. పారిశుధ్యం, ఇతర సమస్యలపై 9177700267 నెంబరుకు ఫోన్‌చేసి తెలియజేసినా తక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం



భ్రూణహత్యలపై బాలికలకు అవగాహన కల్పిస్తున్న ప్రత్యేకాధికారి, వైద్య సిబ్బంది

వలేటివారిపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లింగనిర్ధారణ పరీక్షలను నిషేధించాయని ప్రత్యేకాధికారిణి సుజాత తెలిపారు. మండలంలోని జమీన్‌ఉప్పలపాడు కేజీబీవీలో భ్రూణహత్యలు, లింగనిర్ధారణ పరీక్షలు, మహిళలపై అత్యాచారాలు, బాలికల అభ్యున్నతి, ఆడపిల్లలను రక్షించుకోవడం తదితర అంశాలపై సోమవారం అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారిణి సుజాత మాట్లాడుతూ భ్రూణహత్యలు నిరోధించడానికి కిశోరి శక్తి యోజన తదితర పథకాలను ప్రభుత్వాలు అమలుచేస్తున్నాయన్నారు.

మాజీ ఎమ్మెల్యేల కలయికతో హర్షం



కలిసి మాట్లాడుకుంటున్న మాజీ ఎమ్మెల్యేలు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రతాప్‌కుమార్ రెడ్డి

కావలి (టౌన్) అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గత సాధారణ ఎన్నికలప్పటి నుంచి దూరంగా ఉంటున్న మాజీ ఎమ్మెల్యేలు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రతాప్‌కుమార్ రెడ్డి సోమవారం కలుసుకుని అభిమానంగా మాట్లాడుకోవడంతో వారి అనుచరులు, వైసీపీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమైంది. గత ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రతాప్‌కుమార్ రెడ్డి గెలుపు కోసం విష్ణువర్ధన్ రెడ్డి పనిచేసినప్పటికీ, ప్రతాప్‌కుమార్ రెడ్డి ఓడిపోవడంతో విష్ణుకు దూరంగా ఉంటున్నారు. ఇటీవల వైసీపీ అధినేత జగన్‌తో విష్ణువర్ధన్ రెడ్డి దంపతులు భేటీ అయ్యారు. విష్ణును వైసీపీ సెంట్రల్ కమిటీ సభ్యునిగా నియమించారు. అప్పటి నుండి ప్రతాప్‌కుమార్ రెడ్డి మనస్తాపం చెందారని, దీంతో ఇరువురి మధ్య మరింత దూరం పెరిగిందని వైసీపీ శ్రేణుల్లో గుసగుసలు వినిపించాయి. పద్మనాభరెడ్డి నివాసముండే వీధిలో విష్ణు, ప్రతాప్‌కుమార్ రెడ్డిలు కలుసుకుని అభిమానంతో పలకరించుకున్నారు. ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని విష్ణు అడిగి తెలుసుకోవడంతో వైసీపీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

రూ.9,139 కోట్లతో త్రీఫేస్ విద్యుత్ పనులు

● నెలాఖరులోపు నెల్లూరు రూరల్‌లో పూర్తి ● ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వెల్లడి



చంద్రన్న విద్యుత్ వెలుగులు బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని కోట్లాది మంది ప్రజలకు విద్యుత్ కష్టాలు తీర్చి నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రభుత్వం రూ.9139 కోట్లతో త్రీఫేస్ విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులను వేగంగా చేస్తోందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఒక్క నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోనే రూ.50 కోట్లతో ఈ పనులు జరుగుతున్నట్లు వివరించారు. ఇప్పటికే 97 శాతం పనులు పూర్తయ్యాయని, నెలాఖరుకు మిగిలిన పనులు పూర్తవుతాయని చెప్పారు. ఈ బృహత్తర ప్రాజెక్టుకు 'చంద్రన్న విద్యుత్ వెలుగులు' గా నామకరణం చేశామని, త్వరలోనే ప్రజలకు అంకితం చేస్తామని శ్రీధర్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం నెల్లూరులోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రన్న విద్యుత్ వెలుగులు పేరుతో ప్రత్యేకంగా రూపొందించిన బుక్‌లెట్‌ను ఆయన విడుదల చేశారు. అనంతరం శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్రంలో రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. చంద్రన్న విద్యుత్ వెలుగులు ప్రాజెక్టు ద్వారా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 18 గ్రామాలు, మూడు అర్బన్ డివిజన్లలో సుమారు 80 వేల మందికి మేలు చేకూరుతుందని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆశీస్సులతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు రాష్ట్రంలో కరెంటు కష్టాలు లేకుండా చేసేందుకు విశేషంగా కృషి చేస్తున్నారని చెప్పారు.

ఉచిత వైద్య శిబిరం

నెల్లూరు(విద్య), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని గోమతినగర్‌లో ఉన్న గోమతి నారాయణ సీబీఎస్ఈ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు, సిబ్బందికి విద్యాసంస్థల హెచ్‌ఆర్ విభాగం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఆర్ మస్తానయ్య మాట్లాడుతూ విద్యాసంస్థల్లో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలు కూడా అందచేస్తున్నామన్నారు.

గతుకుల రోడ్లు.. డొక్కు బస్సులు !

● ప్రయాణికుల అవస్థలు



కందుకూరు-ఇసుకపాలెం ఆర్టీసీ బస్సులో చివరలో లేని రెండు సీట్లు



లింగసముద్రంలోని పెట్రోల్ బంకు ఎదురుగా గుంతలు పడిన ఆర్‌అండ్‌బీ రోడ్డు

లింగసముద్రం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గతుకుల రోడ్లు, డొక్కు బస్సులతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వలేటివారిపాలెం నుండి లింగసముద్రం మీదుగా రాళ్లపాడు ప్రాజెక్టు వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలమయమై దారుణంగా తయారైంది. ముఖ్యంగా ఈ రోడ్డుపై పలు చోట్ల అడుగుకో గుంత ఏర్పడి ప్రయాణం నరకప్రాయంగా మారింది. దీనికితోడు వర్షం కురిసినప్పుడు ఆనీరు ఈ గుంతలలో నిలిచి గుంతలు కాస్తా పెద్దగా మారితున్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక బస్సుల విషయానికొస్తే కందుకూరు డిపో నుండి లింగసముద్రం మీదుగా కొండాపురం, మొగిలిచెర్ల, ఇసుకపాలెం వెళ్లే కొన్ని బస్సులు డొక్కు బస్సులుగా ఉన్నాయి. ఈ బస్సుల్లో సీట్లు, కిటికీలు సరిగా ఉండవు. ఇలా కాలం చెల్లిన బస్సులతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. సంబంధిత ఆర్టీసీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కుర్చీల బహూకరణ



పోలినేనిపాలెంలో గ్రామ సచివాలయానికి కుర్చీలు అందజేస్తున్న మాల్యాద్రి

వలేటివారిపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలినేనిపాలెంలో గ్రామ సచివాలయానికి అదే గ్రామానికి చెందిన మామిళ్లపల్లి మాల్యాద్రి 11 కుర్చీలను పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లుకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ సర్పంచ్ అమరేశ్వరి, సచివాలయ సిబ్బంది మాల్యాద్రికి అభినందనలు తెలియజేశారు.

శాంప్ - 2 పరీక్షలు ప్రారంభం



పరీక్షల ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంఈవో - 2 ఆనందరావు

కొండాపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): శాంప్-2 పరీక్షలను విద్యాశాఖ ఆదేశాలమేరకు అధికారులు మండలపరిధిలోని అన్ని పాఠశాలల్లోనూ సోమవారం ప్రారంభించారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో పరీక్షల ప్రక్రియను మండల విద్యాశాఖాధికారి - 2 ఆనందరావు పరిశీలించారు. పరీక్షాపత్రాలను వెంటనే మూల్యాంకనం చేసి ఆన్‌లైన్లో నమోదు చేయాలని ప్రిన్సిపాల్ జయంతిని ఆదేశించారు.

రాకేశ్‌శర్మను అరెస్టు చేయాలి



నిరసన తెలుపుతున్న దళిత సంఘర్షణ సమితి నేతలు

కావలి,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై బూటు విసిరి అవమానించిన న్యాయవాది రాకేశ్‌శర్మను వెంటనే అరెస్ట్ చేయాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి డిమాండ్ చేశారు. సోమవారం కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఆర్డీవో ఎం సన్నీ వంశీక్రిష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దళితసంఘర్షణ సమితి నేత లు జరుగుమల్లి విజయరత్నం, నెల్లూరు కొండమ్మ, వాసు, లక్ష్మీనర్సు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు(సిటీ), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ టిడ్కో ఇళ్లు అందచేస్తామని, ఆ మేరకు దరఖాస్తు చేసుకోవాలని ఎన్ఎంసీ కమిషనర్ నందన్ కోరారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన మాట్లాడారు. నగర పరిధిలోని వివిధ ప్రాంతాలలో నిర్మించిన 17,520 టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అందచేయనున్నామన్నారు. అందులో 300 చ.అ విస్తీర్ణం కలిగినవి 16,144 ఉండగా, 365 చ.అ విస్తీర్ణం కలిగినవి 352, 430 చ.అ విస్తీర్ణం కలిగినవి 1,022 ఉన్నాయన్నారు. వీటిని తగిన లబ్ధిదారులకు అందచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఉచితంగా అందచేసే ఇళ్లలో 13 వేల వరకు రిజిస్ట్రేషన్లు పూర్తి చేయగా 11 వేల ఇళ్లలో లబ్ధిదారులు ఉంటున్నారని తెలిపారు. అర్హతలున్న వారెవరైనా ఇల్లు కావాలంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వైసీపీ నేత పాలవల్లికి పలువురి నివాళి

కావలి (టౌన్) అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి ప్రధాన అనుచరుడు పాలవల్లి పద్మనాభరెడ్డి (58) మృతదేహానికి సోమవారం పలువురు నివాళులర్పించారు. ముంగుమూరు రోడ్డు జాతీయ రహదారి వద్ద ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో పద్మనాభరెడ్డి మృతి చెందారు. జనతాపేట పెద్దపవని రోడ్డు వద్ద గల మృతుని నివాసంలో మాజీ ఎమ్మెల్యేలు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రతాప్‌కుమార్ రెడ్డి, వైసీపీ జిల్లా నాయకులు పేర్నేటి కోటేశ్వరరావు, వైసీపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, సామాజిక కార్యకర్తలు పద్మనాభరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పద్మనాభరెడ్డి నేత్రదానం

కావలి: రోడ్డు ప్రమాదంలో మరణించిన పాలవెల్లి పద్మనాభరెడ్డి నేత్రాలను భార్య మాధవి, కుమార్తెలు లిఖిత, తనూజ అంగీకారంతో నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి దానం చేశారు. పద్మనాభరెడ్డి కార్నియాలను ఎల్వీ ప్రసాద్ ఐ ఆసుపత్రి టెక్నీషియన్ సునీల్ సోమవారం సేకరించారు. పద్మనాభరెడ్డి కుటుంబ సభ్యులకు కావలి రెడ్‌క్రాస్ నేత్రదాన విభాగం కన్వీనర్ ఇలింద్ర శ్రీవాణి కృతజ్ఞతలు తెలిపారు. ఇది కావలి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జరిగిన 150వ నేత్రదానమని రెడ్‌క్రాస్ ప్రతినిధులు డీ. రవిప్రకాష్, కే. హరినారపరెడ్డి తెలిపారు.

కాలువల పూడికతీతను విస్మరించిన వైసీపీ



బీఎండీ బిట్-1 పూడికతీత పనులు ప్రారంభిస్తున్న సోమశిలప్రాజెక్ట్ వైస్ చైర్మన్ మధుమోహన్ రెడ్డి

జలదంకి, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): సోమశిల ప్రాజెక్ట్ పరిధిలోని మేజర్, మైనర్ పంట కాలువల పూడికతీత పనులను గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ పి మధుమోహన్ రెడ్డి విమర్శించారు. సోమశిల ప్రాజెక్ట్ ఆయకట్టు పరిధిలోని బ్రాహ్మణక్రాక మేజర్ కాలువ బిట్-1 పరిధిలో పూడికతీత పనులను సోమవారం ఆయన అన్నవరం వద్ద పూజలు చేసి ప్రారంభించారు. ఓఅండ్ఎం నిధులతో మేజర్ కాలువల్లో పూడికతీత పనులను ప్రభుత్వం చేపట్టిందన్నారు. బ్రాహ్మణక్రాక మేజర్ పరిదిలోని బిట్-1, బిట్-2 సాగునీటిసంఘాల పరిధిలో పనులకు దాదాపు రూ. 12 లక్షలు మంజూరయ్యాయని, నిధుల మంజూరుకు కృషి చేసిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు బ్రాహ్మణక్రాక మేజర్ ఆయకట్టు రైతుల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘాల అధ్యక్షుడు చింతం సుధాకర్‌రెడ్డి, వీ. పాండురంగారెడ్డి, పీ. భాస్కర్‌రెడ్డి, వీ. సుబ్బారెడ్డి, డైరెక్టర్లు, డీఈ శరత్, ఏఈ నాగార్జునరెడ్డి, నాయకులు రఘు, సుబ్బారెడ్డి, మహేంద్రరెడ్డి పాల్గొన్నారు.

బాణసంచా అక్రమ నిల్వలపై కఠిన చర్యలు



బాణసంచాను తనిఖీ చేస్తున్న ఎస్ఐ సయ్యద్ లతీఫున్నీసా బేగం

జలదంకి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ నేపథ్యంలో మండల పరిధిలోని జమ్మలపాలెంలోని బాణాసంచా గోడౌన్‌ను జలదంకి ఎస్ఐ సయ్యద్ లతీఫున్నీసా బేగం సోమవారం సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. గోడౌన్‌కు అనుమతులు ఉన్నాయా? లేదా? అని బాణాసంచా గోడౌన్ నిర్వాహకుడు శ్రీధర్‌రెడ్డిని విచారించారు. అనుమతులకు సంబంధించి ధృవపత్రాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం నుండి అనుమతులు ఉంటేనే బాణాసంచా నిల్వ చేసుకుని విక్రయించాలని పేర్కొన్నారు. చట్టవిరుద్ధంగా బాణాసంచా నిల్వ ఉంచితే కఠిన చర్యలు తప్పవని విక్రయదారులను హెచ్చరించారు.

● కావలి రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బాణాసంచా తయారీ, నిల్వలు, విక్రయాలకు సంబంధించి వ్యాపారులు తప్పకుండా అనుమతులు తీపుకోవాలని రూరల్ సీఐ రాజేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు అనుమతులు పొందిన తరువాత మాత్రమే బాణాసంచా విక్రయాలు చేపట్టాలన్నారు. అగ్నిప్రమాదాల నివారణకు దుకాణాల ముందు నీళ్లడ్రమ్ము, పొడి ఇసుక అగ్నిమాపక నియంత్రణ పరికరాలు ఉంచుకోవాలన్నారు. అనుమతులు లేకుండా బాణాసంచా తయారు చేసినా, విక్రయించినా, నిల్వలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతులు లేకుండా టపాసులు విక్రయిస్తే 112 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఆడబిడ్డలను రక్షించుకుందాం..



అవగాహన కల్పిస్తున్న వెంకటసుబ్బయ్య

కలిగిరి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఇంటికి మహాలక్ష్మిలాంటి ఆడబిడ్డను రక్షించుకోవడానికి కుటుంబంతో పాటు సమాజం అండగా నిలవాలని ఆరోగ్యవిద్యాధికారి కలసపాటి వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. సేవ్ గర్ల్ చైల్డ్ కార్యక్రమంపై సోమవారం స్థానిక కేజీబీవీలో విద్యార్థినులకు అవగాహన నిర్వహించారు. భ్రూణ హత్యలు, లింగ వివక్ష, పీసీపీఎన్‌డీటీ చట్టం, సుకన్య సమృద్ధి, భేటీ బచావో-భేటీ పఢావో తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజన, పీహెచ్ఎన్ మేరీ, హెచ్ఎస్ నరసయ్య, నాగమణి పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టానికి ఇరవై ఏళ్లు

జలదంకి, (ఆంధ్రజ్యోతి): దేశంలో సమాచారహక్కు చట్టం అమల్లోకి వచ్చి 20 ఏళ్ళు పూర్తయిందని లోక్‌సత్తా ఉద్యమనేత ఎం. మాలకొండారెడ్డి సోయవారం ఓ ప్రకటనలో తెలిపారు. స.హ చట్టం సెక్షన్ 4,1బీ ప్రకారం ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో 17 అంశాల సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని, పౌరులు అడిగిన సమాచారాన్ని గడువులోగా తప్పకుండా ఇవ్వాలన్నారు. ఇంకా ప్రజలకు ఈ చట్టంపై పూర్తిగా అవగాహన లేదన్నారు. మారుమూల గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

పత్రికా ప్రకటన

శ్రీ కావలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No. 458/25
O.S.No. 23/25

Between
దగ్గోలు పెంచల నరసింహారావు ...వాది
V/s
1.కదియాల సుధాకర్
2.కదియాల ప్రసన్న .....ప్రతివాదులు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పైన తెలుపబడిన వాది ప్రతివాదుల పైన దిగువ కనపరచిన షెడ్యూలు ప్రాపర్టీ మీద ప్రతివాదులు అక్రమంగా ప్లాట్లు గా మార్చబోతున్నారని మరియు అమ్మబోతున్నారని తెలిసి వాది అయినా **దగ్గోలు పెంచల నరసింహారావు** షెడ్యూలు ప్రాపర్టీ తనది అని దాని మీద ప్రతివాదులకు ఎటువంటి హక్కు లేదని శ్రీ కావలి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారిని ఆశ్రయించి పైన తెలుపబడిన **I.A. No.458/25** మరియు దావా **No.23/25** ప్రకారం ఇంటీరియం ఇంజక్షన్ తీసుకుని ఉన్నాం. సదరు షెడ్యూలు దాఖల ఆస్తి లో ఎవరైనా లావాదేవీలు జరిపినచో అవి చట్టరీత్యా చెల్లనేరదని ఈ ప్రకటన ద్వారా అందరికి తెలియజేయడం అయినది.

షెడ్యూలు ఆస్తి

నెల్లూరు జిల్లా, వింజమూరు, సబ్ రిజిస్ట్రేషన్, కలిగిరి మండలం, కలిగిరి గ్రామం, పట్టా నెంబర్:73, ఖాతా నెంబర్:740, కొరుమిట్ట సర్వే నంబరు 1026, మొత్తం విస్తీర్ణం AC 4.98 సెంట్స్ లోని సర్వే నంబరు 1026/1, AC 2.49 సెంట్లకు హద్దులు **తూర్పు:** బొడ్డు వెంకారెడ్డి పొలం **పడమర:** వాదిపొలం, **ఉత్తరం:** కావలి నుండి ఉదయగిరి రోడ్డు, **దక్షిణం:** వాది పొలం.

P.V Siva prasad Reddy B.com., B.L
Advocate & Notary. Cell: 94402 07018

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



తండ్రీ కొడుకులు

ఒకే పాఠశాలలో టీచర్లు

వాళ్లు తండ్రీ కొడుకులు. స్కూల్ అసిస్టెంట్లు. అందులోనూ ఒకటే స్కూల్. ఈ అరుదైన ఘటనకు వేదికైంది చంద్రగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల. ఆ తండ్రీ కొడుకులు మునగల రవీంద్రుడు, హరిప్రసాద్. వీరిది తిరుపతి రూరల్ ఓటేరు శ్రీవారినగర్. ఇప్పటికే రవీంద్రుడు తెలుగు భాషా ఉపాధ్యాయుడిగా ఆ పాఠశాలలో పనిచేస్తున్నారు. ఈయన కుమారుడు ఇటీవల జరిగిన డీఎస్సీ ద్వారా ఫిజికల్ సైన్స్ టీచర్ (స్కూల్ అసిస్టెంట్)గా ఉద్యోగం సాధించారు. శుక్ర, శనివారాల్లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో హరిప్రసాద్ చంద్రగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే పోస్టింగ్ పొందారు. తండ్రి పనిచేస్తున్న పాఠశాలలోనే సోమవారం విధుల్లో చేరారాయన. 'ఉపాధ్యాయ ఉద్యోగం రావడమే అదృష్టమనుకుంటే.. మా నాన్నతో కలిసి పనిచేసే అవకాశం దక్కడం ఎంతో ఆనందాన్నిస్తోంది. ఇది శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీర్వాదమే. ఉపాధ్యాయుడినై మా నాన్న కలను నెరవేర్చే అవకాశాన్ని మెగా డీఎస్సీ ద్వారా విద్యాశాఖ మంత్రి లోకేశ్ కల్పించారు. మా నాన్న అడుగుజాడల్లో నడిచి.. మంచి ఉపాధ్యాయుడిగా పేరు తెచ్చుకుంటా. విద్యార్థుల ఉన్నతికి కృషిచేస్తా' అని హరిప్రసాద్ ఆనందంగా చెప్పారు.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి



తిరుమలలో కృతి

నటి కృతిశెట్టి సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు ఆమెను చూసేందుకు.. సెల్ఫీలు తీసుకునేందుకు పలువురు ఎగబడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కొత్తగా పల్లె పాలన

- క్లస్టర్ వ్యవస్థకు మంగళం
- గ్రేడ్లుగా పంచాయతీల విభజన
- పీడీవోలుగా కార్యదర్శులు



తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కొత్త సంస్కరణలతో పల్లె పాలన మారనుంది. గ్రామ పంచాయతీల సర్వతోముఖాభివృద్ధికి తీసుకొస్తున్న నూతన విధానానికి రాష్ట్ర మంత్రివర్గం రెండు రోజుల కిందట ఆమోదం తెలిపింది. ప్రజలకు చేరువగా పాలన ఉండటంతో పాటు కేంద్రప్రభుత్వం నుంచి అధిక మొత్తంలో నిధులు రాబట్టేలా చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో క్లస్టర్ల వ్యవస్థకు మంగళం పలికింది. గ్రేడ్ల వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. పట్టణ సమీపంలో ఉండే పంచాయతీలను రూరల్-అర్బన్ (రూర్బన్) పంచాయతీలుగా ప్రత్యేక గ్రేడ్ ఇస్తున్నారు. వీటిలో 10 వేల జనాభా, కోటిపైన ఆదాయం ఉండాలి. ఈ పంచాయతీల్లో గ్రామ కార్యదర్శుల స్థానంలో డిప్యూటీ ఎంపీడీవో (ఈవోపీఆర్డీలు)లు నియమితులు కానున్నారు. మున్సిపాలిటీల్లో ఏ విధమైన పాలన ఉంటుందో ఇక్కడా అదే తరహాలో కొనసాగుతుంది. మిగిలిన పంచాయతీలను.. మూడువేలపై జనాభా ఉన్న వాటిని గ్రేడ్-1గా, 3వేలు జనాభాలోపు గ్రేడ్-2గా, 2 వేల లోపు జనాభాఉన్న పంచాయతీలను గ్రేడ్-3గా విభజించారు. ఇలా గ్రామ పంచాయతీ వ్యవస్థను ప్రక్షాళన దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మరోవైపు సచివాలయ వ్యవస్థను హేతుబద్ధీకరిస్తున్నారు.

పీడీవోలుగా పంచాయతీ కార్యదర్శులు

గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఇక పంచాయతీ డెవలప్‌మెంట్ అధికారులు(పీడీవో)గా వ్యవహరించనున్నారు. పల్లెల అభివృద్ధిలో వీరి పాత్ర కీలకం చేశారు. ప్రతి పంచాయతీకి పీడీవో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోంటోంది.

జిల్లాలో పంచాయతీలు: 774
అర్బన్-రూరల్ పంచాయతీలు: 15
గ్రేడ్-1: 49
గ్రేడ్ -2: 145
గ్రేడ్ -3: 569
- గ్రామీణ జనాభా: 16.82 లక్షలు
- ఏటా వచ్చే ఇంటి పన్ను: రూ.42కోట్లు

సుస్థిర పాలనకు ఊతం



రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన సంస్కరణలు గ్రామాల్లో సుస్థిర అభివృద్ధికి, సుపరిపాలకు ఎంతగానో దోహదపడతాయి. పట్టణాల తరహాల్లో పల్లెలను అభివృద్ధి చేసేలా కొత్త వ్యవస్థను ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. మున్సిపాలిటీ తరహాలోనే నూతన పట్టణ ప్రణాళిక విభాగం ఏర్పాటు చేయడంతో ఆదాయ వనరులు పెరిగే అవకాశం ఉంది.

- సుశీలాదేవి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి

తిరుమలలో నెయ్యి నిల్వల సామర్థ్యం పెంపు

- దాదాపు 2.24 లక్షల కిలోలు నిల్వ చేసేలా ఏర్పాట్లు



నిర్మాణంలో ఉన్న నెయ్యి ట్యాంకర్లు

తిరుమల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూ ప్రసాదంతో పాటు ఇతర నైవేద్య అన్నప్రసాదాల్లో వినియోగించే నెయ్యిని అధిక మొత్తంలో నిల్వ చేసేలా టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. దాదాపు 2.24 లక్షల కిలోల నెయ్యిని ఒకేసారి నిల్వ చేసుకునేలా ప్రణాళికలు రూపొందించింది. ప్రస్తుతం టీటీడీ రోజుకు 4 లక్షల నుంచి 4.50 లక్షల వరకు లడ్డూలు, నైవేద్య ప్రసాదాలు వంటి వాటికి 15 వేల నుంచి 17 వేల కేజీల నెయ్యిని వినియోగిస్తోంది. ప్రస్తుతం ఆలయం పక్కనే పుష్కరిణికి అనుకున్న ఉన్న ఘీ స్టోరేజ్ కేంద్రంలో కేవలం నాలుగు ట్యాంకులే ఉన్నాయి. వీటి ద్వారా 80 వేల కేజీలను మాత్రమే నిల్వ చేయగలరు. అంటే నాలుగైదు రోజులకు సరిపడా నెయ్యిని మాత్రమే నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంది. ఈక్రమంలో నెయ్యి నిల్వలు తగ్గుతున్న సందర్భాల్లో తిరిగి లారీల ద్వారా స్టోర్ చేసుకోవడానికి అధికారులు, సిబ్బంది కంగారుపడాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి చెక్ పెట్టేదిశగా టీటీడీ నెయ్యి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే నూతనంగా నాలుగు నూతన ట్యాంకర్లను సిద్ధం చేస్తున్నారు. ఒక్కో ట్యాంకర్ నిల్వ సామర్థ్యం 36 వేల కేజీలు. అంటే 1.44 లక్షల కేజీల అదనపు నెయ్యి నిల్వ సామర్థ్యం టీటీడీకి అందుబాటులోకి రానుంది. ప్రస్తుతమున్న ట్యాంకర్ల నిల్వను కూడా జత చేస్తే దాదాపు 2.24 లక్షల కేజీల నెయ్యిని నిల్వ చేయవచ్చు. వీటి ద్వారా దాదాపు 13 నుంచి 14 రోజులకు సరిపడా నెయ్యిని నిల్వ చేసుకునే వెసులుబాటు టీటీడీకి రానుంది. చెన్నై సూపర్ కింగ్(సీఎస్‌కే) ఈ ట్యాంకర్ల ఏర్పాటుకు విరాళం ఇవ్వడం గమనార్హం.

నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం

సదరన్ డిస్కం సీఎండీ శివశంకర్



తిరుపతి, అక్టోబర్ 13(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని వినియోగదారులకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా పని చేస్తానని నూతన సీఎండీ లోతేటి శివశంకర్ అన్నారు. తిరుపతిలోని డిస్కం ప్రధాన కార్యాలయంలో సోమవారం బాధ్యతలు చేపట్టిన ఆయన మీడియాతో మాట్లాడారు. విద్యుత్ రంగంలో సంస్కరణలను వేగంగా అమలు చేయడానికి ప్రయత్నిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యాలను నెరవేర్చడానికి తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరా ఉన్న గ్రామాలను త్రీ ఫేజ్‌కు మార్చడం, ఆర్‌డీఎస్ఎస్ స్కీం అమలు చేయడం కీలక బాధ్యతలుగా భావిస్తున్నట్లు తెలిపారు. రెన్యువబుల్ ఎనర్జీ అయిన సూర్యఘర్ వంటి పథకాల అమలును వేగవంతం చేస్తామన్నారు. విద్యుత్ సరఫరాలో, సేవల్లో, విద్యుత్ నాణ్యతపై ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తక్షణం స్పందించి పరిష్కరించేలా యంత్రాంగం పనితీరును మెరుగుపరిచేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. డిస్కంలో ఖాళీ పోస్టుల భర్తీ విషయమై ప్రభుత్వం సమీక్షిస్తోందని, త్వరలో ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. 'స్మార్ట్ మీటర్ల ఏర్పాటు మంచిది. ఎంతో అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాల్లోనూ వీటిని వాడుతున్నారు. ఈ మీటర్ల వల్ల రీడింగ్ కచ్చితంగా తెలుస్తుంది. ఇళ్లయినా, షాపైనా, పరిశ్రమలోనైనా ఎంత లోడ్ ఉందో తెలుస్తుంది. ఆ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సరఫరాను మరింత మెరుగుపరచడానికి అవకాశం ఉంటుందన్నారు. దీనిపై ఎలాంటి అపోహలు వద్దు' అని సూచించారు.

సీఎండీగా శివశంకర్ బాధ్యతల స్వీకరణ

తిరుపతి(ఆటోనగర్), ఆంధ్రజ్యోతి: ఏపీ సదరన్ డిస్కం సీఎండీగా ఎల్.శివ శంకర్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. తిరుపతిలోని ప్రధాన కార్యాలయానికి ఉదయం 10.30 గంటలకు ఆయన చేరుకోగా.. పూర్వపు సీఎండీ కె.సంతోషరావు స్వాగతం పలికారు. పూజల అనంతరం పూర్వపు సీఎండీ బాధ్యతలు అప్పగించారు. సంస్థ డైరెక్టర్లు పి.అయూబ్‌ఖాన్, కె.గురవయ్య, రామమోహన రావుతో పాటు సీజీఎంలు, జీఎంలు, తిరుపతి సర్కిల్ ఎస్ఈ వి.చంద్రశేఖర్‌రావు, పలువురు ఎస్ఈలు, ఈఈలు, డీఈఈలు, ఏఈలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రాయుడి అంశంపై రగడ

- మళ్లీ తెరపైకి వచ్చిన జనసేన మాజీ ఇన్‌చార్జి వినుత డ్రైవర్ హత్యోదంతం
- సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన వీడియో


శ్రీకాళహస్తి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సరిగ్గా మూడు నెలల కిందట జూలై 12వ తేది.. తమిళనాడు సెవెన్‌వెల్స్ ప్రాంతంలో రాయుడు మృతదేహం వెలుగు చూసింది. కూవం నది నుంచి మృతదేహాన్ని వెలికి తీసిన చెన్నై పోలీసులు శ్రీనివాస్ అలియాస్ రాయుడిగా గుర్తించి అప్పటి శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వినుతతో పాటు ఆమె భర్త చంద్రబాబు సహా ముగ్గురు అనుచరులను అరెస్టు చేయడం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఆ తర్వాత అనూహ్యంగా ఆదివారం రాయుడి సెల్ఫీ వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. అతడి వ్యాఖ్యలు మళ్లీ సర్వత్రా దుమారం రేపాయి. ఈ వీడియో నేపథ్యంలో వినుతతో పాటు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సోమవారం స్పందించారు.

వినుత దంపతులను హతం చేసేందుకు పన్నాగం



'నాపేరు శ్రీనివాసులు అలియాస్ రాయుడు. నేను వినుత దగ్గర డ్రైవర్‌గా పనిచేశా. గతేడాది సార్వత్రిక ఎన్నికలకు ముందు జనసేన నేత పేట చంద్రశేఖర్ ద్వారా టీడీపీ కార్యకర్త సుజిత్‌తో పరిచయం ఏర్పడింది. వినుత దంపతుల కదలికలు, వారి విషయాలను ఎప్పటికపుడు చేరవేస్తే రూ.30లక్షలు ఇస్తామని నన్ను ప్రలోభపెట్టారు. ఆ మేరకు రూ.2లక్షలు కూడా వారి నుంచి అందుకున్నా. ఎన్నికల తర్వాత నాకు రూ.20లక్షలు మాత్రమే ఇచ్చారు. మళ్లీ పలుమార్లు పేట చంద్రశేఖర్, సుజిత్ నాతో సంప్రదించి వినుత దంపతులను చంపాలని, మరో రూ.30లక్షలు స్థానిక కూటమిలోని బొజ్జల సుధీర్‌రెడ్డి ద్వారా ఇస్తామని చెప్పారు. నేను కారు నడిపే సమయంలో అతివేగంగా వెళుతూ రోడ్డు ప్రమాదం జరిగేలా రెండుసార్లు ప్రయత్నించే సమయంలో వినుత దంపతులు అప్రమత్తమయ్యారు. అప్పట్నుంచి నన్ను డ్రైవింగ్‌కు దూరంగా పెట్టారు. ఎలాగైనా చంపాలని జనసేన నేత కొట్టే సాయి ద్వారా మళ్లీ నన్ను సంప్రదించారు. తిరుపతిలోని హోటల్‌లో కూటమి ముఖ్యనేత వద్దకు తీసుకెళ్లి మాట్లాడించారు. ఆ తర్వాత వ్యక్తిగత వీడియోలు సేకరించి పంపాలని ఒత్తిడి చేశారు. ఒకరోజు నేను వీడియో చిత్రీకరించే సమయంలో నా ఫోన్‌కు మెసేజ్ రావడంతో పట్టుబడ్డా. ఈ విషయాన్ని ఆ ముఖ్యనేత, కొట్టేసాయి, చంద్రశేఖర్, సుజిత్‌కు ఫోను ద్వారా సందేశం పంపా. వారి నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. మళ్లీ నన్ను నేరుగా కలిసిన చంద్రశేఖర్, సుజిత్ ఎవరి పేర్లు బయట రాకూడదని, అలా వస్తే ఇబ్బందులో పడుతావని హెచ్చరించారు' అంటూ ఆ వీడియోలో రాయుడి మాటలు సాగాయి.

అతడి చావులో మా ప్రమేయం లేదు



'రాయుడి చావులో మా ప్రమేయం లేదు. మేమే హత్య చేశామంటూ ప్రచారం చేయడం.. జైలుకు వెళ్లడంకన్నా బాధ కలిగించింది. మాపై రాజకీయ కుట్ర జరిగింది. అన్ని ఆధారాలతో బాధ్యులైన వారి పాత్రలను బహిర్గతం చేస్తాం. విదేశాల్లో రూ.లక్షల జీతాలు వచ్చే ఉద్యోగాలను వదులుకుని ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చాం. అంతేకానీ హత్యలు చేయడానికి కాదు. చావులో మా ప్రమేయం లేదు కాబట్టే నాకు 19 రోజులకు, మిగిలిన నలుగురికి నెల రోజుల వ్యవధిలోనే బెయిల్ మంజూరైంది. కేసు విచారణలో ఉండటంతో న్యాయనిపుణుల సలహామేరకు మేము అంతకుమించి వివరాలను వెల్లడించ లేం. న్యాయస్థానం ద్వారా నిర్దోషిగా బయటపడతాం' అంటూ కోట వినుత సెల్ఫీ వీడియో విడుదల చేశారు.

ఏ విచారణకైనా సిద్ధం



'చనిపోయిన రాయుడు నాపై ఆరోపణలుచేస్తూ వైరల్ అవుతున్న వీడియోపై అధికారులు లోతుగా విచారణ జరపాలి. అది ఏఐ టెక్నాలజీ, మార్ఫింగ్ తరహాలో ఉంది. ఎక్కడి నుంచి ఈ వీడియో విడుదలైంది అనే దానిపై అధికారులు త్వరలోనే నిగ్గు తేలుస్తారు. మార్ఫింగ్ వీడియో అయినా ఉండాలి.. లేకపోతే శ్రీకాళహస్తిలో అభివృద్ధి పనులతో ప్రజల్లో నాకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక బురదజల్లేందుకు కుట్ర అయినా చేసుండాలి. ఉద్దేశపూర్వకంగా నాకు సంబంధంలేని విషయంలో దుష్ప్రచారం చేస్తున్నారు. చంపే ముందు రాయుడిని బలవంతంగా రాజకీయ లబ్ధి కోసం అసత్య ఆరోపణలు చేయించి ఉండాలి. 2019 ఎన్నికల్లో 5వేల ఓట్లు కూడా పొందలేక వినుత డిపాజిట్ కోల్పోయింది. అలాంటి వారితో రాజకీయంగా నాకు పోటీ ఏముంటుంది? హత్య జరిగిన మూడు నెలల తర్వాత ఇపుడు ఎందుకు వీడియోను బయటపెట్టాల్సి వచ్చింది. కావాలనే నాపై అసత్య ప్రచారాలు చేస్తున్నారు' అంటూ ఢిల్లీలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు.

మత్స్యకారుల బీమా చెల్లింపులకు నిధుల విడుదల

అమరావతి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీం కింద రూ.5.30 కోట్ల విలువైన క్లైములను ఉపయోగించుకోవటానికి ప్రభుత్వం మత్స్యశాఖకు అనుమతి ఇచ్చింది. 19 జిల్లాల్లోని 106 మంది మత్స్యకారుల డెత్ క్లైములను పరిష్కరించడానికి ఈ నిధులు విడుదల చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032. **నిర్వాహక కార్యాలయం:** 6వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,ఔరం క్యూ పార్క్, జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710.

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీ పై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలం పాటను మేము దిగువ తెలిపిన తేదిన వేలం చేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యలు ద్వారా వసూలు చేయడం జరుగుతంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించుటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదిని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

వేలం వేయు తేది: 23.10.2025 & 25.10.2025 వేలం వేయు చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,డోర్ నం.8-119, 2వ అంతస్తు, ఆర్‌సి రోడ్, తిరుపతి,తిరుపతి జిల్లా-517501

లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు	లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు
NKOTAPJ2504300001	DUTTA KRISHNA		
NDPETPJ2504240001	ANNAMANENI VINUTHY		

పైన ఉదహరించిన చిరునామాల వద్ద వేలం వేయడం జరుగుతుంది. **వేలం సమయం:11.00 AM** మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవడటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ P.BABU ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కానీ యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును.కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిసాయి.

తేది: 13.010.2025 సం/- అధీకృత అధికారి
స్థలం :నెల్లూరు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032. **నిర్వాహక కార్యాలయం:** 6వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,ఔరం క్యూ పార్క్, జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710.

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీ పై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలం పాటను మేము దిగువ తెలిపిన తేదిన వేలం చేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యలు ద్వారా వసూలు చేయడం జరుగుతంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించుటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదిని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

వేలం వేయు తేది: 23.10.2025 వేలం వేయు చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,డోర్ నం.8-119, 2వ అంతస్తు, ఆర్‌సి రోడ్, తిరుపతి,తిరుపతి జిల్లా-517501

లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు	లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు
RNGTAPJ2504170002	P SURENDRA		
RNGTAPJ2504120001	MALLARAPU MAHENDRA		

పైన ఉదహరించిన చిరునామాల వద్ద వేలం వేయడం జరుగుతుంది. **వేలం సమయం:11.00 AM** మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవడటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ B.DATTA PRAVEEN ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కానీ యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును.కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిసాయి.

తేది: 13.10.2025 సం/- అధీకృత అధికారి
స్థలం :తిరుపతి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

వేలం వేయు తేది: 23.10.2025 & 25.10.2025 వేలం వేయు చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,డోర్ నం.8-119, 2వ అంతస్తు, ఆర్‌సి రోడ్, తిరుపతి,తిరుపతి జిల్లా-517501

లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు	లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు
NKOTAPJ2504300001	DUTTA KRISHNA	NDPETPJ2504240001	ANNAMANENI VINUTHY

పైన ఉదహరించిన చిరునామాల వద్ద వేలం వేయడం జరుగుతుంది. **వేలం సమయం:11.00 AM** మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవడటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ P.BABU ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కానీ యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును.కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిసాయి.

తేది: 13.10.2025 సం/- అధీకృత అధికారి
స్థలం :తిరుపతి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India

ఖాదీ కాలనీ శాఖ (25711),డి.నెం.18-1-710, కెన్స్ గ్రాండ్ రెసిడెన్సీ, రామచంద్ర నగర్, తిరుపతి, సెల్: 8356825711

స్థిరాస్తుల అమ్మకానికి అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్,2002, లోని రూల్ 8(6) నిబంధనతో చదువబడే విధంగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింది స్థిరాస్తుల అమ్మకానికి -వేలం ప్రకటన

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు తనఖాపెట్టిన / ఛార్జ్ చేయబడిన దిగువ వివరించిన స్థిరాస్తి అధీకృత అధికారిచే నిర్మాణాత్మకం/ భౌతికంగా స్వాధీనం చేసుకోబడిందని అది **దిగువ తెలిపిన రుణగ్రహీత / గ్యారంటార్లను** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు బకాయి వున్న మొత్తమును రాబట్టుకొనుటకు **"ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలాగే" ఉన్నది ఉన్నట్టుగా మరియు అక్కడ ఏమున్నదో** అదే పద్ధతిపై విక్రయించబడుతుందని సాధారణ ప్రజలకు ముఖ్యంగా రుణగ్రహీత మరియు గ్యారంటార్లకు ఇందుమూలముగా నోటీసు ద్వారా తెలియజేయడమైనది. **రిజర్వు ధర మరియు ధరావత్తు వివరములు కింద తెలుపబడినది.**

రుణగ్రహీత మరియు గ్యారంటార్ల చిరునామా :1)రుణగ్రహీత:శ్రీమతి జల్లిపల్లి వెంకట సామ్రాజ్యం తండ్రి జె.వెంకటేశ్వర్లు, ఫ్లాట్ నెం.402, సిపిఆర్ విండ్‌సార్ అపార్ట్‌మెంట్స్, వార్డునెం.22, బ్లాక్ నెం.6, అక్కారంపల్లి గ్రామం, తిరుపతి-517507, **2)గ్యారంటారు: శ్రీయు.జగదీష్ రాజ్** తండ్రి యు.రామచంద్ర, 13-6-600/44/159/బి4, పెద్దకాపు వీధి, హనుమాన్ గుడి, తిరుపతి, తిరుపతి జిల్లా - 517501

బకాయి మొత్తం: - తేది:30.09.2025 నాటికి రూ.22,51,191.06 పై మరియు తదుపరి వడ్డీ, వ్యయాలు & ఖర్చులు

స్థిరాస్తి వివరణ:తిరుపతి జిల్లా, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ తిరుపతి అర్బన్ మండలం,నెం.9 అక్కారంపల్లి గ్రామలెక్కదాఖలా తిరుపతి -కరకంబాడి మెయిన్‌రోడ్డు, బ్లాక్ నెం.6, వార్డునెం.22, సర్వేనెం.117/2బి/1ఎ(పాత సర్వేనెం.117/2)లో ఉన్న "సిపిఆర్ విండ్‌సార్ అపార్ట్‌మెంట్స్" 4వ అంతస్తు, ఫ్లాట్‌నెం.402 (డి.నెం.22-6-78/బి/సిపిఆర్‌డబ్ల్యూఎ/402) యొక్క ప్లింత్ ఏరియా 1670 చ.అ.(కామన్ ఏరియాతో సహా) గల రెసిడెన్షియల్ ఫ్లాట్ శ్రీమతి జె.వి. సామ్రాజ్యం పేరున వున్నది. **అపార్ట్‌మెంట్ హద్దులు:** తూర్పు: ఆదం చెంచురెడ్డికి చెందిన భూమి, పడమర: వి.జి. జయచంద్రనాయుడుకు చెందిన భూమి, ఉత్తరం: తిరుపతి - కరకంబాడి మెయిన్‌రోడ్డు, దక్షిణం: ఆదం చెంచురెడ్డికి చెందిన భూమి, **ఫ్లాట్‌కు హద్దులు:**-తూర్పు: కామన్ కారిడార్, పడమర : ఓపన్ టు స్కై, ఉత్తరం: ఓపన్ టు స్కై, దక్షిణం: ఓపన్ టు స్కై

రిజర్వు ధర రూ.82,32,000.00 **ధరావత్తు:రిజర్వుధరలో 10%** **బిడ్‌ఇంక్రిమెంట్: రూ.82,320.00**

ఈ-వేలం తేది మరియు సమయం: 30.10.2025 మ.12.00గం॥ల నుండి సా.5.00 గం॥ల వరకు
(10 నిముషాల అపరిమిత పొడిగింపుతో) విక్రయమునకు చెందిన పూర్తి నియమనిబంధనల రిజిస్ట్రేషన్, లాగిన్ మరియు బిడ్డింగ్ నియమాల కొరకు https://baanknet.com and https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx ను చూడగలరు.

ప్రదేశం: తిరుపతి, తేది : 08.10.2025 **సం॥ అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

శ్రీవారి సేవలో సినీ ప్రముఖులు

తిరుమల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు సినీ ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. హీరోయిన్ కృతిశెట్టి, దర్శకుడు వెంకీ కుడుముల, జూనియర్ ఎన్టీఆర్ సతీమణి లక్ష్మీప్రణతి, ఆమె సోదరుడు, హీరో నార్నె నితిన్ దంపతులు, బాలీవుడ్ సినీనిర్మాత ఏక్తాకపూర్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.



లక్ష్మీప్రణతి, నార్నె నితిన్ దంపతులు - ఏక్తా కపూర్ - వెంకీ కుడుముల

కొత్త టీచర్లొచ్చారు

నూతన ఉపాధ్యాయుల రాకతో జిల్లాలోని పాఠశాలలు సోమవారం కళకళలాడాయి. మెగా డీఎస్సీ ద్వారా ఉమ్మడి జిల్లాలో ఎంపికైన వారిలో 1,394 మంది ఉపాధ్యాయులు పోస్టింగ్ పొందారు. వీరంతా కౌన్సెలింగ్ ద్వారా తమకు కేటాయించిన పాఠశాలల్లో సోమవారం విధులకు హాజరయ్యారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కలిసి అపాయింట్‌మెంట్ లెటర్స్ అందజేసి జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చారు. మొదటిరోజు కావడంతో సీనియర్లు నూతన ఉపాధ్యాయులను పరిచయం చేసుకుని విధుల గురించి సూచనలు చేశారు.



తిరుపతిలోని ఎంజీఎం పాఠశాలలో చేరేందుకు..

పాఠశాల నిర్వహణకు సంబంధించిన అంశాలను విశదీకరించారు.

- తిరుపతి (విద్య), ఆంధ్రజ్యోతి

సర్వ దర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10గంటల సమయం పడుతోంది.
సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.06 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 84,424

తలనీలాలు సమర్పించినవారు: 36,711



మా మొర ఆలకించండి మహాప్రభో..!

పీజీఆర్ఎస్‌లో అర్జీదారుల వేడుకోలు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): 'మా మొర ఆలకించి సమస్యలు పరిష్కరించండి మహాప్రభో' అంటూ అర్జీదారులు అధికారులను వేడుకున్నారు. కలెక్టరేట్ వేదికగా సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు 290 వినతులు అందగా, అందులో రెవెన్యూ శాఖకు 162 వచ్చాయి. కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రజల సమస్యలను సావధానంగా విన్నారు. వినతులను నిర్దిష్ట సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీలు దేవేంద్రరెడ్డి, రోజ్మాండ్ సుధారాణి పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో నరసింహులు

మా భూమిని కబ్జా చేశారు..



నేను గూడూరులో చెప్పులు కుట్టుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. తడ మండలం తడ కండ్రిగ గ్రామంలో ప్రభుత్వం 31 సెంట్ల మెట్టభూమి ఇచ్చింది. దీన్ని కొందరు ఆక్రమించారు. అడిగితే దౌర్జన్యం చేస్తున్నారు. సర్వేకు పలు దఫాలు చలానా కట్టినా హద్దులు కూడా చూపించడంలేదు. కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోయాను. మీరైనా న్యాయం చేయండి.

- చంద్రయ్య, తడకండ్రిగ, తడ మండలం



మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి

మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. ఏఐటీయూసీ జిలా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ మాట్లాడుతూ 138జీవో ప్రకారం పారిశుధ్య, సెక్యూరిటీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ పోను రూ.16వేలు, సూపర్‌వైజర్లకు రూ.18,600 వేతనం ఇవ్వాల్సి ఉండగా అరకొరగా ఇస్తూ దోపిడీ చేస్తున్నారన్నారు. వారికి డీఎంహెచ్‌వో సంతకంతో కూడిన గుర్తింపుకార్డులు ఇవ్వాలని కోరారు. ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ రవి, మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఉదయ్‌కుమార్, మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నేతలు నరసింహులు, కిషోర్, వరలక్ష్మి, పద్మ, నాగభూషణం, సుశీల, సులోచన, వనజ, సునీల్, పార్వతి పాల్గొన్నారు.

మా పొలాన్ని ఆక్రమించారు.. న్యాయం చేయండి



తొట్టంబేడు మండలం శ్రీకృష్ణాపురం గ్రామ పరిధిలో 40ఏళ్లుగా ఐదు ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నాం. డీకేటీ పట్టా కూడా ఉంది. రెవెన్యూ అధికారులు మా పాసుపుస్తకాన్ని మరొకరికి ఇచ్చారు. దీనిపై పలుమార్లు అడిగినా సమాధానం చెప్పలేదు. అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మా భూమిలోకి ప్రవేశించి హద్దులు చెరిపేశారు. మేము పొలం వద్దకు వెళితే చంపేస్తామని బెదిరిస్తున్నారు. కోర్టుకు కూడా వెళ్లాం. కలెక్టర్‌కూ ఫిర్యాదు చేశాం. లాభం లేకపోయింది. స్థానిక రెవెన్యూ అధికారులు కబ్జాదారులకు సహకరిస్తున్నారు. కబ్జాదారులు, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయండి. లేకపోతే చావు ఒక్కటే మాకు మార్గం.

- వీరాస్వామి, అమరావతి దంపతులు, శ్రీకృష్ణాపురం, తొట్టంబేడు మండలం

పెండింగ్ వ్యవసాయ భూములకు ప్రొసీడింగ్స్ మంజూరు చేయండి

శెట్టిపల్లెలో పెండింగ్‌లో ఉన్న 30 ఎకరాల వ్యవసాయ భూములకు ప్రొసీడింగ్స్ మంజూరు చేయాలని ఆ గ్రామ రైతులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 2018లో అప్పటి కలెక్టర్ చెప్పిన విధంగా శెట్టిపల్లె గ్రామం ఉత్తరం వైపు, చెరువుకు తూర్పు వైపున సప్లై చానల్‌కు దక్షిణం వైపున ప్లాట్స్ అలాట్‌మెంట్ చేసి రైతులకు ఇవ్వాలన్నారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా అలాట్‌మెంట్ చేసే ప్లాట్లను మినిమం సైజు ద్వారా ఇవ్వాలన్నారు. శెట్టిపల్లె గ్రామంలో తుడా మాస్టర్‌ప్లాన్ రోడ్డును కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు బత్తినిబాబు, జయరామయ్య, చెంగయ్య పాల్గొన్నారు.



సీజేపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నేతలు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు దేవదాసు, వాసుదేవరావు, మధు, గోపి, అరుణ, రవి డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు.



దివ్యాంగుల పింఛను ఇప్పించండి

మేము ముగ్గురం ఆడపిల్లలం. తండ్రి మరణించాడు. 90శాతం వికలాంగత్వం ఉంది. ఏ పనీ చేయలేను. దివ్యాంగుల పింఛన్ ఇప్పించి ఆదుకోండి.

- సత్యవతి, ఎల్లమండ్యం, రేణిగుంట మండలం

ఒక్క నిర్ణయం.. ఎందరికో జీవితం

● నూతన ఉపాధ్యాయుల్లో వెల్లివిరిసిన ఆనందం

తిరుపతి(విద్య), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బీఈడీ చేశారు. డీఎస్సీ కోసం ఆరేళ్లకుపైగా ఎదురు చూశారు. కూటమి అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ నిర్వహించాలన్న నిర్ణయం.. ఉమ్మడి జిల్లాలోని 1403 మంది జీవితాల్లో వెలుగు నింపింది. వీరిలో 1394 మంది పోస్టింగ్ ఆర్డర్లు పొందారు. సోమవారం బడుల్లో చేరారు. ఈ సందర్భంగా తమ ఆనందాన్ని వ్యక్తంచేశారు.

నా తల్లిదండ్రుల కాయకష్టానికి ఫలితం



మాది పేద దళిత కుటుంబం. ముగ్గురు ఆడపిల్లలో రెండో అమ్మాయిని. నా తల్లిదండ్రులు పద్దమ్మ, గున్నయ్య కూలి పనులుచేస్తూ చదివించారు. పేదరికం నుంచి బయటపడేందుకు ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నా. మెగా అవకాశాన్ని వదులుకోకూడదని కష్టపడ్డా. డీఎస్సీలో 76.57 మార్కులు సాధించి సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యా. చిత్తూరు జిల్లా వి.కోట మండలం కుదువగడ్డ ప్రాథమిక పాఠశాలలో చేరా. ప్రభుత్వం కల్పించిన అవకాశం.. మా తల్లిదండ్రుల కాయకష్టానికి ఫలితం ఈ ఉద్యోగం.

- టి.భవాని, కమ్మకొత్తూరు, శ్రీకాళహస్తి మండలం

తల్లిదండ్రులకే అంకితం



మా తల్లిదండ్రులు జానకమ్మ, రాధాకృష్ణ వ్యవసాయంతో జీవనం సాగించేవారు. నన్ను ఎంతో ప్రోత్సహించారు. మెగా డీఎస్సీలో అర్హత పొందిన నేను ఎస్జీటీలో జిల్లాలో 24వ ర్యాంకు, ఎస్‌ఏ సోషల్ 67వ ర్యాంకు, టీజీటీ సోషల్ 77వ ర్యాంకు, టీజీటీ తెలుగులో 31వ ర్యాంకు సాధించా. నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా చేరా. ఎన్ని ఇబ్బందులున్నా నాకు ప్రోత్సాహం అందించిన తల్లిదండ్రులకు ఈ ఉద్యోగాన్ని అంకితం చేస్తున్నా.

- నల్లపాటి శివకుమార్, గోవిందప్పనాయుడు కండ్రిగ, బీఎన్‌కండ్రిగ మండలం

అత్యంత ఆనందం



మాది పేద దళిత కుటుంబం. బీకామ్, బీఈడీ చేశా. నా తల్లిదండ్రులు బొగ్గల ఆదెయ్య, వేమక్కకు పొలం పనుల్లో చేదోడు వాదోడుగా ఉన్నా. మెగా డీఎస్సీ ప్రకటనతో కోచింగ్ లేకుండానే కష్టపడి సన్నద్ధమయ్యా. రాయలసీమ జోన్ పరిధిలో 67.1028 మార్కులతో టీజీటీ సోషల్ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యా. రేణిగుంట మండలంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో విధుల్లో చేరా. అన్ని వృత్తుల్లోకి పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తి లభించడం నా ఆనందం.

- ప్రతాప్, ఎన్టీఆర్ నగర్, బుచ్చినాయుడు కండ్రిగ మండలం

మెగా డీఎస్సీ జీవితాన్నిచ్చింది



మాది నిరుపేద దళిత కుటుంబం. మెగా డీఎస్సీలో 75.46 మార్కులతో సాధించి సెకండరీగ్రేడ్ టీచర్‌గా ఎంపికయ్యా. శాంతిపురం మండలం గుండుశెట్టిపల్లె ప్రాథమిక పాఠశాలలో విధుల్లో చేరా. చిన్న వయసులోనే తండ్రి వీరయ్యను కోల్పోయా. కష్టపడి నన్ను చదివించిన తల్లి మెరుంవాణి కూడా ఏడాది కిందట చనిపోయింది. మెగా డీఎస్సీ నాకు జీవితాన్నిచ్చింది.

- లావణ్య, చిన్నసింగమాల, తొట్టంబేడు మండలం

రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు



మా నాన్న ఫిజికల్ డైరెక్టర్ మస్తానయ్య. తల్లి కళావతి. గత డీఎస్సీలో ఉద్యోగం సాధించలేకపోయాను. మెగా డీఎస్సీ ప్రకటించగానే ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివా. మెగా డీఎస్సీలో 83.03 మార్కులు సాధించి సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఉద్యోగం సాధించా. బుచ్చినాయుడు కండ్రిగ మండలం తలారివెట్టు ప్రాథమిక పాఠశాలలో విధుల్లో చేరా. మా నాన్నను ప్రేరణగా తీసుకుని ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించి నా ఆనందానికి కారణమైన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

- పవన్‌కుమార్, కాంపాళెం, బీఎన్ కండ్రిగ మండలం

అంతరిక్ష ప్రయోగాలతో మానవాళి శ్రేయస్సు

● షార్ డైరెక్టర్ పద్మకుమార్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న షార్ డైరెక్టర్ పద్మకుమార్

సూళ్లూరుపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష ప్రయోగాలు మానవాళి శ్రేయస్సుకు ఎంతగానో ఉపయోగపడతాయని షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ అన్నారు. సోమవారం సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాలులో జరిగిన ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 63 ఏళ్లలో ఇస్రో గణనీయమైన ప్రగతి సాధించిందన్నారు. ఇతరదేశాలకు సైతం ఉపగ్రహ సాంకేతికతను అందించే స్థాయికి ఎదిగిందన్నారు. వాతావరణం, ఆహార భద్రత, దేశరక్షణ, మత్స్య సంపద ఉనికి, అడవుల పరిరక్షణ, టెలీ ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ విభాగాల్లో ఇస్రో ప్రయోగించిన ఉపగ్రహాలు సమర్థంగా పనిచేస్తున్నాయన్నారు. విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఇస్రోఆధ్వర్యంలో 'యువికా'లాంటి కార్యక్రమాలతో పాటు ఇంటర్న్‌షిప్ ప్రాజెక్టుల ద్వారా ప్రోత్సహిస్తున్నామన్నారు. అంతరిక్ష వారోత్సవాల్లో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోస్పేస్ మెడిసిన్ ప్రిన్సిపాల్, కమాండెంట్ రాజేష్ కుమార్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో షార్ అసోసియేట్ డైరెక్టర్ ముత్తు చెలియన్, కంట్రోలర్ జి.రమేష్ బాబు, ఎంఎస్‌ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపికృష్ణ, వాల్ఫ్ డీడీ శంకరన్, రమణారెడ్డి, షార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న టిప్పర్

● మాజీ సర్పంచ్ సురేంద్రనాయుడి మృతి



రామచంద్రాపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలం రామాపురం సమీపంలో సోమవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మాజీ సర్పంచి సురేంద్ర నాయుడు(60) అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. రామచంద్రాపురం మండలం కొత్తకండ్రిగకు చెందిన లెక్కల సురేంద్ర నాయుడు తన పొలంలో కూరగాయలను తిరుపతి మార్కెట్‌కు తరలించి విక్రయిస్తుంటారు. సోమవారం ఉదయం 5గంటలకు తిరుపతిలో విక్రయించి ఇంటికి బయలుదేరారు. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో రామాపురం సమీపంలోని విల్లాస్ వద్ద వస్తుండగా వెనుక నుంచి టిప్పర్ ఢీ కొనడంతో అక్కడికక్కడే ఆయన మృతిచెందారు. ఎస్‌ఐ భక్తవత్సలం, సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరంతర సాధనతో లక్ష్యాల ఛేదన

● 'కళాచిత్ర' పురస్కారాల ప్రదానోత్సవంలో కలెక్టర్



విద్యార్థులకు కళాచిత్ర పురస్కారం అందజేస్తున్న శ్రీసిటీ ఎండీ రవి సన్నారెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్

సూళ్లూరుపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిరంతరం సాధన చేస్తే అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం 'కళాచిత్ర' పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. గతేడాది పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన రామిశెట్టి మౌనిక, జి.కీర్తి, వేలూరు చేతనకు కలెక్టర్‌తో పాటు శ్రీసిటీ ఎండీ సన్నారెడ్డి రవీంద్రరెడ్డి కలిసి కళాచిత్ర ట్రస్టు అందించే పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చదువుతో పేదరికాన్ని జయించడంతో పాటు ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. శ్రీసిటీ ఎండీ సన్నారెడ్డి రవీంద్రరెడ్డి మాట్లాడుతూ కళాచిత్ర కుటుంబ సభ్యులు తాము చదివిన పాఠశాలలో విద్యార్థులకు పురస్కారాలు అందజేయడం అభినందనీయమన్నారు. వచ్చే ఏడాది నుంచి కళాచిత్రతో పాటు శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలోనూ విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తామన్నారు.

మూడో కన్ను పుస్తకావిష్కరణ: రచయిత, ఆంధ్రజ్యోతి పూర్వ విలేకరి ఆర్ఎంవీ భాస్కర్‌బాబు రచించిన మూడో కన్ను పుస్తకాన్ని కలెక్టర్, శ్రీసిటీ ఎండీ ఆవిష్కరించారు. ఆరుపదుల వయస్సులో ఇలాంటి మంచి పుస్తకాన్ని రచించారంటూ రచయితను అభినందించారు. ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డి, ఎంఈవో సునీల తదితరులు పాల్గొన్నారు.



గిరీష్మసైనిరెడ్డి | విష్ణుప్రియ | పర్ణితయాదవ్ | కె.శుభశ్రీ | రుక్సార్‌తబ్సుమ్

ఆంధ్రా ఉమెన్ టి20 క్రికెట్ జట్టుకు జిల్లా నుంచి ఐదుగురు

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా అండర్ 19 ఉమెన్స్ టీ20క్రికెట్ జట్టులో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఐదుగురు మహిళా క్రీడాకారులకు స్థానం లభించింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవలె నిర్వహించిన ఎంపిక పోటీలలో తిరుపతికి చెందిన ఎం.గిరీష్మసైనిరెడ్డి(వైస్‌కెప్టెన్), కె.శుభశ్రీ, ఎ.విష్ణుప్రియ, ఎం.పర్ణితయాదవ్, వాయల్పాడుకు చెందిన ఎం.రుక్సార్‌తబ్సుమ్ సత్తాచాటారు. దీంతో వీరి ఎంపికపై సెలెక్టర్లు మొగ్గుచూపారు. ఈ ఐదుగురిలో ఒకరికి వైస్‌కెప్టెన్ బాధ్యతలు అప్పగించడం విశేషం. ఈ నెల 20నుంచి 23వరకు తెలంగాణలోని ఔరంగాబాదు జరగనున్న అండర్ 19ఉమెన్స్ టీ20చాంపియన్‌షిప్‌లో ప్రాతినిధ్యం వహించనున్నారు. వీరిని ఏసీఏ జాయింట్ సెక్రటరీ విజయ్‌కుమార్ తదితరులు అభినందించారు.

పళ్లికొండేశ్వర ఆలయంలో దేవదాయ శాఖ జిల్లా అధికారి విచారణ

నాగలాపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లి పళ్లికొండేశ్వరాలయంలో దేవదాయ శాఖ జిల్లా అధికారి సోమవారం మధ్యాహ్నం నూతన పాలక మండలికి సంబంధించి విచారణ చేపట్టారు. గత శుక్రవారం నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం జరిగిన విషయం తెలిసిందే. ఈ పాలక మండలి ఏర్పాటైన రెండు రోజుల్లోనే ఇద్దరు ప్రధాన సభ్యుల నేర చరిత్రపై, ఆలయ ఈవో లతపై దేవదాయశాఖ అధికారులకు ఫిర్యాదు అందినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లా దేవదాయ శాఖ అధికారి రామకృష్ణారెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఫణీరాజ శయన సోమవారం పళ్లికొండేశ్వర ఆలయ కార్యాలంలో పాలకమండలి సభ్యుల నేర చరిత్రపై ఆలయ ఈవోతో చర్చించినట్లు తెలిసింది. అలాగే వీరి నేర చరిత్రకి సంబంధించిన సమగ్ర వివరాలను దేవాదాయశాఖ అధికారులకు ఎందుకు సమర్పించలేదని ఈవోను ప్రశ్నించినట్లు తెలిసింది. వీరి నేర చరిత్రలకు సంబంధించిన జిరాక్స్ కాపీలను తమతో తీసుకెళ్లినట్లు సమాచారం.

నకిలీ మద్యంపై అసత్య ప్రచారం

పోలీసుల అదుపులో ఇద్దరు వైసీపీ నాయకులు



నవీన్

తిరుపతి(నేర విభాగం), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం పేరిట ప్రభుత్వంపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారంచేసి, ప్రజలను తప్పుదారి పట్టించారంటూ ఇద్దరు వైసీపీ నేతలను తిరుపతి ఈస్ట్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వీరిలో తిరుపతి వైసీపీ ఉత్తర విభాగం అధ్యక్షుడు, భూమన అభినయ్ అనుచరుడు నవీన్, అతడి అనుచరుడు వెంకటేష్‌ను అలిపిరి స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, అభినయ్, వైసీపీ శ్రేణులు అలిపిరి స్టేషన్‌కు వచ్చారు. ఏ కారణంతో.. ఏ కేసు కింద వారిని అదుపులోకి తీసుకున్నారని పోలీసులను భూమన ప్రశ్నించారు. దీంతో కాసేపు అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది. డీఎస్పీ జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కాగా, మంగళవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించడానికి పోలీసులు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

పంట కాలువల ఆక్రమణ

సాగునీరు అందక రైతుల ఇబ్బందులు

కోట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కోట మండలంలోని ప్రధాన చెరువుల పంటకాలువలు ఆక్రమణకు గురయ్యాయి. మండలంలో 33 ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. ఇందులో సుమారు 8,500 ఎకరాల ఆయకట్టు కలిగిన పెన్నక్కచెరువు పంట కాలువలు నెల్లూరుపల్లి కొత్తపాళెం, చెందోడు, వలిపేడు తదితర గ్రామాల వద్ద ఆక్రమణకు గురయ్యాయి. అదేవిధంగా తిమ్మానాయుడుపాళెం, కొక్కుపాడు, కర్లపూడి, చిట్టేడు, రామాపురం, కొండుగుంట, మద్దాలి, ఊనుగుంటపాళెం చెరువుల ఆయకట్టు కింద ఉన్న పంట కాలువలు ఆక్రమణకు గురయ్యాయి. దీంతో వేలాది ఎకరాలకు సాగునీరు సరఫరా కాక పంటలు ఎండిపోయే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పంటకాలువ ఆక్రమణలకు అడ్డుకట్ట వేయకపోతే వందలాది ఎకరాలకు సాగునీరు అందక పంటలు ఎండి పోయే పరిస్థితి నెలకొంటుందని రైతులు చెబుతున్నారు.



కొత్తపాళెం వద్ద ఆక్రమణలతో కుచించుకుపోయిన పెన్నక్కచెరువు కాలువ

జూనియర్ కళాశాల అభివృద్ధికి కృషి



సైన్సుల్యాబ్‌కు పరికరాలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

సూళ్లూరుపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని పూర్వ విద్యార్థుల సంఘం పేర్కొంది. సోమవారం జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు, అదనపు గదుల నిర్మాణానికి, ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మల్టీపర్పస్ హాలు నిర్మాణానికి కృషి చేస్తామని చెప్పారు. సైన్సు ల్యాబ్‌కు పరికరాలు వితరణ జూనియర్ కళాశాలకు కోగిలి జయరామిరెడ్డి సేవాసంస్థ అధ్యక్షుడు సురేష్ రెడ్డి సహకారంలో రూ.75 వేల విలువ చేసే సైన్సు ల్యాబ్ పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘ గౌరవ అధ్యక్షుడు శ్రీసిటీ ఎండీ సన్నారెడ్డి రవీంద్రరెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు అద్దూరు శ్రీనివాసులు, ఎల్‌.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, ట్రెజరర్ ధనుంజయ రెడ్డి, సహాయ కార్యదర్శి షేక్ ఉస్మాన్ భాషా, సభ్యులు ఆర్ఎం ఉమామహేశ్వరావు, సాయిరాం, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



కాలనీలో పర్యటిస్తున్న టీడీపీ నేత శ్రీనివాసులురెడ్డి

గూడూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలో గల రామలింగయ్యకాలనీ, జగనన్న లేఅవుట్‌లోని సమస్యలను ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చర్యలు చేపడుతానని టీడీపీ నాయకుడు ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి అన్నారు. సోమవారం చెన్నూరులోని రామలింగయ్య కాలనీ, జగనన్న లేఅవుట్‌లను స్థానికులతో కలిసి పరిశీలించారు. కాలనీలో డ్రైనేజీ కాలువలు, వీధి దీపాలు, రోడ్డు సౌకర్యం లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. కాలనీలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో శ్రీకిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, శివకుమార్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సొంత నిధులతో రోడ్డు అభివృద్ధి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్ నాయీ బ్రాహ్మణ కాలనీలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సొంత నిధులతో రోడ్డు అభివృద్ధి పనులను చేపట్టారు. స్థానిక నాయీబ్రాహ్మణకాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా రోడ్డు సౌకర్యం లేక అధ్వానంగా మారడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. రోడ్లపై మురుగునీరు నిల్వచేరడంతో బురద మయంగా మారి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న స్థానికులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన సహకారంతో సోమవారం గ్రావెల్ రోడ్డు నిర్మించారు. ఈ పనులను టీడీపీ నాయకులు పెంచలయ్య, సురేంద్ర, రమేష్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, వెంకట కృష్ణయ్య పర్యవేక్షించారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న పండితులు

చిట్టమూరు, అక్టోబర్ 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్లాం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం పవిత్రోత్సవాలు జరిగాయి. ఉదయం గణపతి, లక్ష్మి, అస్త్ర, నవగ్రహ హోమాలు నిర్వహించారు. గోపూజ, మంత్రపుష్పం, మంగళ హారతి, విభూది కుంకుమ ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం మంగళవాయిద్యం, గణపతి పూజ, పవిత్ర ప్రతిష్ఠ పూజ, గంధ పవిత్ర సమర్పణ, మంగళహారతి పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకుడు భానుప్రకాష్ శర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కామిరెడ్డి మునిశేఖర్ రెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం తయారీదారులపై చర్యలు తీసుకోండి



ఎక్సైజ్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకులు

నాయుడుపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీదారులపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య డిమాండ్ చేశారు. సోమవారం నాయుడుపేట ఎక్సైజ్ కార్యాలయం ఎదుట వైసీపీ నాయకులతో కలసి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి, అనిల్‌రెడ్డి, కిషోర్ యాదవ్, హరనాథ్‌రెడ్డి, సిద్ధయ్య, రత్నశ్రీ, అశోక్ పాల్గొన్నారు.

కల్తీ మద్యాన్ని అరికట్టండి

వెంకటగిరి టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కల్తీ మద్యం అమ్మకాలను అరికట్టాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కోడూరు కల్పత అన్నారు. సోమవారం స్థానిక ఎన్‌జేఆర్ భవన్ నుంచి వెంకటగిరి ఎక్సైజ్ కార్యాలయం వైసీపీ మహిళలు ఎక్సైజ్ స్టేషన్ వద్దకు ర్యాలీ నిర్వహించారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

పెళ్లకూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుతో పాడిఆవు మృతిచెందింది. పెళ్లకూరు దళితవాడకు చెందిన గంధం గుప్త కుమార్ పశువులను మేత కోసం పొలాల్లో తీసుకెళ్లాడు. సాయంత్రం ఉరుములు, మెరుపుల వర్షంతో పాటు ఆవుపై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది.

లోకల్ రైళ్ల రద్దు

నాయుడుపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తడ - సూళ్లూరుపేట మధ్య ఇంజనీరింగ్ పనుల కారణంగా లోకల్ రైళ్లు(66035, 66036) 14వ తేదీ మంగళవారం రద్దు చేసినట్లు నాయుడుపేట రైల్వేస్టేషన్ మాస్టర్ చిరంజీవి తెలిపారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కోట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): చిట్టేడు బాలికల ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ నెల 16వ తేదీ లోగా వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, కళాశాలలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వివరాలకు 9441859490, 9492751613 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి: కురుగొండ్ల



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, అక్టోబర్ 13(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధికారులకు సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజావిజ్ఞప్తుల దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్న సంకల్పంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజావిజ్ఞప్తుల దినం నిర్వహిస్తోందన్నారు. గత వైసీపీ పాలనలో అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకువెళ్లేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిషలు కృషి చేస్తున్నారని అన్నారు. అలాగే ప్రజా సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీలో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ద్వారా తాగునీటిని అందించే పైప్‌లైన్ ఆధునికీరణ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో అసంపూర్తిగా నిలిచిపోయిన అర్బన్ హెల్త్ సెంటర్ భవనాలను పూర్తి చేస్తామని చెప్పారు. అనంతరం ప్రజల నుంచి వినతులను స్వీకరించి, వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్, ఏఎంసీ చైర్మన్ ఘనుగోటి విశ్వనాధ నాయుడు, తహసీల్దారు నరసింహులు, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి, నాయకులు కేవీకే ప్రసాద్ నాయుడు, అవ్వారు సత్యనారాయణ, మంకు ఆనంద్, మల్లారం బాబు, చెంగారావు, మేరిగ రామకృష్ణ, జానపాటి బాలకృష్ణ, రామారావు, అనిల్, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో వర్షం

సూళ్లూరుపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో సోమవారం ఉదయం నుంచి జల్లులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం ఎండ, తీవ్ర ఉక్కపోత ఉన్నా ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుని వర్షం కురడంతో రోడ్లన్నీ జలమయంగా మారాయి.

యూరియా కొరత లేకుండా చర్యలు

వాకాడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 12 రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని మండల వ్యవసాయశాఖ అధికారిణి దీప తెలిపారు. వాకాడు రైతు సేవా కేంద్రాల వద్ద సోమవారం రైతులకు కార్డులను పంపిణీ చేశారు. ప్రతి రైతు వ్యవసాయశాఖ అందించే కార్డు ద్వారా మాత్రమే యూరియా పొందాల్సి ఉంటుందన్నారు.

అండగుండాల రోడ్డుకు మరమ్మతులు

తడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు అండగుండాల రోడ్డుకు మోక్షం లభించింది. అక్కంపేట జాతీయ రహదారి నుంచి అండగుండాల గ్రామం వరకు ఉన్న సుమారు 3 కిలోమీటర్ల తారురోడ్డు ధ్వంసమైన విషయం తెలిసిందే. ఆ రోడ్డులో ప్రయాణం నరకప్రాయంగా ఉందని, బాగు చేయాలని గ్రామస్తులు పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నారు. గ్రావెల్‌తో గుంతలను పూడ్చేందుకు అధికారులు రూ.3 లక్షలు కేటాయించారు. సోమవారం పనులను మొదలుపెట్టారు.

విధుల్లోకి కొత్త ఉపాధ్యాయులు



కొత్త టీచర్లతో హెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయులు

కోట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలో కొత్తగా 20మంది ఉపాధ్యాయులు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వంలో డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేసిన విషయం తెలిసిందే. కోట మండలానికి 20మంది ఉపాధ్యాయులను కేటాయించారు. ఇందులో ఎస్‌జీటీ నలుగురు, స్కూల్ అసిస్టెంట్‌లు 16 మంది ఉన్నారు. కోట పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలకు 5మంది ఉపాధ్యాయులను కేటాయించగా, వారికి హెచ్‌ఎం భారతి బాధ్యతలు అప్పగించి అభినందించారు.

తడ: మండలంలో కొత్తగా 9మందిని ఉన్న ఉపాధ్యాయులు నియమితులయ్యారు. ఇందులో ఎస్జీటీలు ముగ్గురు, స్కూల్ అసిస్టెంట్లు 9మంది ఉన్నారు. పల్లిపేటకుప్పం, బీవీపాళెం, ఇరకం, గ్రద్దగుంట, పూడికుప్పం, రామాపురం కుప్పంలో ఒక్కరు చొప్పున నియమితులు కాగా, వాటంబేడు ఉన్నత పాఠశాలకు ముగ్గురు ఉపాధ్యాయులను నియమించారు. వీరంతా సోమవారం ఎంఈవో రాములు, మల్లికార్జున రావుకు జాయినింగ్ రిపోర్టులు అందజేశారు.

జీఎస్టీ సవరణతో తగ్గిన ఆర్థిక భారం

నాయుడుపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీతో ప్రజలకు ఆర్థిక భారం తగ్గిందని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా అన్నారు. సోమవారం నాయుడుపేట ఎంపీడీవో కార్యాలయం నుంచి సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పంచాయతీల పురోగతిపై శిక్షణ తరగతులు

గూడూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పురోగతిపై సర్పంచులకు, ఎంపీటీసీలకు, కార్యదర్శులకు ఎంపీడీవో మధుసూదన్ రావు ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీల ఆర్థికాభివృద్ధిని పెంపొందించుకోవాలన్నారు. గ్రామాల్లో పేదరిక నిర్మూలన కోసం లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని అమలుపరిచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ప్రజలందరికీ సురక్షిత మంచినీటి సరఫరాకు, పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు యామిని, డిప్యూటీ ఎంపీడీవో మోహన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సోమిరెడ్డికి సన్మానం

నాయుడుపేట టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని టీడీపీ నాయకులు సన్మానించారు. సోమవారం పట్టణంలోని శిరసనంబేడు మాజీ సర్పంచ్ శిరసనంబేటి సురేష్‌రెడ్డి నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో సోమిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఎమ్మెల్యేకు శాలువాకప్పి పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో వేలూరు మురళీకృష్ణారెడ్డి, దేవారెడ్డి నాగేంద్రరెడ్డి, గాలి రమేష్ నాయుడు, మైలారి రాజశేఖర్, నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సోమిరెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

వాటర్ ట్యాంకర్ బోల్తా: యువకుడి మృతి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరు సెజ్ సమీపంలో అదుపుతప్పి వాటర్ ట్యాంకర్ బోల్తా పడిన ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ మణి(26) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... ఓజిలి మండలం ముమ్మాయిపాళెం గ్రామానికి చెందిన మణి వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం మేనకూరు సెజ్ సమీపంలో వెళ్తుండగా ట్రాక్టర్‌ను అదుపుతప్పి రోడ్డుపై ఉన్న కంకర్ దిబ్బను ఎక్కడంతో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మణి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌షాక్‌తో...

చిల్లకూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏరూరు గ్రామంలోని రొయ్యలగుంట వద్ద సోమవారం విద్యుత్‌షాక్‌తో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు... మండలంలోని ఏరూరు అల్లీపురం గ్రామానికి చెందిన వెంకటయ్య (33) గ్రామంలోని వెంకటేశ్వర్లుకు చెందిన రొయ్యలగుంట వద్ద పని చేస్తున్నాడు. సోమవారం గుంటల వద్ద ఇనుపరాడ్డును తొలగిస్తుండగా పైనవున్న విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుత్‌షాకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఎడ్లబండిని ఢీకొన్న మోటారు సైకిల్

ఒకరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మూర్తిరెడ్డిపాళెం రహదారి సమీపంలో ఎడ్లబండిని మోటారు సైకిల్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. నెల్లూరు పట్టణానికి చెందిన కరీముల్లా సోమవారం మోటారు సైకిల్‌పై నాయుడుపేట వస్తుండగా మూర్తిరెడ్డిపాళెం సమీపంలో ఎడ్లబండిని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కరీముల్లా తీవ్రంగా గాయపడగా 108వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

గూడూరు అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుందకూరు గ్రామంలో సోమవారం ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ గూడూరు నియోజకవర్గ ఇన్‌చార్జి సిసింద్రి మాట్లాడుతూ మాదిగల ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు ఎమ్మార్పీఎస్ కృషి చేస్తుందన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని ఖండిస్తూ నెల 17వ తేదీన నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏడుకొండలు, గురవయ్య, సాయినాథ్, కిరణ్, పెంచలయ్య పాల్గొన్నారు.

అంధ క్రీడాకారులకు ప్రోత్సాహకాలివ్వండి



రామ్మోహన్ రావుకు వినతిపత్రం ఇస్తున్న నరసయ్య

వెంకటగిరి, అక్టోబర్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అంధ క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాలని కోరుతూ ఆదివారం రాష్ట్ర బ్లైండ్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరుచూరి పెంచల నరసయ్య టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కంభంపాటి రామోహన్ రావును కోరారు. హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కంభంపాటిని కలిసి వినతిపత్రం అందజేశారు.

టపాసులను నిర్ణీత ధరలకే విక్రయించాలి

కోట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని ఎన్‌సీఆర్ కల్యాణ మండపంలో దీపావళి పండుగకు 17 టపాసుల దుకాణాలు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దారు జయజయరావు తెలిపారు. ఆయా దుకాణదారులు టపాసులను నిర్ణీత ధరలకే విక్రయించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

బాణసంచా దుకాణాల్లో జాగ్రత్తలు పాటించాలి

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని తిరుపతి నగరంలో ఏర్పాటు చేసే బాణసంచా విక్రయకేంద్రాల వద్ద తగు జాగ్రత్తలు పాటించాలని డీఆర్వో నరసింహులు సూచించారు. ఈ మేరకు అధికారులతో కలెక్టరేట్‌లో సోమవారం ఆయన సమీక్షించారు. దుకాణాల మధ్య కనీసం మూడుమీటర్ల దూరం ఉండాలన్నారు. అనుమతి లేకుండా బాణసంచా తయారు చేసినా, నిల్వ ఉంచినా, విక్రయించినా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రవి మనోహరాచారి, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.5లక్షల టపాసుల సీజ్

తిరుచానూరు. అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తనపల్లె గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.5 లక్షల విలువైన బాణసంచాను సీజ్ చేసినట్లు తిరుచానూరు సీఐ సునీల్ కుమార్ సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన దామోదర్‌రెడ్డి తమిళనాడు నుంచి టపాసులు తెప్పించి నిల్వ ఉంచాడని, స్థానికుల సమాచారం మేరకు సీజ్ చేసి, దామోదర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

శ్మశాన భూమికి మోక్షం కల్పించండి



తహసీల్దారు కార్యాలయం వద్ద టీడీపీ నాయకులు, గిరిజనులు

కోట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కబ్జాకు గురైన శ్మశాన భూమిని ఆక్రమణదారుల నుంచి రక్షించాలని కోట పట్టణ పరిధిలోని శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీవాసులు సోమవారం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో తహసీల్దారు జయజయరావుకు వినతిపత్రం అందజేశారు. లక్షలాది రూపాయలు విలువ చేసే శ్మశానవాటిక భూమిని కొంతమంది కబ్జా చేశారని, దీంతో శవాలను పూడ్చిపెట్టేందుకు స్థలం దొరక్క ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ గురుకుల సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని గిరిజనులు తరతరాల నుంచి శ్మశానవాటికగా వాడుకుంటూ వచ్చామన్నారు. ఆ భూమిని కొంతమంది కబ్జా చేశారని, దీంతో గిరిజనకాలనీలో ఎవరైనా చనిపోతే పూడ్చుకునేందుకు స్థలం దొరక్క మూడు కిలోమీటర్లు వెళ్లి స్వర్ణముఖినదిలో శవాలను పూడ్చిపెడుతున్నామని చెప్పారు. టీడీపీ నాయకులు నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, షేక్ జలీల్ అహ్మద్ ద్వారా ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పరిస్థితిని తెలుసుకున్నారు. తహసీల్దారుకు సమాచారం ఇవ్వడంతో స్పందించిన ఆయన ఆక్రమిత శ్మశానభూమి సర్వే ప్రారంభించారు.

ప్రాథమిక పాఠశాలకు తాగునీటి సౌకర్యం



తాగునీటి కొళాయిని ప్రారంభిస్తున్న ఎంఈవో కృష్ణయ్య

చిట్టమూరు, అక్టోబర్ 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యల్లసిరి ప్రాథమిక పాఠశాలలో తాగునీటి బోరును ఎంఈవో బీవీ కృష్ణయ్య సోమవారం ప్రారంభించారు. కొండేపాటి గంగాప్రసాద్(కేజీపీ) ఫౌండేషన్ నిర్వాహకులు తానంకి నానాజీ పాఠశాలలో రూ.లక్ష వ్యయంతో ఫిల్టర్ పాయింట్ వేసి సింటెక్స్ డ్రమ్ ద్వారా కొళాయిలు ఏర్పాటు చేశారు. అలాగే పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో యల్లసిరి మాజీ సర్పంచ్ పోలిన శ్రీనివాస్, హెచ్‌ఎం సాయికృష్ణ, నాగూరయ్య, వేణుగోపాల్, ప్రసాద్ రెడ్డి, భాస్కర్, మణి, వినయ్‌వతి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

తడ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): విధుల్లో అలసత్వం వహించిన పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో శేఖర్‌నాయక్ షోకాజ్ నోటీసులు జారీచేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో నిర్వహించాల్సిన పనులు సర్వేల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ గ్రద్దగుంట, వేనాడు పంచాయతీ కార్యదర్శులు రావి చైతన్య, నరేష్‌బాబుపై ఫిర్యాదులు అందాయి. సోమవారం ఎంపీడీవో శేఖర్‌నాయక్ వారి ఇరువురికి షోకాజ్ నోటీసులు జారీచేశారు.

లైసెన్స్ లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

వెంకటగిరి టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి సర్కిల్ పరిధిలోని వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో ఎక్కడైనా లైసెన్స్ లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రమణ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా అమ్మకాలు చేస్తే 112కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

నాణ్యతా ప్రమాణాలతో విద్యాబోధన చేయాలి



ఉపాధ్యాయుల నుంచి నియామక పత్రాలను స్వీకరిస్తున్న ఎంఈవో మునిరత్నం, మీనాకుమారి

నాయుడుపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో 14 మంది కొత్త ఉపాధ్యాయులు బాధ్యతలు చేపట్టారని ఎంఈవో మునిరత్నం తెలిపారు. నాయుడుపేట ఎల్ఏ సాగరంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ధనలక్ష్మి(సైన్స్) శ్రావణి(సోషల్), సుజిత(ఇంగ్లీషు) తమ జాయినింగ్ రిపోర్టులను ఎంఈవో మునిరత్నం, ప్రధానోపాధ్యాయురాలు మీనాకుమారికి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గడదాసు వెంకటేశ్వర్లు, జీవీ నాయుడు, జి.సుబ్రహ్మణ్యం, డీవీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని నిర్ణయాలతో రాష్ట్రానికి అన్యాయం

గూడూరు అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ నిర్ణయాలతో రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ అన్నారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన హామీలను తుంగలో తొక్కిన ప్రధాని రాష్ట్ర పర్యటనకు రావడం ఎంతవరకు సమంజసమన్నారు. మోదీ పర్యటనను నిరసిస్తూ 15న పట్టణంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో శశివకుమార్, నారాయణ, రమేష్, సునీల్, వెంకటయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆర్థిక ప్రణాళికలపై అవగాహన సదస్సు

నాయుడుపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఎంపీడీవో కార్యాలయంలో మంగళ, బుధవారాల్లో రెండు రోజులపాటు మండలస్థాయిలో స్వయం ఆర్థిక ప్రణాళికలపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు.

కార్యదర్శులు, సర్పంచులకు శిక్షణ తరగతులు

తడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శేఖర్‌నాయక్ తెలిపారు. మంగళ, బుధవారాల్లో ఎంపీడీవో సమావేశ మందిరంలో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు.

ఉమెన్ టి20 క్రికెట్ జట్టులో జిల్లా క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా అండర్ 19 ఉమెన్స్ టి20 క్రికెట్ జట్టులో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఐదుగురు మహిళా క్రీడాకారులకు స్థానం లభించింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీలలో తిరుపతికి చెందిన ఎం.గిరీష్మసైనిరెడ్డి(వైస్ కెప్టెన్), కె.శుభశ్రీ, ఎ.విష్ణుప్రియ, ఎం.పర్ణితయాదవ్, వాయల్పాడుకు చెందిన ఎం.రుక్సార్‌తబ్సుమ్ సత్తాచాటారు. వీరిని జట్టుకు ఎంపిక చేశారు.